# భారత
# కమ్యూనిస్టు పార్టీ
# (మార్క్సిస్టు)

# 24వ మహాసభ

# రాజకీయ తీర్మానం ముసాయిదా

2025 జనవరి 17–19 తేదీలలో కొల్‌కతాలో

జరిగిన కేంద్ర కమిటీ ఆమోదించినది

ప్రచురణ : **భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

**ఆంధ్రప్రదేశ్ కమిటీ**

# భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)

# 24వ మహాసభ

# రాజకీయ తీర్మానం ముసాయిదా

(2025 జనవరి 17-19 తేదీలలో కొల్‌కతాలో
జరిగిన కేంద్ర కమిటీ ఆమోదించినది)

## ప్రవేశిక

01. 23వ మహాసభ అనంతర కాలంలో మోడీ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూత్వ-కార్పొరేట్ శక్తుల పాలనకు, దానిని వ్యతిరేకిస్తున్న లౌకిక-ప్రజాస్వామిక శక్తులకు మధ్య ఘర్షణ పెరగడం ప్రధాన ధోరణిగా ఉంది. మితవాద హిందూత్వ ఎజండాను ముందుకు నెట్టడానికి, ప్రతిపక్షాన్ని, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి అనుసరిస్తున్న నియంతృత్వ పద్ధతులు నయా - ఫాసిస్టు స్వభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ - కార్పొరేట్ విధానాలను సిపిఐ(ఎం), ఇతర వామపక్ష పార్టీలు దృఢంగా వ్యతిరేకిస్తున్నాయి. కార్మికులు, రైతాంగం, ఇతర తరగతులకు చెందిన కష్టజీవులు తమ జీవనోపాధిని, ఆర్థిక హక్కులను పరిరక్షించుకోవడానికి ఐక్యపోరాటాలు నడిపారు.

02. 2024 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి ఎదురుదెబ్బ తిన్నది. లోక్‌సభలో అది మెజార్టీ కోల్పోయింది. బలం పుంజుకున్న ప్రతిపక్షాన్ని పార్లమెంటులో ఎదుర్కొంటున్నది. అయినప్పటికీ, మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం బిజెపి - ఆరెస్సెస్ యొక్క హిందూత్వ, నయా ఉదారవాద ఎజండాను కొనసాగిస్తున్నది. ఎన్నికల ఫలితాలు మోడీ ప్రభుత్వపు కార్పొరేట్ అనుకూల హిందూత్వ విధానాలను పార్లమెంటు లోపల, వెలుపల విస్తారంగా ప్రతిఘటించడానికి మరింత అవకాశాన్ని కల్పించాయి.

03. గత మూడేళ్ళలో మోదీ ప్రభుత్వం అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసింది. సైనిక సహకారానికి పునాదిగా ఉండే ఒప్పందాలు కుదిరాయి. ఆసియా ఫసిఫిక్ ప్రాంతంలో అమెరికా రాజకీయ – భౌగోళిక ప్రయోజనాలతో అది మరింతగా అంటకాగడం నానాటికీ పెరుగుతోంది. 'క్వాడ్' కూటమిలో భాగస్వామిగా చేరడం, సిగ్గుమాలిన రీతిలో గాజాపై ఇజ్రాయిల్ దారుణ జాతిహనన యుద్ధాన్ని సమర్థించడం అందులో భాగమే. అంతర్జాతీయ పరిణామాల, మన జాతీయ పరిస్థితులపై ప్రత్యక్షంగా ప్రభావం చూపే భౌగోళిక రాజకీయ సంబంధాల నేపథ్యంలో ఈ పరిణామాలను పరిశీలించాలి.

# అంతర్జాతీయ పరిస్థితి

1.1. 23వ మహాసభ అనంతర కాలంలో అంతర్జాతీయ పరిస్థితులలో ప్రధాన ధోరణులు :

i) 23వ మహాసభ అనంతరం ప్రపంచంలో అమెరికన్ సామ్రాజ్యవాదం జోక్యంతో రెండు ప్రధాన యుద్ధాలు జరిగాయి. గాజాలో వేలాదిమంది పౌరుల మరణానికి కారణమైన ఇజ్రాయిల్ దురాక్రమణకు అది చురుకుగా మద్దతునిస్తోంది. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు మారణాయుధాలనందిస్తూ బలపరుస్తోంది.

ii) వ్యవస్థను మొత్తంగా ఆవరించిన సంక్షోభం పర్యవసానంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు మందకొడిగా ఉంది. అసమానతలు, దారిద్ర్యం, నిరుద్యోగం, పౌష్టికాహారలోపం, క్షుద్బాధ పెరుగుతున్నాయి.

iii) తమ హక్కులను కాపాడుకునేందుకు, ఆర్థిక కడగండ్లను ప్రతిఘటిస్తూ అభివృద్ధి చెందిన దేశాలతో సహా అనేక దేశాల్లో కార్మికవర్గ పోరాటాలు జరుగుతున్నాయి అయితే,

iv) గతంలో గుర్తించినట్లు గానే, మితవాద రాజకీయాలవైపు మొగ్గు కొనసాగుతుంది. అనేక దేశాల్లో పచ్చి మితవాద రాజకీయ పార్టీలు ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకున్నాయి. అయితే ఇదే కాలంలో వామపక్షాలు కొలంబియా, బ్రెజిల్, మెక్సికో, ఉరుగ్వే, శ్రీలంక దేశాల్లో వామపక్ష పార్టీలు పురోగమించాయి.

v) అమెరికా చైనాల మధ్య ఘర్షణ తీవ్రతరం అవుతున్నది

vi) సోషలిస్టు దేశాలు సామ్రాజ్యవాదుల దాడులను సమర్థవంతంగా ప్రతిఘటిస్తున్నాయి.

vii) సామ్రాజ్యవాదానికి, యుద్ధాలకు, దురాక్రమణలకు వ్యతిరేకంగా ఎల్లెడలా నిరసనలు తలెత్తుతున్నాయి.

viii) ఉష్ణోగ్రతల మార్పులపై తగు చర్యల విషయంలో చేసిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఇది ఉష్ణోగ్రతల్లో విపరీతమైన మార్పులకు దారి తీస్తోంది. ప్రజానీకానికి, ముఖ్యంగా దక్షిణార్ధగోళ దేశాల వారికి తీరని నష్టం వాటిల్లుతున్నది.

ix) మన పొరుగు దేశాల్లో తీవ్ర స్థాయిలో తలెత్తిన ప్రజాబాహుళ్య నిరసనలు అక్కడ ఎన్నికైన ప్రభుత్వాల పతనానికి దారి తీశాయి.

x) ఇరుగు పొరుగు దేశాలలో మన దేశం ఒంటరిపాటుతనం కొనసాగుతోంది.

## పాలస్తీనాలో ఇజ్రాయిల్ జాతిహత్యాకాండ

1.2. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి చేసిన అనంతరం ఇజ్రాయిల్ గత పదిహేను నెలలుగా గాజాపై దాడులకు పాల్పడుతూ జాతిహత్యాకాండకు పూనుకున్నది. కాల్పుల విరమణ ప్రకటించే నాటికి ఇజ్రాయిల్ సాగించిన క్రూరమైన దాడులలో 47.035 మంది పాలస్తీనియన్లు మరణించారు. లక్షమందికి పైగా గాయపడ్డారు. మరణించిన వారిలో 60 శాతం మహిళలు, పిల్లలు. స్కూళ్ళు, ఆసుపత్రులు, ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న శరణార్థి శిబిరాల మీద, నిరాయుధులైన పౌరులమీద కూడా బాంబుదాడులకు తెగబడి ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడింది. డ్రోన్లను, నిషేధిత ఆయుధాలను ఉపయోగించడమే కాక వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని హత్యలకూ తెగబడింది. అమెరికా అధికార యంత్రాంగం, దాని మిత్రపక్ష దేశాల దన్నుతో ఇజ్రాయిల్ పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్‌ను ఆక్రమించుకునే దృష్టితో ఉంది.

1.3. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ పాలస్తీనాను విధ్వంసం కావిస్తూనే పశ్చిమాసియాలోని అనేక దేశాల మీద దాడులకు పూనుకున్నది. 2023 నుండి అమెరికా ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాను పెంచింది. ఇజ్రాయిల్‌కు అందించే ఆర్థిక సహాయాన్ని 3.6 బిలియన్ డాలర్ల నుండి ఐదింతలుగా, 17.9 బిలియన్ డాలర్లకు పెంచింది. ఐక్యరాజ్య సమితిలో ప్రవేశపెట్టిన తక్షణ కాల్పుల విరమణ తీర్మానాలు అన్నింటినీ అమెరికా వీటో చేసింది. ఇజ్రాయిల్ చర్యలు జాతిహత్యాకాండ కోవకు చెందుతాయని అంతర్జాతీయ న్యాయ స్థానం ఇచ్చిన తీర్పును అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు రెండూ లెక్కచెయ్యలేదు. అమెరికా ప్రయోజనాలు నెరవేరాలంటే

ఇజ్రాయిల్ ఈ ఘర్షణ క్రమంలో మరింత బలపడాలి. అప్పుడే అమెరికా పశ్చిమాసియా ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని నిలుపుకోగలదు.

1.4. కాల్పుల విరమణ ప్రకటించే ముందు ఇజ్రాయిల్ లెబనాన్ మీద దాడులు చేసి యుద్ధరంగాన్ని విస్తరించింది. అక్కడ 3,700 మంది అమాయక పౌరుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నది. సిరియా, యెమెన్, ఇరాన్, ఇరాక్‌ల మీద కూడా బాంబు దాడులకు తెగబడింది. యెమెన్ మీద చేసిన దాడులలో అమెరికా, బ్రిటన్‌లు కూడా తోడయ్యాయి. ఇరాన్ మీద ఇజ్రాయిల్ దాడిని అవి సమర్థించాయి. ఇరాన్, సిరియా దేశాలలో అత్యున్నత ఇరాన్ సైనికాధికారులు హతమయ్యారు.

1.5. కాల్పుల విరమణ ప్రకటనతో ప్రస్తుతానికి గాజా మీద ఇజ్రాయిల్ దాడులు ఆగాయి. ఈ కాల్పుల విరమణ మూడు దశలుగా అమలవుతుంది. దీనిపై ప్రకటన వెలవడి 24 గంటలు గడవక ముందే గాజా మీద ఎప్పుడైనా దాడి చేసే హక్కు తనకు ఉన్నదని ఇజ్రాయిల్ ప్రకటించి కాల్పుల విరమణ ఒప్పందపు అనిశ్చిత స్వభావాన్ని బట్టబయలు చేసింది.

## సిరియా : అస్సాద్ పతనం

1.6. సిరియాలో బషర్ – అల్ – అస్సాద్ ప్రభుత్వ పతనం తీవ్ర, విపత్కర పర్యవసానాలకు దారి తీస్తుంది. పశ్చిమాసియాలో చిట్టచివరి లౌకిక రాజ్యం కూలిపోవడం ఈ ప్రాంతాన్ని అస్థిరత పాలుచేసి, అంతః కలహాలు పెరగడానికి దారి తీస్తుంది. అసాద్ మీద సాయుధ దాడికి నాయకత్వం వహించిన హయత్ తహ్రీర్ అల్ – షామ్ (హెచ్.వి.యస్) అనే ఇస్లామిక్ సంస్థ అధికారం చేజిక్కించుకున్నది. వివిధ మైనారిటీ మతాల ప్రయోజనాలను కాపాడతామని ప్రకటించినా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మైనార్టీల మీద దాడులు జరుగుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. మరిన్ని దాడులు జరుగుతాయన్న భయంతో వారు సిరియా నుండి వలసపోతున్నారు. సిరియా భూభాగాన్ని హెచ్.వి.యస్, ఇజ్రాయిల్, టర్కీలు తమ తమ పట్టు కలిగివుండే ముక్కలుగా చేయడానికి చూస్తున్నాయి. గొలన్‌హైట్స్ వద్ద ఉన్న తటస్థ భూభాగాన్ని దాటి ఇజ్రాయిల్ సైన్యం అక్కడ తిష్టవేసింది. సరిహద్దు భూభాగాలను తన నియంత్రణలోకి తీసుకుని కుర్దులను అణిచివెయ్యాలని టర్కీ కోరుకుంటోంది. మరో పక్క, కుర్దులను సమర్థించే అమెరికా, దాని మిత్రులు హెచ్ టి యస్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చి తమ సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. లౌకిక దేశాల పాలిట ప్రమాదకరంగా దాపురించే

మత ఛాందస శక్తులను, ఉగ్రవాద శక్తులను పెంచి పోషించే చరిత్ర అమెరికాకి ఉన్న దృష్ట్యా ఇది అనూహ్యామేమీ కాదు.

## ఉక్రెయిన్‌లో యుద్ధం

1.7. రష్యా – ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇరువైపులా దాడులు తీవ్రతరం అయ్యాయి. రష్యా భూభాగం మీద దాడులు చేసే విధంగా దీర్ఘశ్రేణి క్షిపణుల వాడకానికి అమెరికా ఉక్రెయిన్‌ను అనుమతించింది. ఈ దాడులను 'నాటో'' దేశాల ప్రత్యక్ష దాడులుగానే పరిగణిస్తామని, అణ్వాయుధాలు ప్రయోగిస్తాం అని రష్యా ప్రకటించింది. అమెరికా, నాటో ఆయుధాలు, ఆర్థిక సహాయంతో సహా యావత్తు మద్దతునూ అందించినా ఉక్రెయిన్ తన తూర్పు భూభాగం నుండి రష్యన్ సేనలను వెనక్కు నెట్టలేకపోతున్నది. కనీసం తన బలగాల స్థావరాలను కూడా నిలబెట్టు కోలేకపోతున్నది. డాన్‌బాస్ భూభాగం మీద మీద పట్టు పెంచిన రష్యా ఉక్రెయిన్ తూర్పు ప్రాంతాల్లోకి నిలకడగా చొచ్చుకుపోతున్నది. రష్యాను బలహీనపరిచి, అదుపు చేయాలనే లక్ష్యం కోసం అమెరికా ఉక్రెయిన్‌ను వాడుకుంటోంది.

1.8. రష్యా పై అమెరికా, దాని మిత్రదేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలు రష్యన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయలేకపోయాయి. రష్యాకు అనేక వర్ధమాన దేశాలతో ప్రత్యకించి చైనా, భారత్‌లతో, స్నేహ, వాణిజ్య సంబంధాలు ఉన్న కారణంగా ఈ ఆంక్షల ఉచ్చు నుండి తప్పించుకోగలిగింది. స్థానిక కరెన్సీలలో లావాదేవీలు జరపడం, చౌక ధరలకు ముడి చమురును సరఫరా చెయ్యడం ద్వారా రష్యా తన మార్కెట్ వాటాను నిలుపుకుని, ఆంక్షల ప్రభావాన్ని అధిగమించగలిగింది. రష్యా వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థను ఎదుర్కోడానికి ఆంక్షలను ఒక ఆయుధంగా పని చెయ్యవని పై కారణాలరీత్యా బైటపడింది. పై పెచ్చు రష్యా నుండి చమురు కొనుగోలు పై నిషేధం మూలంగా ఐరోపా దేశాలు బాగా నష్టపోయాయి. గ్యాసు, ఆహారధాన్యాల ధరలు పెరగడం మూలంగా ఆయా దేశాల ప్రజలపై భారాలను మరింత పెంచాయి.

## ఆసియా ఫసిఫిక్ ప్రాంతం పెరుగుతున్న ఉద్రిక్తతలు

1.9. చైనాను అదుపు చేసి ఒంటరి చేయాలన్న ప్రయత్నాలలో భాగంగా ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో అమెరికన్ నౌకాదళ, సైనిక బలగాల మోహరింపు, విన్యాసాలు పెరిగాయి. ఈ చర్యలు ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను సృష్టిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని దేశాలతో అమెరికా తన సైనిక కూటములను (రక్షణ ఒప్పందాలను) బలోపేతం చేసుకోడానికి ప్రయత్నిస్తోంది. ఎదురుదాడి చేయగల ఒక కొత్త మధ్యంతర

శ్రేణి భూతల క్షిపణి వ్యవస్థను ఆ ప్రాంతంలో మోహరించనారంభించింది. తైవాన్ కు ఆయుధాలను అందించడం, వేర్పాటువాద శక్తులకు బాహాటంగా మద్దతు నందించడం వంటి చర్యలతో చైనా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా అడ్డగోలుగా జోక్యం చేసుకుంటోంది.

1.10. **కొరియన్ ద్వీపకల్పం :** అమెరికా పురికొల్పడంతో, కొరియన్ ద్వీపకల్పంలో పరిస్తితి ఉద్రిక్తంగా కొనసాగుతోంది. దాని వలన ఆ ప్రాంతపు భద్రత తీవ్రంగా దెబ్బ తింటోంది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా తమ త్రైపాక్షిక సైనిక సహకారాన్ని బలోపేతం చేసుకుని ఉధృతంగా సంయుక్త సైనిక విన్యాసాలను నిర్వహిస్తున్నారు. ఉత్తర కొరియా (డిపిఆర్‌కె), దక్షిణ కొరియాతో తన సంబంధాల విధానాన్ని మార్చుకుని ఉత్తర, దక్షిణ కొరియాల ప్రజలు ఒకే జాతికి చెందినవారు కాదని, శత్రువులని, యుద్ధంలో ఎదురెదురుగా మోహరించి వున్నారని ప్రకటించింది. రెండు పక్షాల నడుమ సంబంధాలు చారిత్రికంగా కనిష్ట స్థాయికి చేరుకున్నాయి.

1.11. ఈ ప్రాంతంలో చైనా, ఉత్తర కొరియా, రష్యాలే అమెరికాకు ప్రధాన లక్ష్యాలన్నది స్పష్టం. వీటికి అమెరికా అధికారికంగా 'రివిజనిస్టు శక్తి' (చైనా), 'హానికర రాజ్యం' (రష్యా), 'పోకిరి రాజ్యం' (ఉ.కొరియా) అని హోదాలను ప్రకటించింది.

1.12. తన ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతున్నా, యావత్ ప్రపంచంమీదా అమెరికా తన పెత్తనాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్, పశ్చిమాసియా లలో అమెరికా జోక్యం దాని సైనిక పాటవపు పరిమితులను వెల్లడి చేశాయి. రష్యా, చైనాల బలమైన భాగస్వామ్యం, వాటి వెనుక పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు సమీకరణ కావడం అమెరికన్ బలగపు బలహీనతలను మరింత బహిర్గతం చేశాయి. పెరుగుతున్న రష్యా, చైనాల పట్టును ఎదుర్కోడానికి జి-7, నాటో వంటి తన కూటములను బలోపేతం చేయడం, మరెన్నో కొత్త కూటములను ఏర్పరచడం వంటి ప్రయత్నాలను అమెరికా చేస్తోంది. పరస్పరం తలపడే రెండు పక్షాలుగా ప్రపంచం క్రమంగా మారేలా నెట్టబడుతోంది. ఇది మరొక ప్రచ్ఛన్న యుద్ధానికి తెర తీస్తోంది.

1.13. అమెరికన్ ప్రభుత్వం తన మిత్రులను రష్యా, చైనాలకు వ్యతిరేకంగా సమీకరించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, సామ్రాజ్యవాద దేశాల నడుమ విభేదాలు ఉన్నట్టు 23వ మహాసభలో మనం గుర్తించాం. ఈ కాలంలో ఆ విభేదాలను పరిష్కరించడానికి నాటోను, జి-7ను ఉపయోగించి అమెరికా తన మిత్రులను రష్యా, చైనాలకు వ్యతిరేకంగా కూడగట్టి విభేదాలను పరిష్కరించుకునే దిశగా కదిలింది. చైనా, రష్యాలు ఆందోళన కలిగిస్తున్న దేశాలని, వాటిని అదుపు చేయవలసిన

అవసరం ఉందని నాటో, జి-7 రెండూ ప్రకటించాయి, ఆ విధంగా సామ్రాజ్యవాద దేశాల నడుమ అంతర్వైరుధ్యాలు చడీ చప్పుడూ లేని దశలోనే కొనసాగుతున్నాయి. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టడంతో శీతోష్ణస్థితి మార్పుల మీద, యూరపియన్ కూటమి పైన, నాటో పైన ట్రంప్ చేపట్టే విధానాల కారణంగా సామ్రాజ్యవాద దేశాల నడుమ సంబంధాలలో ఒత్తిడులు మళ్ళీ పొడచూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## పెరుగుతున్న సైనిక వ్యయం

1.14. ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం వరుసగా తొమ్మిదో ఏడాది కూడా పెరిగి 2023 నాటికి 2.44 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. రక్షణ కోసం అత్యధిక వ్యయం చేసే దేశంగా అమెరికా కొనసాగుతోంది. నాటో దేశాలతో కలిపి చూస్తే ప్రపంచ సైనిక వ్యయంలో సగభాగం ఈ దేశాలదే. కాల పరిమితి అయిపోయిన అణ్వస్త్ర నిరోధక ఒప్పందాలపై మళ్ళీ సంతకం చేయడానికి అమెరికా విముఖంగా ఉంది. నూతన వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం (న్యూ స్ట్రాటజిక్ ఆర్మ్సరిడక్షన్ ట్రీటీ, లేదా న్యూ స్టార్ట్) అమెరికా, రష్యాల మధ్య అణ్వాయుధ నియంత్రణ ఒప్పందాలలో చివరిది. ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలయ్యాక ఈ ఒప్పందం సస్పెండ్ అయింది. అనేక ఆయుధ నియంత్రణ ఒప్పందాలకాలం తీరిపోవడం, ప్రజాబాహుళ్య విధ్వంసానికి ఉపయోగించే కొత్త ఆయుధాల తయారీ కోసం చేసే ఖర్చును పెంచడం యావత్ ప్రపంచాన్ని పెనుప్రమాదంలో నెడుతుంది.

1.15. ఆఫ్రికా ఖండంలో సైనిక కుట్రలు, పెద్ద సంఖ్యలో ప్రజల్ని నిర్వాసితుల్ని గావించే అంతర్గత ఘర్షణలు పెరిగాయి. 2022 నుండి ఆఫ్రికా ఖండంలో ఎనిమిది సైనిక కుట్రలు జరిగితే వాటిలో మూడు ఫలించాయి. ఘర్షణల, సామాజిక కల్లోలాల కారణంగా 45 మిలియన్ల ప్రజానీకం నిర్వాసితులయారు. కలిసికట్టుగాఉండే సాహెల్ ప్రాంతం, గ్రేట్ లేక్స్, హార్న్ అఫ్ ఆఫ్రికాలలో 15 దేశాలు ఈ ఘర్షణల ప్రభావానికి ఎక్కువగా గురయ్యాయి. వీటిలో సుడాన్ దేశం భారీ నష్టానికి గురయ్యింది. అక్కడ అంతర్యుద్ధం చెలరేగుతోంది. తన సైనిక కమాండ్ కేంద్రం 'ఆఫ్రికామ్' ద్వారా అమెరికా పలు ఆఫ్రికన్ దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యాన్ని కొనసాగిస్తోంది. ఒకప్పుడు ఫ్రెంచి వలసలుగా ఉన్న మాలి, బుర్కినాఫాసో, నైగర్, ఛాద్, సెనెగల్, ఐవరీకోస్ట్ దేశాల నుండి వాటి బలవంతం మీద ఫ్రాన్స్ గత మూడేళ్ళలో తన సైన్యాన్ని ఉపసంహరించుకోవలసి వచ్చింది. తమ భూభాగం నుండి విదేశీ సేనలు వైదొలగాలని ప్రజానీకం నిరసనలకు పూనుకున్నారు. పలు ఆఫ్రికన్ దేశాలు తమ సంబంధాలను

విస్తరించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఇందుకు సామ్రాజ్యవాద దేశాలు తమ అయిష్టతను ప్రదర్శిస్తున్నాయి.

1.16. **ఐక్యరాజ్య సమితి పాత్ర :** గాజా, ఉక్రెయిన్, సుడాన్, కాంగో తదితర దేశాలలో కొనసాగుతున్న అత్యంత హింసాత్మక ఘర్షణలను నిలుపు చేయడంలో ఐక్యరాజ్య సమితి విఫలం అయ్యింది. రాజకీయంగా, సైనికంగా, ఆర్థికంగా బలంగా ఉంటూ వీటో అధికారం ఉన్న దేశాల వద్దే వాస్తవ అధికారం ఉందని అంతకంతకూ మరింత స్పష్టమౌతోంది. అమెరికా, ఇజ్రాయిల్ వంటి దేశాలు తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి నిర్వహణకు చెల్లించవలసిన తమ వాటాలను సైతం నిరాకరించాయి. అంతర్జాతీయ న్యాయాన్ని కాపాడడం కోసం ఏర్పరచిన ఐక్యరాజ్య సంస్థలనే చట్టవిరుద్ధంగా ప్రకటిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నింటికీ సమానంగా అధికారాలు లేకపోవడం వల్లే అంతర్జాతీయ శాంతిని, భద్రతను పరిరక్షించడంలో ఐరాస విఫలమౌతోంది. ఐక్యరాజ్య సమితి, దాని అనుబంధ సంస్థలను తక్షణమే ప్రజాస్వామీకరించాలని ఈ పరిస్థితి సూచిస్తోంది.

1.17. **బహుళ ధృవ ప్రపంచం దిశగా :** 'బ్రిక్స్' కూటమి ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదు కొత్త సభ్యులను చేర్చుకుని విస్తరించింది. నూతనంగా ఆవిర్భవించిన బ్రిక్స్ ప్లస్ కూటమి ప్రపంచంలో సగానికి పైగా జనాభాకు, ప్రపంచ జిడిపిలో 37 శాతానికి ప్రతినిధిగా ఉంది. ఈ సభ్య దేశాలు తమతమ జాతీయ కరెన్సీలలో వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తూ తద్వారా వాణిజ్యంలో డాలర్ మీద ఆధారపడడాన్ని తగ్గించాలని నిర్ణయించుకున్నాయి.

ఇది అమెరికన్ సామ్రాజ్యవాదానికి, డాలర్ ఆధిపత్యానికి పెద్ద దెబ్బ. అనేక దేశాలు ఈ కూటమిలో చేరడానికి ఆసక్తి చూపుతూ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. 'కూటమి'ని మరింత విస్తరించే క్రమంలో ఒక ముందడుగుగా ఈ దేశాలకు 'భాగస్వామ్య రాజ్యాల' స్థాయిని కల్పించి సంబంధాలు నెలకొల్పుకుంటున్నది. 'బ్రిక్స్' ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికగా లేదు. అయినప్పటికీ అది ఒక బహుళపక్ష వేదికగా ఆవిర్భవించి అమెరికా చుట్టూ తిరిగే ఏకధృవ ధోరణిని సవాలు చేస్తూ బహుళ ధృవ ధోరణిని బలపరచడానికి తోడ్పడవచ్చు.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

1.18. ఆర్థిక వృద్ధి మందకొడిగా ఉండడం అనేది ప్రస్తుత ప్రపంచ ఆర్థికవ్యవస్థకు సర్వ సాధారణం అయిపోయిన కొత్త లక్షణం. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం, 2024 2025 సంవత్సరాల్లో ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు 3.2 శాతం

దగ్గర నిలకడగా ఉండనుంది. కోవిడ్ ఉత్పాతానికి ముందుకాలంలో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు సాధించిన వృద్ధిరేటు కన్నా ఇది తక్కువ. ఈ వృద్ధిరేటుతో ప్రస్తుత ఆర్థిక, సామాజిక, పర్యావరణ, అభివృద్ధి సవాళ్ళను అధిగమించే పరిస్థితి కనబడటం లేదు. ప్రత్యేకించి అభివృద్ధి రేటు కనిష్ట స్థాయిలో ఉన్న 46 దేశాల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి కనీసంగా అవసరమైన 7 శాతం వృద్ధిరేటు కన్నా ఇది చాలా తక్కువగా ఉండడం బాధాకరం.

1.19. **పెరుగుతున్న ధరలు – తరుగుతున్న కొనుగోలు శక్తి :** కొనసాగుతున్న ద్రవ్యోల్బణం ప్రపంచ ప్రజానీకపు ఆందోళనకు ఒక ప్రధాన కారణం. 2024లో వినిమయ ధరలు ప్రపంచం మొత్తం మీద 4.3 శాతం పెరిగాయి. పెరుగుతున్న వినిమయ ధరల వలన అటు అభివృద్ధి చెందిన దేశాలోలను, ఇటు వర్ధమాన దేశాల్లోనూ ప్రజల కొనుగోలు శక్తి తరిగిపోయింది. 2023లో ఆహార సరుకుల ధరలు చాలా ఎక్కువ స్థాయిలో కొనసాగాయి. 2023 డిసెంబరు నెల నాటికి మాత్రమే ఆహార ధరల సూచిక 2022 ఫిబ్రవరి నాటి స్థాయి కన్నా కిందకు దిగివచ్చిందని అంక్టాడ్ (యుఎన్‌సిటిఎడి) ఆహారసూచికను బట్టి స్పష్టం అవుతున్నది. ఇవి కూడా కోవిడ్ ఉత్పాతం ముందు నాటి ధరలతో పోలిస్తే 20 శాతం అధికం. నూనె గింజలు, నూనెలు వంటి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఇదేమాదిరి ఆటుపోట్లకు గురయ్యాయి. బియ్యం ధర ఫిబ్రవరి 2022 నాటి స్థాయినుండి నేటికీ తగ్గలేదు. ఎరువుల ధరలు కూడా కోవిడ్ ఉత్పాతం ముందు కాలపు ధరల కన్నా పై స్థాయికి పెరిగాయి.

1.20. ఉక్రెయిన్ యుద్ధం వంటి ప్రాంతీయ యుద్ధాలు, సరుకుల ధరల పెరుగుదల, మార్కెట్ కేంద్రీకరణ పెరిగిపోవడం, బడా కార్పొరేట్లు, ముఖ్యంగా ఆహార–వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం, ఇంధన రంగం వంటి రంగాలకు చెందిన కార్పొరేట్ సంస్థలు ధరలు నిర్ణయించిన విధానం తదితర కారణాలు ద్రవ్యోల్బణం పెరుగుదలకు దోహదం చేసాయి. మార్కెట్‌లో పోటీ లేకుండా కూడబలుక్కుని ధరలను నిర్ణయించే పద్ధతులను, మార్కెట్‌లో తమ ఆధిపత్య స్థానాన్ని దుర్వినియోగం చేసే ధోరణిని, కీలక రంగాల్లో కార్పొరేట్ల కేంద్రీకరణను అదుపు చేసి వ్యవసాయ ఉత్పత్తుల ధరల విషయంలో చట్టా వ్యాపారాన్ని నిరోధించనిదే సరుకుల అధిక ధరలనుండి ఊరట లభించదు.

1.21. **కార్మికవర్గం మీద దాడులు :** కార్మికవర్గం నిజ వేతనాలు పెరగనందువలన సరుకుల ధరల పెరుగుదల ప్రభావం కార్మికవర్గం మీద తీవ్రంగా పడింది. 79.10 కోట్ల మంది కార్మికుల వేతనాలు ద్రవ్యోల్బణానికి తగినట్టు

పెరగనందువలన గత రెండేళ్ళలో 1.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయారు. ఇది ప్రతి కార్మికుడు దాదాపు నెలరోజుల (25 రోజుల) వేతనం కోల్పోయినదానితో సమానం. వేతనాల పతనం తగ్గిపోతున్న కార్మికుల ఆదాయాల వాటా రూపంలో కూడా కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయే సంపదలో కార్మికుల ఆదాయం వాటా 2019లో 52.9 శాతంగా ఉంటే అది 2022 నాటికి 52.3 శాతానికి తగ్గింది. అంటే 0.6 శాతం పడిపోయింది. ఆ తర్వాత నుండీ అక్కడే మారకుండా నిలిచిపోయింది. దీనిని శాతంగా చూస్తే తగ్గుదల స్వల్పంగా అనిపిస్తుంది. కాని 2004 లో కార్మికుల ఆదాయాల వాటా ఎంత ఉండిందో అదే స్థాయిలో కొనసాగివుంటే 2024 నాటికి కార్మికులు ఎంత ఆదాయాన్ని పొందివుండేవారో అంతకన్నా ఇప్పుడు ప్రతీ ఏటా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని తక్కువగా పొందుతున్నారు. (స్థిరంగా ధరలు కొనసాగితే) లింగ వివక్ష మూలంగా వేతనాల్లో ఉన్న వ్యత్యాసాల కారణంగా మహిళా కార్మికులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురుషుడు సంపాదించే ప్రతీ ఒక డాలరుకు 51.8 సెంట్లు మాత్రమే మహిళ సంపాదించగలుగుతోంది.

1.22. సంపదలో కార్మికుల ఆదాయాలవాటా తరుగుదల అభివృద్ధి చెందిన, చెందుతున్న ఆర్థిక వ్యవస్థల రెండింటా చోటు చేసుకుంటున్నది. మరోవైపు అత్యున్నత స్థాయి వద్ద ఆదాయాలు పోగుబడడం మరింతగా పెరిగింది. అంటే కార్మికుల ఆదాయాల వాటా తగ్గినతాకిడిని అట్టడుగు స్థాయిలో ఉన్నవారు భరిస్తున్నారు. ఆర్థిక అసమానతలు పెరగడానికి ఇది ప్రధానకారణం. ఇదే పెట్టుబడికి శ్రమకు మధ్యన వైరుధ్యం తీవ్రతరం అవడానికి దారి తీస్తున్నది.

1.23. **పెరుగుతున్న నిరుద్యోగం :** ఈ మధ్య కాలంలో ప్రపంచం మొత్తం మీద నిరుద్యోగం సుమారు 5 శాతం ఉంది. 2024లో మరో 20 లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. 2023లో ప్రపంచవ్యాప్తంగా యువజనులలో 13 శాతం, అంటే 6 కోట్ల 49 లక్షలమంది నిరుద్యోగులు ఉన్నారు. ఉద్యోగాలు చేస్తున్న వారిలో ఐదింట నాలగు వంతుల మంది తక్కువ స్థాయి పనుల్లో, భద్రత లేని, తాత్కాలిక ఉద్యోగాలలో, తక్కువ జీతాలు పొందుతూ పని చేస్తున్నారు. 2024లో ఉద్యోగంలో కాని, చదువులో గాని శిక్షణలో గాని లేని యువత 20.4 శాతంగా ఉన్నది. ప్రపంచంలో 27.6 మిలియన్ల ప్రజలు నిర్బంధ చాకిరీలో ఉన్నారు. పెట్టుబడిదారులు వీరి చాకిరీ నుండి ఏటా 236 బిలియన్ డాలర్ల లాభాలు పోగేసుకుంటున్నారు. 86 శాతం నిర్బంధ చాకిరి కార్మికులు ప్రైవేటు రంగంలో

ఉన్నారు. కార్మికుల శ్రమశక్తిని పిండుకోడానికి వీలుగా ఉండే స్థాయిలో వేతనాలు, పని పరిస్థితులు ఉండాలని పెట్టుబడి కోరుకుంటోందని స్పష్టమౌతోంది.

1.24. **తీవ్ర అసమానతలు :** 2023 నాటికి ప్రపంచ జనాభాలో 46 శాతం అంటే 300 కోట్లమంది ప్రజలు ప్రపంచ దారిద్ర్య రేఖకు దిగువన, అంటే రోజుకి 6.85 డాలర్ల కన్నా తక్కువ (2017నాటి ధరల ప్రకారం) సంపాదనతో జీవిస్తున్నారు. గత పాతికేళ్ళలో తొలిసారిగా ఉత్తర, దక్షిణ భూగోళ ప్రాంతాల నడుమ అంతరాలు పెరిగాయి. సుమారు 70 కోట్లమంది ప్రజలు తలసరి రోజువారీ ఖర్చు 2.15 డాలర్ల కన్నా తక్కువగా ఉండి, దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్నారు. 2023లో 10.7 శాతం ప్రజలకు (86.41 కోట్లమంది) ఆహార భద్రత కరువైంది.

ఆకలితో మగ్గేవారిలో 60 శాతం మంది మహిళలు, బాలికలు. ఉష్ణోగ్రతలు అదుపు తప్పడం కూడా ప్రపంచ అసమానతలు పెరగడానికి దోహదం చేస్తోంది.

1.25. **గుత్తసంస్థల దగ్గర పోగుపడుతున్న సంపద :** మరో పక్కన సంపద కేంద్రీకరణ విపత్కర రీతిలో కొనసాగుతోంది. ప్రపంచంలో 1 శాతంగా ఉన్న సంపన్నుల దగ్గర సంపద 95 శాతం ప్రజల దగ్గర ఉన్నదానికన్నా ఎక్కువ. 2020 నుండి కొత్తగా సృష్టించబడుతున్న సంపదలో మూడింట రెండు వంతులు 1 శాతంగా ఉన్న సంపన్నులు చేజిక్కించుకున్నారు. దిగువన ఉండే 99 శాతం ప్రపంచ జనాభా సంపాదన కన్నా ఇది రెండు రెట్లు ఎక్కువ, శతకోటీశ్వరులు రోజుకి 270 కోట్ల డాలర్లు పోగేసుకుంటుంటే 170 కోట్ల కార్మికుల వేతనాల కన్నా ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతోంది.

1.26. ఇలా సంపద విపరీతంగా కేంద్రీకరించబడడం అనేది గుత్తాధిపత్య శక్తి కేంద్రీకరణ పెరగడంతో ముడిపడివుంది. అతి కొద్ది సంఖ్యలోని సంస్థలు ఔషధ తయారీ పరిశ్రమ, వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాలతో సహా కీలకమార్కెట్లపై ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. ప్రపంచంలో ఏడు అగ్రశ్రేణి సోషల్‌మీడియా, టెక్, చిప్ కంపెనీలు 12 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ వాటాతో ఉన్నాయి. తక్కిన 493 కంపెనీలలో ఎదుగుదల లేకపోవడమో, పతనం కావడమో జరుగుతోంది. ఈ విధంగా మార్కెట్ గుత్తాధిపత్యం సాధించిన కంపెనీలు తమ శక్తిని ఉపయోగించి లాబీయింగ్, రాజకీయ విరాళాలు అందించడం, లిటిగేషన్లు, మీడియాను నియంత్రించడం, నయా ఉదారవాద విధానాలను అనుసరించకపోతే పెట్టుబడులను నిలిపివేస్తామని బెదిరించడం వంటి పద్ధతులద్వారా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. నయా ఉదారవాద విధానాలు అమలు కోసం

ఒత్తిడి తీసుకువస్తున్నాయి. కార్పొరేట్ పన్నులను తగ్గించడం, కార్మికుల రక్షణ వ్యవస్థను బలహీనపరచడం, ప్రభుత్వ సేవలను ప్రైవేటీకరించడం, పొదుపు చర్యల పేరిట భారాలు మోపడం తదితర చర్యల ద్వారా ప్రభుత్వాలు కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతున్నాయి. నయా ఉదారవాద విధానాలు ఆర్థిక అసమానతల పెరుగుదలకు దారి తియ్యడమే కాక., ప్రజాస్వామిక సంస్థలను డొల్ల చేస్తూ ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థ పరిమితులను బట్టబయలు చేస్తున్నాయి.

1.27. **తీవ్ర రుణ సంక్షోభం :** 2024 నాటికి 54 దేశాలు రుణ సంక్షోభంలో చిక్కుకుపోయాయి. వర్ధమాన దేశాల నుండి ఏటా సగటున 700 బిలియన్‌ల డాలర్లు అభివృద్ధి చెందిన దేశాలకు నికరంగా బదిలీ అవుతున్నాయి. గత మూడేళ్ళలోనే 18 వర్ధమాన దేశాల ప్రభుత్వాలు శ్రీలంకతో సహా, రుణాల చెల్లింపులో బకాయిదార్లుగా నిలిచాయి. గత ఇరవై సంవత్సరాలలో నమోదైన దాని కన్నా ఇది పెద్ద సంఖ్య. వివిధ దేశాల ప్రభుత్వాలు రుణ దుస్థితిలో చిక్కుకోవడానికి కారణం ప్రైవేటు రుణదాతల ప్రాబల్యం పెరిగిపోవడమే. మధ్య, దిగువ స్థాయి ఆదాయాలు ఉన్న దేశాలు విదేశీ బ్యాంకులు, హెడ్జ్‌ఫండ్ సంస్థలవంటి ప్రైవేటు రుణదాతల నుండి తీసుకున్న రుణాలే వాటి మొత్తం విదేశీ రుణాల్లో సగానికన్నా ఎక్కువ. అభివృద్ధి చెందుతున్న దేశాలు 2022లో స్వీకరించిన రుణాలకన్నా వాయిదాలుగా సుమారు 9000 కోట్ల డాలర్లు ఎక్కువ తిరిగి చెల్లించాయి.

1.28. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు విధించే హానికర రుణ నిబంధనలు, అధిక వడ్డీ రేట్లు ఈ రుణ సంక్షోభానికి దారి తీసిన కొన్ని ఇతర కారణాలు. వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాల వనరులను అభివృద్ధి చెందిన సంపన్న సామ్రాజ్యవాద దేశాలకు బదిలీ చేసే సాధనాలుగా ఉన్నాయి.

1.29. **కృత్రిమ మేధ :** కోరిన మేరకు రాత రూపంలోను, చిత్రాలను, వీడియోలను సైతం సృష్టించే ప్రత్యేకమైన నైపుణ్యాలను కృత్రిమ మేధ సాధనాలు కలిగివున్నట్టు ఈ మధ్య కాలంలో ఆచరణలో ప్రదర్శించాయి. కృత్రిమమేధ గణాంక పద్ధతుల ఆధారంగా కంటెంట్‌ను సృష్టించ గలుగుతుందే తప్ప తాము ఏ అంశాలను తీసుకున్నామో వాటిని మానవుల మాదిరిగా అర్థం చేసుకుని వ్యవహరించలేదు. గతంలో యంత్రాలకు సాధ్యం కానివి అనుకున్న అనేక మేధోసంబంధిత ఉద్యోగాలను యాంత్రీకరించగలిగేంత శక్తివంతంగా ఈ సాధనాలు, వ్యవస్థలు తయారయ్యాయి. అనేక రంగాల్లో పనిచేస్తున్న వారు తమ ఉద్యోగాలకు ఎసరుతెచ్చే ఈ ప్రమాదాన్ని

ఎదుర్కోవాల్సి వస్తుంది. సేవలు, సదుపాయాలు పొందగలిగే విధంగా సంబంధితపనుల్లో కృత్రిమ మేధను వినియోగించడానికి పూనుకుంటున్నారు. ఇలా ప్రజల జీవితాలకు సంబంధించిన కీలక నిర్ణయాలను ప్రజలను భాగస్వాములుగా చేయకుండానే యంత్రాల ద్వారా తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆయుధాల వినియోగానికి కూడా కృత్రిమ మేధను వినియోగించి యుద్ధాలలో ప్రయోగిస్తున్నారు. బడా టెక్ కంపెనీలు వ్యక్తిగత విషయాలతో సహా పౌరుల సమాచారాన్ని సేకరిస్తూ ప్రాథమిక హక్కు అయిన వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘిస్తున్నాయి. ప్రజల ప్రయోజనాలను నెరవేర్చేలా, వారి హక్కులను పరిరక్షించేలా కృత్రిమ మేథ వినియోగంపై పటిష్టమైన నియంత్రణ చేపట్టడం కీలక అవసరం.

1.30. **పెరుగుతున్న నిరసనలు :** పెరుగుతున్న అసమానతలు, నిరుద్యోగం, దారిద్ర్యం ప్రజానీకంలో పెద్ద ఎత్తున అసంతృప్తిని, అసమ్మతిని కలిగిస్తున్నాయి.. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, గ్రీస్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో బాటు, పాటు పోర్చుగల్, అర్జంటీనా, బ్రెజిల్, కెన్యా, దక్షిణాఫ్రికా దేశాలలో ప్రజా పోరాటాలు 2022 నుండి వెల్లువెత్తాయి. అనేక దేశాల్లో వివిధ తరగతుల ప్రజానీకం ఈ నిరసనల్లో పాల్గొన్నారు. మన పొరుగున్న ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలను ప్రజాందోళనలు కుదిపివేశాయి. ఆర్థిక సంక్షోభాన్ని, సామాజిక అసమానతలను, రాజకీయ అవినీతిని అరికట్టడంలో ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు అనేక దేశాల్లో ప్రముఖంగా నిరసనలు చేపట్టారు. వారు న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, మరింత ఆర్థిక న్యాయం కోరుతున్నారు.

## పచ్చి మితవాద శక్తుల పెరుగుదల

1.31. నానాటికీ దిగజారిపోతున్న జీవన ప్రమాణాల పట్ల ప్రజలలో వాస్తవంగా తలెత్తుతున్న ఆందోళనను తమకు అనుకూలంగా వాడుకుంటూ కొన్ని దేశాలలో నయాఫాసిస్టు శక్తులు, పచ్చి మితవాద పార్టీలు బలాన్ని సంతరించుకుంటున్నాయి. వర్ణ వివక్ష, జాత్యహంకార ధోరణులు, బైటనుండి వచ్చే వలసల పట్ల లేనిపోని భయాలు రెచ్చగొట్టడం– వీటి ద్వారా ఈ శక్తులు లబ్దిపొందాయి. వామపక్ష రాజకీయ ప్రత్యామ్నాయం బలంగా లేని నేపథ్యంలో, పోరాటాలలో వ్యక్తం అయే ప్రజా ఐక్యతను చీల్చే విధంగా మితవాద శక్తులు ఆ ప్రజల అసంతృప్తిని ఉపయోగించుకుంటున్నాయి. ఇప్పటివరకూ బలంగా ఉన్న సోషల్ డెమోక్రాట్ పార్టీలు, సంప్రదాయ (కన్సర్వేటివ్) పార్టీలు రెండూ కూడా నయా ఉదారవాద విధానాలనే అమలు చేస్తూ ఉండడంతో

ఆగ్రహించిన ప్రజలు పచ్చి మితవాదం వైపు మొగ్గు చూపారు. పచ్చి మితవాద పార్టీలు ఎన్నికలలో విజయాలు సాధించడానికి ఇది కూడా దోహదం చేసింది. ఈ పార్టీలు కూడా ఒకసారి అధికారంలోకి వచ్చాక అవే నయా ఉదారవాద విధానాలను అవలంబించడమే కాకుండా సామాజిక ఐక్యతను దెబ్బతీసే విచ్ఛిన్న శక్తుల ఎదుగుదలను ప్రోత్సహిస్తున్నాయి. మన పార్టీ 23వ మహాసభలో గుర్తించినట్టు రాజకీయాలు మితవాదం వైపు చూపుతున్న మొగ్గు కొనసాగుతూ నేడు మరింత తీవ్ర ప్రమాదంగా మారింది.

1.32. కోవిడ్ అనంతర కాలంలో అధికారం చేపట్టిన ప్రభుత్వాలను అనేక దేశాల్లో ప్రజలు గద్దె నుండి దించేసారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో అభివృద్ధి చెందిన దేశాలలోని అధికార పార్టీలన్నీ ఓటింగ్ శాతాన్ని కోల్పోవడం సార్వత్రిక ఓటుహక్కు వచ్చిన తర్వాత ఇదే మొదటిసారి. మొత్తంగా చూస్తే ప్రజలు చీలిపోయే ధోరణి పెరుగుతోందని, వారు పరస్పరం భిన్నంగా ఉండే రాజకీయ ధృవాల చుట్టూ సమీకరించ బడుతున్నారని ఈ ఎన్నికలు వెల్లడిస్తున్నాయి. సోషల్‌డెమోక్రాట్, మధ్యేవాద, గ్రీన్ పార్టీలు తమ పునాదిని కోల్పోయి మితవాద శక్తులు బలపడడం జరిగింది.

1.33. కొలంబియా, మెక్సికో, బ్రెజిల్, శ్రీలంక, ఉరుగ్వే దేశాలలో ప్రజానీకం ప్రజావ్యతిరేక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఓటు చేయడంతో అభ్యుదయ శక్తులు ఎన్నికలలో విజయాలు సాధించగలిగారు. ఎక్కడైతే ప్రజా ఉద్యమాలలో వామపక్ష శక్తులు క్రియాశీల పాత్ర పోషిస్తూ, అధికార వర్గ రాజకీయ పార్టీల కన్నా తాము భిన్నం అని ప్రజలకు చూపగలిగాయో, అక్కడ ప్రజల విశ్వాసాన్ని చూరగొని, ఎన్నికల్లో విజయాలు సాధించి మితవాదశక్తుల ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయగలిగాయి.

1.34. అయితే మిగిలిన ప్రపంచంలో అనేక చోట్ల మితవాద శక్తులు అధికారంలోకి వచ్చాయి. ఐరోపా పార్లమెంటు ఎన్నికలలో చాలా దేశాల్లో పచ్చి మితవాద పార్టీలు గణనీయంగా ముందంజ వేసాయి. అర్జెంటీనాలో జేవియన్ మిలే, ఇటలీలో జార్జియా మెలోని, అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌ల గెలుపు అంతర్జాతీయంగా మితవాద రాజకీయాల వైపు మొగ్గుఉన్న ధోరణికి తార్కాణం, ఆర్థిక అనిశ్చితులు, దౌత్యపరంగా సవాళ్ళు, వైరుధ్యభరిత పర్యావరణ విధానాలు ఉండే కాలాన్ని ఇవి సూచిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టగానే తన దూకుడును, విస్తరణ స్పష్టం చేస్తూ పనామా దేశం నుండి పనామా కాలువను తన ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించి, క్యూబాను మళ్ళీ ఉగ్రవాదాన్ని ప్రేరేపించే ప్రభుత్వాల జాబితాలో చేర్చాడు. చైనా వంటి దేశాల మీద సుంకాలు పెంచుతానని ప్రకటించి

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూలంగా ప్రభావం చూపే వాణిజ్య యుద్ధాలకు కాలుదువ్వుతున్నాడు. ట్రంప్ పదవీకాలం యుద్ధాలను నిలవరించదు. ఇజ్రాయిల్‌ను పూర్తిగా సమర్థించడమే కాదు. అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని సవాలు చేయగల విధంగా ఎదిగే ఏ దేశం మీద అయినా విరుచుకుపడుతుంది. పారిస్ పర్యావరణ ఒప్పందాల నుండి, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి అమెరికా వైదొలుగుతుంది అని ప్రకటించి అంతర్జాతీయ ఒప్పందాలపట్ల, సంస్థల పట్ల తన విద్వేషాన్ని ప్రదర్శించాడు. వివిధ అధికారిక ఉత్తర్వుల ద్వారా దేశంలో తన మితవాద ఎజండా అమలుకు పూనుకున్నాడు.

## ఉష్ణోగ్రతల మార్పులు

1.35. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎన్నికయిన అనేక మితవాద పార్టీలు ఉష్ణోగ్రత మార్పుల సమస్యను కొట్టి పారేసే లక్షణం కలిగినవి. దీని మూలంగా రానున్న కాలంలో ఉష్ణోగ్రతల సవాళ్ళు ఎదుర్కొనే కార్యక్రమాల మీద ప్రతికూల ప్రభావం పడుతుంది. 2024 జనవరి – సెప్టెంబరు మాసాల మధ్య, దాదాపు ఒక సంవత్సర కాలం పాటు ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామిక విప్లవం ముందు కాలం నాటికన్నా 1.5 డిగ్రీల సెల్సియస్‌లు అధికంగా కొనసాగాయి. భూతాపాన్ని తగ్గించుకోవాలని 2015 పారిస్ ఒప్పందం నిర్ణయించిన కనిష్ట లక్ష్యాన్ని దాటి ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదాన్ని ఇది సూచిస్తుంది. ఒక్క శాతం మాత్రమే ఉన్న అత్యంత సంపన్న దేశాలు విడుదల చేసే కర్బన ఉద్గారాలు 500 కోట్ల ప్రజానీకంతో ప్రపంచంలో మూడింట రెండొంతులు ఉన్న పేద దేశాలు విడుదల చేసే ఉద్గారాల కన్నా అధికం. మరోపక్క దీని మూలంగా దక్షిణార్ధ భూగోళంలోని దేశాల పేద, నిస్సహాయ ప్రజానీకం అతి ఎక్కువగా దెబ్బ తింటారు.

1.36. ఉష్ణోగ్రతల మార్పులకు వ్యతిరేకంగా పోరాటంలో భాగస్వాములవడానికి, తమ బాధ్యతను స్వీకరించడానికి అభివృద్ధి చెందిన ధనిక దేశాలు నిరాకరిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికీ శిలాజ ఇంధనాల వాడకాన్ని కొనసాగిస్తూ, వాటిని నెమ్మదిగా తగ్గిస్తూ, వేరొకపక్క వర్ధమాన దేశాలను ఖరీదైన పునరుత్పాదక ఇంధనాల వాడకం వైపుకు నెడుతూ వాటి పారిశ్రామికాభివృద్ధికి, ఆ దేశాల ప్రజలందరికీ ఇంధన వినియోగ అవకాశాలు సమానంగా కల్పించడానికి ప్రతిబంధకాలు సృష్టిస్తున్నాయి. 2024లో బకు లో జరిగిన కాప్ 29 సదస్సులో ఉష్ణోగ్రతల అదుపు కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయంగా కేవలం 300 బిలియన్ డాలర్ల సాయం మాత్రమే, అదీ 2035 నాటికి అందిస్తామని ధనిక దేశాలు ప్రకటించాయి. దీనికి 'ఒప్పందం'

అని పేరు పెట్టి  పేద దేశాలను ఒత్తిడి చేసి ఈ ముష్టి కి అంగీకరింపచేసాయి. భూతాపం పెరిగిపోవడం మూలంగా వరదలు, నిలువ నీడ లేని స్థితి, క్షుద్బాధ వంటి ప్రమాదాలను వివిధ ప్రజా సమూహాలు ఎదుర్కోవలసివస్తుంది. ఇది భూమండలానికే వినాశనకరం. తగినంత ఆర్థిక తోడ్పాటును అందించే బదులు, అభివృద్ధి చెందిన దేశాలు ప్రకృతిని సైతం సరుకుగా మార్చివేయాలని కోరుకుంటూ ఉద్గారాలను తగ్గించే బాధ్యతను చిన్నరైతులపై, గ్రామీణ ప్రాంత ప్రజానీకంపై మోపడానికి పూను కుంటున్నాయి. ఆహారం కోసం, పౌష్టికత కోసం సాగుతున్న పంటల ఉత్పత్తి స్థానంలో జీవ ఇంధనాలను, శక్తిని ఉత్పత్తి చేయడానికి కావలసిన పంటలవైపు వ్యవసాయాన్ని నెట్టే ప్రయత్నాలు చేస్తూ ప్రపంచ ఆహార భద్రత సాధించే వైపుగా నెమ్మదిగా సాగుతున్న పురోగతిని కూడా దెబ్బ తీస్తున్నాయి.

1.37. పారిశ్రామిక విప్లవం మొదలయిన కాలం నుండి ప్రపంచం మొత్తం గా వెదజల్లిన ఉద్గారాలలో 75 శాతానికి బాధ్యత  సంపన్న దేశాలదే. కాబట్టి ఉష్ణోగ్రతల మార్పుల మూలంగా జరుగుతున్న ఉత్పాతాల వలన వర్ధమాన దేశాలకు వాటిల్లిన నష్టాలను భర్తీ చేయడానికి, పర్యావరణ అనుకూల విధానాల్లో భాగంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకుని పునరుత్పాదక ఇంధన వనరుల వైపుకు న్యాయమైన, నిష్పక్షపాతమైన రీతిలో మళ్ళడానికి, ఈ క్రమంలో పారిశ్రామికాభివృద్ధి పురోగతికి జరిగే నష్టానికి సంపన్నదేశాలు పరిహారం చెల్లించడం సహజ న్యాయం. సంపన్నదేశాలు ఏటా వర్ధమాన దేశాలకు ట్రిలియన్ల డాలర్ల పర్యావరణ బాకీ పడుతున్నాయి. వామపక్ష అభ్యుదయ, ప్రజాస్వామిక శక్తులు చేయి చేయి కలిపి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ఉద్గారాలను మరింత తగ్గించుకోవాలని, ఉష్ణోగ్రతల తగ్గింపుకు ఆర్థిక సాయాన్ని అందించాలని, అంగీకరించిన మేరకు తక్షణమే వర్ధమాన దేశాలకు సాంకేతిక సహకారాన్ని బదిలీ చేయాలని ఒత్తిడి చెయ్యాలి.

1.38. వర్ధమాన దేశాల రుణభారం పెరిగిపోవడం, పెరుగుతున్న అసమానతలు, భూతాపాన్ని తగ్గించడానికి, పర్యావరణ న్యాయం పాటించడానికి సంపన్న దేశాలు బాధ్యత  నిరాకరించడం  మూలంగా అభివృద్ధి చెందిన ధనిక దేశాలకు, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజానీకానికి నడుమ వైరుధ్యం తీవ్రతరం అవుతున్నది.

## ఇరుగు పొరుగు దేశాలు

1.39. మన పొరుగు దేశాలలో సంచలన పరిణామాలు చోటు చేసుకున్నాయి. అనేక దేశాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా భారీ ఎత్తున

ప్రజాందోళనలు చెలరేగాయి. ఎక్కువచోట్ల ఈ ఉద్యమాలకు విద్యార్థులు, యువజనులు నాయకత్వం వహిస్తే మిగిలిన తరగతుల ప్రజానీకం భాగస్వాములు అయ్యారు. ప్రధానంగా అవినీతి, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభం, నియంతృత్వ విధానాలను అరికట్టాలన్న కోర్కెలతో ఈ ఉద్యమాలు సాగాయి. ఎక్కువ సందర్భాలలోఈ ఆందోళనలను పోలీసు, సైన్యం ద్వారా పాశవికంగా అణిచివెయ్యాలని చూసిన ప్రభుత్వాలు  అందులో విఫలమయ్యాయి.

1.40. **బంగ్లాదేశ్** : అవామీలీగ్ పార్టీ అధ్యక్షురాలయిన షేక్ హసీనా వాజెద్ నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమం వెల్లువెత్తింది. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడానికి వ్యతిరేకంగా మొదలయిన విద్యార్థుల ఉద్యమం క్రమంగా విశాల స్వభావాన్ని సంతరించుకుని ప్రభుత్వ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా విస్తరించింది. ఉద్యమాన్ని పాశవికంగా అణిచివెయ్యాలని ప్రభుత్వం ప్రయత్నించింది. పోలీసు కాల్పులలో వందలమంది మరణించారు. ప్రభుత్వానికి అనుకూలంగా జోక్యం చేసుకోడానికి సైన్యం నిరాకరించడంతో షేక్ హసీనా భారతదేశానికి పారిపోవలసి వచ్చింది. ఈ అల్లకల్లోల, అయోమయ  పరిస్థితుల్లో ఇస్లామిక్ ఛాందస వాద శక్తులు మైనార్టీలమీద దాడులకు తెగబడి మతపరమైన విభజన సృష్టించడానికి ప్రయత్నించాయి. లౌకిక ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ దాడులకు లక్ష్యాలయాయి. కారాగారవాస శిక్ష అనుభవిస్తున్న మతఛాందసవాదులను, ఉగ్రవాదులను మధ్యంతర ప్రభుత్వం విడిచిపెట్టింది. ఈ పరిణామాలు రాజ్యాంగంలో, రాజకీయ వ్యవస్థలో ప్రతిపాదిస్తున్న మార్పులపై అనుమానాలకు తావిస్తున్నాయి.

1.41. అమెరికా, దాని పశ్చిమదేశ మిత్రపక్షాలు జోక్యం చేసుకుని తమ ప్రయోజనాలు ఈడేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. బంగ్లాదేశ్ భౌగోళికంగా వ్యూహాత్మక ప్రాంతంలో ఉండడం ఈ దేశం పట్ల అమెరికా, దాని మిత్ర దేశాలు ఆసక్తి చూపడానికి కారణం. మైనార్టీల హక్కులు రక్షించబడేలా లౌకిక శక్తులు  కృషి చెయ్యాలి. అన్ని రకాల విదేశీ  ఒత్తిడులనుండి, ప్రభావాలనుండి దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన గురుతర కర్తవ్యం కూడా ఈ లౌకిక శక్తుల మీదనే ఉన్నది. ప్రజల యదార్థమైన బాధలను పరిష్కరించడానికి కృషి చేపట్టడం ద్వారా మాత్రమే వారు దేశం విభజనవాదుల, సామ్రాజ్యవాద శక్తుల బారిన పడకుండా కాపాడుకోగలుగుతారు. మన దేశంతో సుదీర్ఘమైన సరిహద్దుగల బంగ్లాదేశ్ పరిణామాల ప్రభావం మనదేశంపై కూడా పడడం అనివార్యం.

1.42. **శ్రీలంకలో** అధ్యక్ష పదవికి, ఆ తర్వాత పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో అవినీతిపరులైన ఉన్నత తరగతులకు ప్రతినిధులుగా వ్యవహరించిన ప్రధాన అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండింటితోనూ విసిగిపోయిన ప్రజానీకం ఈసారి నిర్ణయాత్మకంగా మార్పుకోసం ఓటు వేసారు. జనతా విముక్తి పెరుమన (జె.వి.పి), నేషనల్ పీపుల్స్ పవర్ (యన్.పి.పి) కూటమి విజయాలను చేజిక్కించుకున్నది. ఈ చారిత్రిక ప్రజాతీర్పులో జె.వి.పి నాయకుడు అనురకుమార దిస్సానాయకే దేశాధ్యక్షుడిగా విజయం సాధించాడు. పార్లమెంటు ఎన్నికలలో 70 శాతం సీట్లను ఈ అభ్యుదయ, వామపక్షకూటమి దక్కించుకుని విజయదుంధుభి మ్రోగించింది. భారత ఉపఖండంలో ఇది ఎన్నదగిన సానుకూల పరిణామం.

1.43. **మయన్మార్‌లో** కొనసాగుతున్న సైనిక నియంతృత్వ ప్రభుత్వ పాలనను ఆయా తెగలకు చెందిన సాయుధ సైనిక దళాలు సవాలు చేస్తున్నాయి. దేశంలో దాదాపు అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. సైనిక ప్రభుత్వం అనేక ప్రాంతాలపై పట్టు కోల్పోయింది. అక్కడ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికయిన ప్రభుత్వాన్ని కూలదొయ్యడం, శాంతియుత నిరసనలను క్రూరంగా అణిచివెయ్యడం, ప్రజల ఆర్థిక ఇక్కట్లను పరిష్కరించడంలో మిలిటరీ అధికార యంత్రాంగం విఫలం కావడం ప్రస్తుతం మిలిటరీకి, సాయుధ తిరుగుబాటుదార్లకు మధ్యన కొనసాగుతున్న ఘర్షణలకు మూల కారణాలు. ఈ ఘర్షణల వెనుక సామ్రాజ్యవాద ఏజంట్ల జోక్యం, తోడ్పాటు లేవని కొట్టిపారెయ్యలేం.

1.44. **పాకిస్తాన్‌లో** జరిగిన ఎన్నికలలో 'తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ' అర్హత కోల్పోవడంతో, పాకిస్థాన్ ముస్లింలీగ్ యన్ (పి.యం.యల్.యన్) పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పి.పి.పి) లు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసాయి. ప్రభుత్వ వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూ సైన్యం కీలకపాత్ర పోషిస్తోంది. ఈ ప్రభుత్వం దేశ ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో విఫలం కావడంతో ప్రభుత్వ వైఖరికి, అది అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు వీధులకెక్కి ఆందోళనలకు పూనుకుంటున్నారు. వివిధ అభియోగాల మీద జైలు పాలైన ఇమ్రాన్‌ఖాన్‌ను విడుదల చెయ్యాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు, ఆందోళనలకు పూనుకున్నారు.

1.45. **ఆఫ్ఘనిస్థాన్** నుండి అమెరికా తన సైన్యాన్ని ఉపసంహరించుకోవడంతో అక్కడ తాలిబన్‌ల ప్రభుత్వం ఏర్పడింది. క్రమంగా వివిధ దేశాలు ఈ ప్రభుత్వాన్ని గుర్తిస్తున్నాయి. భారత ప్రభుత్వం కూడా నెమ్మదిగా తాలిబన్‌ల ప్రభుత్వంతో సంబంధాలు

నెలకొల్పుకున్నది. తాలిబన్ ప్రభుత్వం తన మితవాద, అభివృద్ధినిరోధక విధానాలను, మహిళల విషయంలో ప్రత్యేకించి, కొనసాగిస్తున్నది.

1.46. **మాల్దీవులకు** నూతన అధ్యక్షుడు ఎన్నిక కావడంతో భారత్ – మాల్దీవుల మధ్య సంబంధాలు అమాంతం దిగజారాయి. మాల్దీవులలో పెరిగిన భారతీయ సైనిక బలగాల మోహరింపును ఆ దేశ సార్వభౌమాధికారానికి అవమానకరమైనదిగా పరిగణించి వ్యతిరేకిస్తూ ప్రచారం చేసిన భారత – వ్యతిరేక వేదిక తరపున కొత్త అధ్యక్షుడు ఎన్నికయాడు. మాల్దీవుల ప్రభుత్వం ఇప్పుడు భారతదేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నది.

1.47. **నేపాల్** లో 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్) నేపాలీ కాంగ్రెస్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తోంది. గతంలో ఐక్యంగా వ్యవహరించిన కమ్యూనిస్టు పార్టీలో చీలికలు వచ్చి మూడు గ్రూపులుగా ఏర్పడ్డాయి. కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన ఈ చీలిక మూలంగా కొంతమంది జనం ఈ పార్టీలకు దూరం అయ్యారు. రాజరిక – అనుకూల శక్తులు ప్రజలలో ఉన్న అసంతృప్తిని ఉపయోగపెట్టుకుని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని చూస్తున్నాయి. హిందూత్వ అనుకూల ఆర్.యస్.యస్ శక్తులు వీటిని చురుకుగా బలపరుస్తూ కొత్తగా ఆమోదించిన లౌకిక రాజ్యాంగానికి, కమ్యూనిస్టు పార్టీలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి.

## సోషలిస్టు దేశాలు

1.48. **చైనా :** చైనాను 'వ్యూహాత్మక ప్రత్యర్థిగా' పరిగణిస్తూ ఆ దేశాన్ని నిలవరించడమే కాకుండా ఒంటరిపాటు చెయ్యడానికి అమెరికా వరుసగా అనేక చర్యలు చేపట్టింది అని మన పార్టీ 23వ మహాసభ రాజకీయ తీర్మానంలో చెప్పుకున్నాం. 'అమెరికా – చైనాల మధ్య ఘర్షణ సామ్రాజ్యవాదానికి సోషలిజానికి మధ్యన ఉండే కేంద్ర వైరుధ్యం మీద ప్రభావం చూపిస్తుంది' అని కూడా ఆ తీర్మానం గుర్తించింది. (పేరా 1.29). ఈ కాలంలో చైనాను నిలవరించి, ఒంటరిపాటు చెయ్యడానికి అమెరికా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది కాని పెద్దగా విజయం సాధించలేకపోయింది.

1.49. చైనా అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలకు కావలసిన కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రధాన సాధన సామాగ్రిని, ముడిసరుకులను అందకుండా చెయ్యడానికి రకరకాల అడ్డంకులు సృష్టించడానికి అమెరికా అన్ని ప్రయత్నాలనూ చేస్తోంది. 'చిఫ్ ఫోర్ – పార్టీ అలయన్స్' పేరిట దక్షిణ కొరియా, జపాన్, తైవాన్‌లతో కలిసి కూటమిని

ఏర్పాటు చేసుకుని అంతర్జాతీయ సెమీ–కండక్టర్‌ల సరఫరా గొలుసు నుండి చైనాను మినహాయించడానికి ప్రయత్నించింది. బైడెన్ అధికార యంత్రాంగం వాణిజ్య సంబంధాలను ఆయుధంగా చేసుకుని చైనా మీద మితిమీరిన స్థాయిలో సుంకాలు విధించి వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించింది. అమెరికా నాయకత్వాన జి–7 దేశాలు, నాటో కూటమి తమ ప్రపంచాధిపత్యానికి చైనా బద్ధ శత్రువని బహిరంగంగా ప్రకటించి ఆ దేశాన్ని కట్టడి చెయ్యడానికి, ఒంటరిపాటు చెయ్యడానికి, పోటీలో లేకుండా చేయడానికి తమ కూటములను మరింత బలోపేతం చేసుకుంటామని శపథం చేశాయి.

1.50. ఈ దాడులన్నీ కొనసాగుతున్నప్పటికీ, వాటిని తట్టుకుంటూనే చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ముందుకు నడిపిస్తున్న అతిపెద్ద శక్తిగా ఎదిగింది. 2024 తొలి మూడు త్రైమాసికాలలో చైనా స్థూల జాతీయోత్పత్తి 4.8 శాతంగా నమోదు అయ్యింది. సాలీనా 5 శాతం వృద్ధి రేటు సాధించాలనే లక్ష్యానికి చేరువలో ఉన్నది. 2023వ సంవత్సరంలో చైనా స్థూల జాతీయోత్పత్తి 126 ట్రిలియన్ యువాన్లకు చేరుకుని 5.2 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతర్జాతీయ విదేశీ మారక రంగంలో ఇరవై ఏళ్ళ క్రితం చైనా కరెన్సీ వాటా 1 శాతం కన్నా తక్కువగా ఉండేది. ప్రస్తుతం అది 7 శాతం దాటింది. ఒక విశ్వసనీయమైన ఆర్థికశక్తిగా చైనా ముందుకొచ్చిన వైనాన్ని గుర్తించాల్సిన అగత్యాన్ని కల్పించింది. తన ప్రభుత్వ రంగ పరిశ్రమలను మరింత బలోపేతం చేసుకుని ప్రభుత్వ పెట్టుబడులను ప్రభుత్వ రంగ పరిశ్రమలను మరింత భారీగా విస్తరింపచెయ్యాలని, ఈ పరిశ్రమల ప్రధాన కార్యకలాపాలను, పోటీ పడగలిగే సామర్థ్యాన్ని మరింత పెంపొందించాలని చైనా నిర్ణయించింది. ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజం కావించడానికి 90,000 కోట్ల డాలర్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.

1.51. చైనా చేపట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' లో 150 కి పైగా దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి. అంతర్జాతీయంగా సమాన స్థాయిలో, పరస్పరం ప్రయోజనకరంగా ఉండే ప్రాతిపదికన సహకారం నెలకొల్పడానికి బిఆర్ఐ ఒక ముఖ్యమైన వేదికగా పరిగణించబడుతున్నది. అంతర్జాతీయ సంబంధాలు నెలకొల్పుకోవడంలో చైనా వైఖరిలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. వివిధ అంతర్జాతీయ పరిణామాలలో క్రియాశీలంగా జోక్యం చేసుకుంటూ ఘర్షణల నివారణకు కృషి చేస్తున్నది. ఉక్రెయిన్ యుద్ధం నిలవరించే పథకాన్ని ప్రతిపాదించింది. సౌదీ అరేబియా – ఇరాన్ దేశాల మధ్యన సాధారణ సంబంధాల పునరుద్ధరణకు తోడ్పడింది. ఇజ్రాయిల్ పై పోరాడుతున్న వివిధ పాలస్తీనియన్ గ్రూపులను, వర్గాలను ఒకదగ్గరకు చేర్చింది.

1.52. **వియత్నాం :** ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి అవుతున్న ఆర్థిక వ్యవస్థలలో వియత్నాం ఒకటి. 2024లో స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు 6.8 నుండి 7 శాతం మధ్య ఉంటుందని ఒక అంచనా. మూడు దశాబ్దాల క్రితం 200 డాలర్లుగా ఉన్న తలసరి జిడిపి 2024 నాటికి 4900 డాలర్లకు పెరిగింది. బహుళ ప్రమాణాల ప్రాతిపదికన లెక్కించే దారిద్ర్యం రేటు 1 శాతానికి తగ్గింది. నిరుద్యోగం 4 శాతంగా ఉన్నది. ప్రభుత్వ రంగ పరిశ్రమలలో అనవసర వ్యయం పై, అవినీతిపై కొరడా ఝుళిపించి వాటి నిర్వహణా సామర్థ్యాన్ని మరింత మెరుగు పరుచుకుని దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది.

1.53. **క్యూబా :** బిగుసుకుంటున్న ఆర్థిక దిగ్బంధనానికి తోడు అదనంగా వచ్చి పడిన కోవిడ్ ఉత్పాతం మూలంగా దెబ్బతిన్న క్యూబా ఆర్థిక వ్యవస్థ ఇంకా తేరుకోలేదు. క్యూబాకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న విదేశీ చెల్లింపులరాకను అడ్డుకోవడంతో బాటు, చమురు సరఫరా చేయనివ్వకుండా, సరఫరా చేసే దేశాలపై ఆంక్షలు విధించడం వలన ఇంధన కొరత ఏర్పడింది. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి, ముఖ్యంగా ఆహార, ఇంధన, విద్యుత్ కొరతను అధిగమించడానికి క్యూబా కృషి చేస్తున్నది. అమెరికన్ సామ్రాజ్యవాదం నుండి అంతకంతకూ తీవ్రతరమౌతున్న దాడులను ప్రతిఘటిస్తోంది. అబద్ధపు ప్రచారాలతో క్యూబాలో సోషలిస్టు ప్రభుత్వాన్ని కూల్చడానికి సమయం ఆసన్నమైందని అమెరికా భావిస్తోంది.

1.54. **డిపిఆర్కె :** వరుసగా మూడేళ్ళుగా కుంచించుకుపోయిన ఉత్తర కొరియా ఆర్థిక వ్యవస్థ చైనాతో పెరిగిన వాణిజ్యం కారణంగా 2023లో పుంజుకున్నది. స్థూల జాతీయోత్పత్తి 3.1 శాతానికి పెరిగింది, పారిశ్రామికోత్పత్తి 4.9 శాతం పెరిగింది. (గత ఏడేళ్ళలో ఇది అత్యధిక వేగం). నిర్మాణరంగం 8.2 శాతం పెరిగింది. (2002 తరువాత అత్యధిక వృద్ధిరేటు ఇది). వ్యవసాయ రంగం 1 శాతం వృద్ధి సాధించింది. ఉత్తర కొరియా, రష్యాల మధ్యన వాణిజ్యం, పెట్టుబడులు ఆర్థిక సహకారాల పై ఒప్పందాలు కుదిరాయి. ఉభయ దేశాలూ ఉమ్మడి రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుని తమ బంధాన్ని గట్టిపరచుకున్నాయి.

1.55. **లావోస్ :** 2024 లో లావోస్ స్థూల జాతీయోత్పత్తి లక్ష్యానికి మించి 4.6 శాతం వృద్ధిరేటు సాధించింది. పర్యాటకం, రవాణా, నిర్వహణా ఏర్పాట్ల రంగం, (లాజిస్టిక్స్) ఇంధన రంగాలు వృద్ధి చెందడం ఊపునిచ్చింది. ద్రవ్యోల్బణం, విదేశీ మారకాల రేటులో ఒడిదుడుకులు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుదల, విదేశీ రుణ భారం, తీవ్రమైన వరదలతో గత ఏడాది అంతా అల్లకల్లోలంగా నడిచినా

ప్రభుత్వం సుస్థిర ఆర్థికాభివృద్ధిని కొనసాగించగలిగింది. లావో పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ప్రభుత్వ రుణాలు, ద్రవ్యోల్బణం, మారకం రేటు సమస్యలను పరిష్కరించడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తన ప్రాధాన్యతలుగా ఎంచుకుంది.

1.56. ఈ కాలమంతా చైనా, క్యూబా, ఉత్తర కొరియా దేశాల మీద సామ్రాజ్యవాద దాడులు పెరిగాయి. ఈ దేశాల్లో ప్రభుత్వాలను కూల్చడమే తన లక్ష్యమని సామ్రాజ్యవాదం స్పష్టంగా ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీలు, సోషలిజం, మార్క్సిజం–లెనినిజం సామ్రాజ్యవాదానికి శత్రువులుగా బహిరంగంగానే ప్రకటించడం జరిగింది. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నీచమైనదిగా చిత్రించడానికి, సోషలిస్టు దేశాలను అస్థిరతపాలు చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ఇందువలన సామ్రాజ్యవాదానికి, సోషలిజానికి నడుమ ఉన్న కేంద్ర వైరుధ్యం తీవ్రతరం ఔతోంది.

## అంతర్జాతీయ కమ్యూనిస్టు సహకారం, సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘీభావం

1.57.

1) సామ్రాజ్యవాద దూకుడు, పెట్టుబడిదారీ దోపిడీ తీవ్రతరం కావడం, పచ్చి మితవాద శక్తుల బలం పెరగడం నేపథ్యంలో కమ్యూనిస్టు, కార్మికవర్గ పార్టీల మధ్యన సహకారం, సంఘీభావం ఆవశ్యకత మరింత పెరిగింది. సమన్వయ కార్యాచరణ, సంఘీభావ ఉద్యమాలు పెంపొందించడం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగాఅన్ని శక్తులనూ కూడగట్టడం అత్యంత ప్రాధాన్యత కలిగి వున్నాయి.
2) సామ్రాజ్యవాదానికి, నయా ఉదార విధానాలకు వ్యతిరేకంగా, పర్యావరణ పరిరక్షణ కోసం, ఉష్ణోగ్రతల తగ్గింపు విషయంలో న్యాయం కోసం పోరాడే శక్తులతో సి.పి.ఐ(ఎం) చేతులు కలుపుతుంది.
3) పాలస్తీనా ప్రజానీకానికి సి.పి.ఐ (ఎం) సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది. 1967 నాటికి ముందు ఉన్న సరిహద్దులతో తూర్పు జెరూసలెం రాజధానిగా పాలస్తీనా దేశం ఏర్పాటును బలపరుస్తున్నది.
4) సోషలిస్టు దేశాలైన చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియా, లావోస్‌లకు సి.పి.ఐ(ఎం) సంఘీభావం ప్రకటిస్తున్నది. తమ దేశాలలో సోషలిస్టు నిర్మాణానికి అవి చేస్తున్న ప్రయత్నాలను, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అవి జరిపే పోరాటాలను సి.పి.ఐ(ఎం) ధృడంగా బలపరుస్తుంది.
5) లాటిన్ అమెరికా దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసి, తన అదుపాజ్ఞలలోకి తెచ్చుకోడానికి సామ్రాజ్యవాదం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటిస్తున్న

వెనిజులా, బొలీవియా, నికరాగుహ, ఉరుగ్వే, కొలంబియా, బ్రెజిల్ తదితర దేశాల ప్రజలకు  సి.పి.ఐ(ఎం) అండగా నిలుస్తుంది.

6) అన్ని రూపాలలోని నయా – ఫాసిజం, ఉగ్రవాదం, మత మౌఢ్యం, జాతు మధ్య ద్వేషం,  పితృస్వామిక భావజాలం, తెగల ఆధిపత్య ధోరణులు తదితర ప్రతీఘాత శక్తులకు వ్యతిరేకంగా పోరాడే ప్రజానీకానికి సి.పిఐ (ఎం) బాసటగా నిలుస్తుంది.

# జాతీయ పరిస్థితి

## జాతీయ పరిస్థితిలోని ప్రధాన అంశాలు

2.1. 23వ మహాసభ అనంతరం మూడేళ్ళ కాలంలో జాతీయ పరిస్థితుల ప్రధాన అంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఈ కాలంలో బిజెపి ప్రభుత్వ అధికారాన్ని అడ్డం పెట్టుకుని హిందూత్వ అజెండాను దూకుడుగా కొనసాగిస్తున్నది. 2024 జనవరిలో అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం, ఉత్తరాఖండ్‌లో బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి చట్టం తీసుకురావడం, వివిధ బిజెపి – పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీలను వేధింపులకు గురి చెయ్యడమే లక్ష్యంగా పెట్టుకుని కొత్త చట్టాలు రూపొందించడం, మతాంతర వివాహాలు నిషేధించడం, పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడం వంటి అనేక చర్యలు హిందూత్వ ఎజండాలో భాగమే.  క్షేత్ర స్థాయిలో మత ఉత్సవాల సందర్భాలన్నింటినీ అడ్డం పెట్టుకుని, పదే పదే ముస్లిం మైనార్టీల మీద దాడులు చేయడం, మసీదులున్న స్థలాలను వివాదాస్పదం చెయ్యడం పెరిగింది. మత విభజనను శాశ్వతం చేసి  విస్తార హిందూ అస్తిత్వాన్ని సంఘటిత పరిచే లక్ష్యంతో బిజెపి ఈ చర్యలు చేబడుతున్నది.

ii) దేశ వనరులను, సంపదను బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టే  ప్రధాన లక్ష్యంతో బిజెపి ప్రభుత్వ ఆర్థిక విధానాలు  ఉన్నాయి.  దేశ వనరులను, సంపదను బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టే లక్ష్యంతో  మౌలిక నిర్మాణాల కల్పనకు,  ఇంధన రంగానికి చెందిన ప్రాజెక్టులను  తమకు నచ్చిన కొన్ని బడా కంపెనీలకు కట్టబెట్టిన మూలాన అవి విపరీతంగా లాభాలు పోగేసుకున్నాయి. ఈ విధానాల పర్యవసానంగా వృద్ధిరేటు మందగించింది. అసమానతలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయాయి.

iii) గత మూడేళ్ళలో ప్రజాస్వామ్యం మీద, పౌరుల ప్రజాస్వామిక హక్కుల మీదా దాడులు తీవ్రతరం అయ్యాయి. కేంద్ర సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నాయకుల మీద అక్రమ కేసులు మోపి జైళ్ళలో కుక్కడం ఉపా, అక్రమ ధన మార్పిడి

చట్టం వంటి నిర్బంధ చట్టాలను అడ్డగోలుగా మోపడం పెరిగింది. స్వతంత్ర మీడియా సంస్థలను, జర్నలిస్టులను కూడా లక్ష్యంగా చేసుకున్నది. పార్లమెంటు పనిమీద ఆంక్షలు అంతకంతకూ తీవ్రమౌతున్నాయి.

iv) అధికారాలన్నింటినీ కేంద్రం గుప్పెట్లోకి తీసుకోవాలనే ప్రయత్నాలు తీవ్రమౌతున్నాయి. రాష్ట్రాల హక్కుల మీద దాడులు పెరిగాయి. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలకు నిధులు నిరాకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల కార్యకలాపాలలో గవర్నర్ల అనుచిత జోక్యం ఘోరంగా పెరుగుతోంది.

v) అమెరికా అనుకూల విదేశాంగ విధానం, ఆ దేశంతో వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడ్డాయి. అయితే బలపడుతున్న బహుళ ధృవ ప్రపంచ వాస్తవికతలు 'బ్రిక్స్', 'షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ సంస్థలలో చురుకైన భాగస్వామిగా భారతదేశం వ్యవహరించేలా మోడీ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసింది.

vi) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, లేబర్ కోడ్‌లను బలవంతంగా అమలు చేయడానికి వ్యతిరేకంగా, కనీస వేతనాల కోసం, కార్మిక సంఘాలు ఏర్పరచుకునే హక్కు కోసం కార్మికవర్గం వివిధ పోరాటాలు నిర్వహించింది. ఐక్య రైతాంగ ఉద్యమం పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం కోసం, ఇతర కోర్కెల పరిష్కారం కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తున్నది. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతాంగ సంస్థల ఐక్యవేదిక, కలిసి చేపడుతున్న ఉమ్మడి కార్యకలాపాలు పెరుగుతున్నాయి.

vii) 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బిజెపి కి ఎదురుదెబ్బ. లోక్‌సభలో మెజారిటీని సాధించడంలో విఫలమైంది. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎన్.డి.ఎ. భాగస్వామ్య పార్టీల మద్దతు మీద ఆధారపడవలసి వచ్చింది. ఐతే, బిజెపి తన కార్పొరేట్‌- హిందుత్వ , నియంతృత్వ ఎజండాను ముందుకు నెట్టుకు పోతూ ఈ బలహీనతను అధిగమించడానికి పూనుకుంది.

## ఆర్థిక మందగమనం

2.2. జిడిపి కి సంబంధించి అధికారికంగా విడుదల చేసిన లెక్కలు నమ్మశక్యంగా లేవు. వినిమయ ధరల సూచీ వెల్లడిస్తున్న ద్రవ్యోల్బణం రేటులో నాలుగవ వంతు కూడా లేని ద్రవ్యోల్బణపు రేటును నర్మగర్భంగా తీసుకుని ఆ ప్రాతిపదికన తేల్చిన లెక్కలు ఇవి. అంకెల తొత్తడం చేసినంత మాత్రాన ఆర్థికవ్యవస్థ మందగించిందన్న నిజాన్ని ఏమార్చలేరు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను

జిడిపి వాస్తవ వృద్ధిరేటును 6.4 శాతంగా దిగ్గోశారు. గత ఏడాది ఇది 8.2 శాతం ఉంది. కోవిడ్ సంక్షోభానంతరం కార్మికవర్గం మీద విపరీతమైన భారాలు మోపడం ద్వారా పెట్టుబడిదారీ మార్గాన ఆర్థిక వ్యవస్థ కోలుకున్నట్టు చెప్పినదంతా అత్యంత స్వల్పకాలికం, భ్రమాన్వితం అని రుజువైంది.

2.3 ఈ విధంగా ఆర్థిక సంక్షోభం కొనసాగడానికి కారణం ఆర్థిక వ్యవస్థలో డిమాండు లేకపోవడం - అంటే ప్రజలవద్ద కొనుగోలు శక్తి తగినంతగా లేదని అర్థం. దేశంలో అత్యధిక ప్రజానీకం అతితక్కువ ఆదాయాలతో, వేతనాలతో జీవించవలసి వస్తోంది. గృహ వినిమయ వ్యయానికి సంబంధించి ఇటీవల విడుదల చేసిన గణాంకాలు పరిశీలిస్తే 2023-24 లో గ్రామీణ ప్రాంతాల్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంట్లో నెలసరి వ్యయం సగటున రూ 8.0791/- కాగా పట్టణ ప్రాంతాల్లో రూ॥ 14,528/- లుగా ఉన్నది. ద్రవోల్బణం పెరుగుదల, ముఖ్యంగా ఆహార వస్తువుల ధరల పెరుగుదల మూలంగానూ, పెరుగుతున్న నిరుద్యోగం కారణంగా ఈ ఆదాయాలు కూడా హరించుకు పోతూండడంతో సమస్య మరింత తీవ్రమౌతోంది. డిమాండ్ తక్కువగా ఉంటే స్థాపక సామర్థ్యం కన్నా తక్కువ స్థాయిలో ఉత్పత్తిని పరిమితం చేయడంతో పాటు కొత్తగా పెట్టుబడులు పెట్టి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి ఎవరూ ఆసక్తి చూపరు. ప్రభుత్వం దిగుమతి సుంకాల తగ్గింపును కొనసాగిస్తున్న మూలంగా దిగుమతులు పెరిగాయి, దీని మూలంగా దేశీయ పరిశ్రమలు నాశనమౌతున్నాయి. వాణిజ్యలోటు అదేపనిగా పెరిగిపోతోంది. ఆర్థికవ్యవస్థలోని బలహీనతలు రూపాయి మారకం విలువ పతనాన్ని వేగవంతం చేస్తాయి. తిరిగి దీని మూలంగా దిగుమతులు మరింత ప్రియంగా మారుతున్నాయి. ఆ విధంగా సంక్షోభం నానాటికీ తీవ్రతరం అవుతుంటే మోడీ ప్రభుత్వానికి ఏమీ అంతు పట్టని స్థితి ఏర్పడింది. నిస్సిగ్గుగా కార్పొరేట్ రంగానికి లబ్ది చేకూర్చే విధంగా మోసపూరితంగా విధానాలను అమలు చేయడం తప్ప ఇంకేమీ చేయలేని స్థితిలో ఉంది. ఆర్థికవ్యవస్థ మందగించడం, ధరల పెరుగుదల, తీవ్ర స్థాయిలో నిరుద్యోగం పెరిగిపోవడం ప్రజలను వెన్నాడుతున్నాయి. కాని ప్రభుత్వం వైపు నుండి వారికి ఏ తోడ్పాటూ లేదు.

2.4. కార్పొరేట్ రంగం ద్వారా లభించే పన్నుల ఆదాయం కన్నా ఆదాయపన్ను ద్వారా ప్రభుత్వం ఎక్కువ ఆర్జిస్తోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్ను వసూళ్ళలో ఆదాయపు పన్ను వసూళ్ళు 20.8 శాతంగా ఉంటే 2024-25 నాటికి అది 30.9 శాతానికి పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్ను వసూళ్ళలో కార్పొరేట్ పన్నుల వాటా 32 శాతం కాగా 2024-25 నాటికి అది 26.5 శాతానికి తగ్గింది. కార్పొరేట్ పన్నులో ఇస్తున్న రాయితీల మూలంగా కేంద్ర ప్రభుత్వం ఏటా 1.45 లక్షల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతున్నది. కార్పొరేట్ల పట్ల ప్రభుత్వం ఎంత దారుణమైన పక్షపాతబుద్ధిని ప్రదర్శిస్తోందో ఇది వెల్లడిస్తోంది. సామాజిక సంక్షేమ పథకాల కేటాయింపుల్లో కోతపెట్టి మరీ మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచి పెడుతున్నది. కార్పొరేట్ పన్నులలో రాయితీ సహా మోడీ ప్రభుత్వం అనేక మేళ్ళు చేకూర్చినా ఉత్పత్తి చేసిన సరుకులకు డిమాండ్ లేకపోవడంతో ప్రైవేటు పెట్టుబడి దారులు కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధపడడం లేదు. మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడానికి కారణం కార్మికులకు నిజవేతనాలు స్థంభించి పోవడమే.

2.5. కేంద్ర ప్రభుత్వం సామాజిక రంగాలమీద జిడిపిలో 7 శాతం కన్నా తక్కువగా ఖర్చు చేస్తున్నది. ఓ.ఇ.సి.డి. దేశాలైతే (సంపన్న దేశాలు) 21 శాతం ఖర్చు చేస్తున్నాయి. 2024-25 బడ్జెట్ మొత్తం వ్యయంలో సామాజిక రంగాల మీద కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చు 2020-21 నాటి వ్యయం కన్నా 40 శాతం తక్కువగా ఉన్నది. అంటే సామాజిక రంగాల మీద చేసే వ్యయాన్ని జిడిపిలో శాతంగా లెక్కించితే, గత నాలుగేళ్ళలో దాదాపు సగానికి తెగ్గోసింది. దీని మూలంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార సబ్సిడీ, సామాజిక సంక్షేమం, విద్య, వైద్యరంగాలు, ఎరువుల సబ్సిడీలు వంటివి కేటాయింపుల్లో కోతకు గురయ్యాయి. పెరుగుతున్న జీవన వ్యయానికి, పడిపోతున్న కొనుగోలు శక్తికి, పేదరికానికి తోడు ప్రభుత్వం వైపు నుండి తోడ్పాటు కూడా ప్రజలకు కరవైంది.

## చేతులు మారుతున్న వనరులు-కార్పొరేట్ దోపిడీ

2.6. దేశంలోని సహజ వనరులను, ప్రభుత్వ ఆస్తులను ఒక పథకం ప్రకారం బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టడానికి తోడ్పడే ప్రభుత్వ విధానాలను రూపొందించి మొత్తంగా ఆర్థిక యాజమాన్య వ్యవస్థ స్వరూపాన్ని మోడీ మార్చేసారు. 2021-22 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో మొదలుపెట్టిన 'నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్' పథకం

అభివృద్ధి చెందిన భూములను, జాతీయ రహదారులను, రైల్వేలు, విమానాశ్రయాలు, పైప్‌లైన్లు, విద్యుత్ సరఫరా లైన్లు వంటి సకల ప్రజా ఆస్తులపై గుత్తాధిపత్యాన్ని ప్రైవేటు పెట్టుబడిదారులకు, ఆర్థిక సంస్థలకు దీర్ఘకాలిక 'లీజు' పేరిట కట్టబెడుతుంది. 'నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్ లైన్' పేరిట ప్రభుత్వం మౌలిక నిర్మాణాల ప్రాజెక్టులలో భారీ పెట్టుబడులను పెడుతోంది. ఈ ప్రాజెక్టుల ద్వారా కేవలం ఐదు బడా కార్పొరేట్ కంపెనీలు పెద్ద ఎత్తున సంపదను పోగేసుకుంటున్నాయి. స్వదేశీ, విదేశీ ప్రైవేటు పెట్టుబడిదారులకు దోచి పెట్టే మార్గాలు రూపొందించడం మరొక లక్షణం. ఇనుప ఖనిజం, బొగ్గు, బాక్సైట్ వంటి సహజవనరుల గనులను బ్లాకులుగా విడగొట్టి వేలం వేసి ప్రైవేటు పెట్టుబడిదారుల పరం చేయడం కోసం 2019లో 'నేషనల్ మినరల్ పాలసీ' రూపొందింది. అలాగే గనులు, ఖనిజాల (అభివృద్ధి మరియు నియంత్రణ) చట్టానికి సవరణలు తీసుకువచ్చి లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల తవ్వకంలో ప్రైవేటు పెట్టుబడిదారులకు అవకాశం కల్పించింది. ఆఖరికి పెట్టుబడి ప్రోత్సహకాల పథకాన్ని కూడా సవరించి రంగాల వారీగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పేరిట కార్పొరేట్ బొక్కసాలకు నేరుగా నిధులు మళ్ళించడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడింది.

ఈ పథకాల మూలంగా ఒక బడా వ్యాపార సంస్థల గుంపు ప్రధానంగా లబ్ధి పొందుతోంది. అంబానీ, ఆదానీ, టాటా, ఆదిత్య బిర్లా, భారతీ టెలికాం– ఈ ఐదు బడా కార్పొరేట్ కంపెనీలు 20 శాతం ఆర్థికేతర రంగాల ఆస్తులను స్వంతం చేసుకున్నాయి. సంపద కేంద్రీకరణ, గుత్తపెట్టుబడిదారీ విధానం ఏ స్థాయిలో బలపడుతోందో దీనిని బట్టి తెలుస్తోంది.

## తీవ్రతరమవుతున్న అసమానతలు

2.7. ప్రపంచంలోనే తీవ్ర ఆర్థిక అసమానతలు ఉన్న దేశాల్లో మన దేశం ఒకటిగా ఉన్నది. 2022–23 ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం కేవలం 1 శాతం సంపన్నులు 22.6 శాతం ఆదాయాలను, 40.1 శాతం దేశ సంపదను స్వంతం చేసుకున్నారని వెల్లడించింది. భారతదేశ చరిత్రలోనే ఇది అత్యధిక వాటాగా లెక్క తేలింది. బ్రిటిష్ వలస పరిపాలనా కాలం నాటి కన్నా కూడా ఇది చాలా ఎక్కువ. దేశంలోని 1 శాతం సంపన్నవర్గాల ఆదాయాలు ప్రపంచంలోనే – దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికా ల కన్నా– అత్యధికం అని లెక్క తేలింది. ఇదే సందర్భంలో దేశంలో అట్టడుగు 50 శాతం మంది చేతుల్లో కేవలం 3 శాతం సంపద మాత్రమే ఉంది.

2.8 ఫోర్బ్స్ జాబితాలో 2014 నాటికి 100 మంది భారతీయ శత కోటీశ్వరులు ఉంటే 2024 నాటికి ఈ సంఖ్య 200 పెరిగిందంటే మోడీ ప్రభుత్వ హయాంలో సంపద కేంద్రీకరణ ఏ స్థాయిలో నెలకొన్నదో అర్థం చేసుకోవచ్చు. అంతే గాక, ఈ 200 మందిలో మొదటి 100 మంది సంపద మొత్తం తొలిసారిగా ట్రిలియన్ డాలర్లు దాటింది. మోడీ ప్రభుత్వ పదేళ్ళ పాలనకు ఇదొక గీటురాయి.

## వ్యవసాయ సంక్షోభం

2.9. మోడీ నాయకత్వాన నడుస్తున్న బిజెపి – ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, నయా ఉదారవాద విధానాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో గణాంకాలను అనుసరించి 2014–2022 మధ్యకాలంలో 1,00,474 మంది రైతులు వ్యవసాయ కార్మికులు, ప్రధానంగా అప్పులభారం వల్ల ఆత్మహత్యలకు పాల్పడ్డారు. (2022 తర్వాత కాలం గణాంకాలు అధికారిక వెబ్‌ఐట్‌లో అందుబాటులో లేవు). 2024 ప్రపంచ ఆకలి సూచికలో 127 దేశాలకు గాను మనదేశం 105 వ స్థానంలో ఉన్నది. వ్యవసాయ సంక్షోభానికి మూలమైన కారణాలు ఈ కాలంలో మరింత తీవ్రతరం అయ్యాయి. అవి :

(అ) ప్రభుత్వ సబ్సిడీలలో కోత, వ్యవసాయ ముడి సరుకుల ఉత్పత్తిలో కార్పొరేట్లను ప్రోత్సహించడం మూలంగా వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయి.

(ఆ) వ్యవసాయం గిట్టుబాటు అయేలా పంట ఉత్పత్తికయే అన్ని ఖర్చులనూ కలుపుకుని దానికి ఒకటిన్నర రెట్లు (సి2+50 శాతం) కనీస మద్దతు ధర అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తున్న కారణంగా పెరిగిన ఖర్చుల మేరకైనా పంటల ధరలు పెరగకపోగా ఒక్కోసారి భారీగా పతనం అవుతున్నాయి.

(ఇ) ఉష్ణోగ్రతల మార్పుల మూలంగా మరింత తీవ్రం అవుతున్న ప్రకృతి వైపరీత్యాల వలన కలుగుతున్న భారీ పంట నష్టాలకు తగిన బీమా రక్షణ లభించకపోవడం, మోడీ ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పి..యం.ఎఫ్. బి.వై) రైతులను అపహాస్యం పాలు చేస్తూ ఇన్సూరెన్స్ కంపెనీలకు వరంగా మారింది. ఈ కంపెనీలు సగటున 25 శాతం స్థూల లాభాలు ఆర్జిస్తున్నాయి.

(ఈ) రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ కంపెనీలకే అనుకూలంగా ఉండేలా వక్రమైన రుణ విధానాన్ని బ్యాంకులు అవలంబించడం మూలంగా రైతాంగం క్రూరులైన ప్రైవేటు వడ్డీ వ్యాపారస్థుల బంధాల్లో ఇరుక్కుని అప్పుల వలకు చిక్కుకు పోతున్నారు.

2.10. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంలో, అనుబంధ రంగాలలో పెట్టుబడులకు నిరంతరం కోతలు పెట్టడం వ్యవసాయరంగ సంక్షోభానికి, రైతాంగపు దుర్భర పరిస్థితులకు మరో మౌలిక కారణం. 2019 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, సంబంధిత రంగాలకు కేటాయింపులు స్థూల జాతీయోత్పత్తిలో 5.44 శాతం కాగా 2024 నాటికి అవి 3.15 శాతానికి తగ్గిపోయాయి. ఎరువులు, ఆహార సబ్సిడీలకు కోత పడింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 86,000 కోట్ల రూ॥లు కేటాయించారు. ఇది నిరుటి ఏడాది చేసిన ఖర్చు కన్నా తక్కువ. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ భీమా యోజన తదితర పథకాలూ కోతకు గురయ్యాయి. బహుళజాతి కంపెనీలకు మేలు కలిగే విధంగా వ్యవసాయ శాస్త్ర పరిశోధనలకు, అభివృద్ధికి, వాటి సేవల విస్తరణకు నిధులు అడుగంటిపోయాయి.

2.11. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడం ద్వారా అగ్రి కార్పొరేట్ సంస్థలు కొల్లగొట్టుకోడానికి వీలుగా వాటికి లబ్ధి చేకూర్చడం మీదనే కేంద్ర ప్రభుత్వం తన దృష్టినంతటినీ కేంద్రీకరిస్తున్నది. విద్యుత్ (సవరణ) బిల్లు ప్రవేశపెట్టడం, స్మార్ట్ మీటర్ల బిగింపు వేగంగా అమలు చేయడం, అదానీ పవర్, రిలయన్స్ పవర్, టాటా పవర్ వంటి సంస్థల ప్రాబల్యం పెరగడం, గ్రామీణ, పట్టణ వినియోగదారుల మీద భారీగా విద్యుత్ ఛార్జీల భారం మోపడం వంటివన్నీ విద్యుత్తు ప్రైవేటీకరణలో భాగమే. నీటిపారుదల రంగంలో కూడా ఇదేవిధంగా జరుగుతోంది.

డిజిటలైజేషన్ పేరిట గ్రామీణ పేదల హక్కుల మీద ప్రభుత్వం ముప్పేట దాడికి పూనుకున్నది. గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు ఎదుర్కొంటున్న ఇక్కట్లు దీనిని వెల్లడిస్తున్నాయి. గత రెండేళ్ళలో ఉపాధిహామీ పథకంలో నమోదు చేసుకున్న వారిలో 8 కోట్ల మందిని చట్ట వ్యతిరేకంగా తొలగించారు. తద్వారా వారి పని హక్కు ప్రయోజనాలను తిరస్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని నిరుపేదల సంఖ్య, వ్యవసాయ భూములు కలిగివున్నవారి నడుమ అంతరాలు తీవ్రంగా పెరిగిపోయాయి. 2019-21 మధ్య కాలంలో నిర్వహించిన 5వ విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక ప్రకారం 47.8 శాతం గ్రామీణ ప్రాంత కుటుంబాలకు ఏ భూమీ లేదు. 20 శాతం గ్రామీణ కుటుంబాల చేతుల్లో 82 శాతం వ్యవసాయ భూములు ఉన్నాయి.

2.12. వ్యవసాయ రంగంలోకి కార్మికుల తిరుగు వలసల ప్రవాహం పెరగడం మూలంగా గ్రామీణ పేదల పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో నిజవేతనాలు 0.4 శాతం మేరకు పడిపోయాయి. వ్యవసాయరంగంలో

నిజ వేతనాలు కనాకష్టంగా 0.2 శాతం మాత్రమే పెరిగాయి. గ్రామీణ కార్మికులపై గ్రామీణ సంపన్నవర్గాలు చేస్తున్న దోపిడీ తీవ్రతరం అయింది అనడానికి గ్రామీణ నిజవేతనాలు పడిపోవడం ఒక సూచన. కౌలు రైతులు కూడా వ్యవసాయ సంక్షోభపు తాకిడికి దెబ్బతినిపోయారు. గ్రామీణ సంక్షోభం మూలంగా వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు పెరిగాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం 2021లో 5,563 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే ఆ సంఖ్య 2022లో 6,087 కి పెరిగింది.

## కార్మికవర్గం మీద తీవ్రతరమైన దోపిడీ

2.13. ఈ కాలంలో కార్మికవర్గం కష్టపడి సాధించుకున్న హక్కుల మీద ముప్పేట దాడి జరిగింది. దుర్మార్గమైన నాలుగు లేబుల్ కోడ్‌ల అమలు ఐక్య కార్మిక పోరాటపు బలం కారణంగా ప్రస్తుతానికి ఆగినా, మోడీ ప్రభుత్వం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మరింత దోపిడీ చేయడానికి వీలు కల్పించేలా నియామక విధానాలను చేపట్టాయి.

నయా ఉదారవాద విధానాల్లో కీలకాంశంగా ఉన్న కాంట్రాక్టీకరణ తీవ్రతరమై, సంఘటిత వస్తూత్పత్తిరంగంలోని కాంట్రాక్టు కార్మికుల శాతం 2018లో 36.38 శాతం నుండి 2023 నాటికి 40.72 శాతానికి పెరిగింది. దీని ఫలితంగా సంఘటితరంగ కార్మికుల వేతనాలలో పెరుగుదల 2014-21 మధ్య కాలంలో 6 శాతానికి పడిపోయింది. అంతకు ముందు ఆరేళ్ళ కాలంలో వీరి వేతనాల వృద్ధి శాతం 10.1 గా ఉండింది. హెచ్చుగా ఉన్న ద్రవ్యోల్బణం రేటును పరిగణనలోకి తీసుకుంటే 2014-2021 మధ్య కాలంలో కార్మికుల నిజ వేతనాలు తగ్గాయి. పారిశ్రామికరంగంలో సృష్టించిన నికర సంపద విలువలో కార్మికుల వాటా 2020లో 18.9 శాతంగా ఉండగా, 2023 నాటికి 15.9 శాతానికి తగ్గింది. ఇదే మూడేళ్ళ కాలంలో పెట్టుబడిదారుల వాటాలు 38.7 శాతం నుండి 51.9 శాతానికి పెరిగాయి. అంటే కార్మికుల శ్రమ ఎంత తీవ్రంగా దోపిడీకి గురవుతుందో తెలుసుకోవచ్చు.

2.14. దేశంలో అనేక ప్రాంతాలలో కనీస వేతనాలు చెల్లించడం లేదు. పనిగంటలను 12 గంటలకు, కొన్ని రాష్ట్రాలలో ఇంకా ఎక్కువగా కూడా, ఏకపక్షంగా పెంచారు. అదనపు గంటల పనికి అదనపు జీతం చెల్లించడం లేదు. 'వ్యాపార సౌలభ్యం' కల్పించే పేరుతో ప్రభుత్వాలు బడా కంపెనీల పక్షాన నిలవడంతో యూనియన్ పెట్టుకునే హక్కు మీద దాడి జరుగుతోంది. ఒకవైపు నిరుద్యోగపు

నీలినీడలు కమ్ముతుంటే మరోవైపు బేరసారాలశక్తి తరిగిపోయి యూనియన్ పెట్టుకునే ధైర్యం చేస్తే ఉద్యోగాలే పోతాయన్న స్థితిలో కాంట్రాక్టు కార్మికులు దెబ్బ తినిపోతున్నారు.

2.15. 'గిగ్' ఆర్థిక వ్యవస్థతో రిటైల్ రంగం విస్తరించి డజన్లకొద్దీ ప్రవేశించిన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీ, జొమాటో, ఊబర్, ఓలా తదితర డిజిటల్ కంపెనీలు దాదాపు 77 లక్షల మంది కార్మికులను కాంట్రాక్టు, టెంపరరీ, ఫ్రీలాన్స్ ప్రాతిపదికలపై చేర్చుకున్నారు. సంఖ్య రీత్యా పెరుగుతున్న ఈ కార్మికులకు అమలు చేయవలసిన ప్రత్యేకమైన కార్మిక చట్టాలు లేకపోవడం మూలంగా వీరు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

2.16. అత్యధిక సంఖ్యాకులు మహిళలే పని చేస్తున్న స్కీమ్ వర్కర్ల వంటి తన స్వంత ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న తీరు కార్మిక–వ్యతిరేక విధానాలకు ఒక ప్రాతిపదికగా కేంద్ర ప్రభుత్వమే రూపొందించింది. అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకపు కార్మికులు, ఆశాలు వంటి లక్షలాది కార్మికులకు కనీసవేతనాలు, పెన్షన్లు వంటి కనీస హక్కులను సైతం నిరాకరిస్తూ ఏదో ఒక విధంగా ఆదాయాన్ని సంపాదించాలనే మహిళల అవసరాన్ని ఉపయోగించుకుని వారి శ్రమను కొల్లగొడుతోంది.

2.17. భారతదేశంలో వలస కార్మికుల దయనీయ పరిస్థితులు కోవిడ్ కాలంలో బట్టబయలు అయ్యాయి. దాదాపు 12 కోట్ల మంది కార్మికులు ఆ కాలంలో తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. వాస్తవానికి దేశంలో వలస కార్మికులు ఎంతమంది ఉన్నారనే అధికారిక లెక్కలు అందుబాటులో లేవు. అయితే ఈ మధ్యన ప్రభుత్వం వలస కార్మికుల సంఖ్య తగ్గుముఖం పట్టిందంటూ కొన్ని అంచనాలు వెలువరించింది. వాస్తవానికి వ్యవసాయ సంక్షోభం మూలంగా వ్యవసాయ పనులు తగ్గిపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పనులు దొరకకపోవడం మూలంగా వలసలకు పోయి తిరిగి స్వల్పకాలంలో వెనక్కి వచ్చే ధోరణి, దీర్ఘకాలం పాటు వలసలు పోయే ధోరణి – రెండూ పెరిగాయి. అందువలన వలసకార్మికుల సంఖ్య పెరిగే అవకాశమే ఉంది. కోవిడ్ అనుభవాల నేపథ్యంలో వలస కార్మికుల కోసం ప్రభుత్వం వాగ్దానాలు చేసినా, వలస కార్మికులకు ప్రభుత్వ తోడ్పాటు దాదాపుగా ఏమీ లేకపోవడంతో వారు కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి వస్తోంది. వలస కార్మికులలో మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది.

## ప్రజల పరిస్థితులు

2.18. **ధరల పెరుగుదల భారం :** ధరలు, అందునా ముఖ్యంగా నిత్యావసర ఆహారవస్తువుల ధరలు నిరంతరాయంగా పెరుగుతున్నాయి. శ్రామిక ప్రజల ఆదాయాలు ఇప్పటికే తక్కువగా ఉండడంతో, చాలీ చాలకుండా ఉన్న ఇంటిఖర్చుల బడ్జెట్లను ధరాభారం దెబ్బ తీసింది. ధరల పెరుగుదలను లెక్క కట్టే వినిమయ ధరల సూచీ ప్రకారం గడిచిన మూడు సంవత్సరాలలో సాధారణ ధరల పెరుగుదల 20 శాతంగా నమోదు కాగా ఆహార సరుకుల ధరలు 26 శాతం మేరకు పెరిగాయి. అత్యధిక ప్రజానీకం తమ ఆదాయాల్లో దాదాపు సగ భాగాన్ని ఆహారం కోసమే ఖర్చు చేస్తారు. అందుచేత ఈ ధరల పెరుగుదల వారి జీవన వ్యయాన్ని నిర్దాక్షిణ్యంగా పెంచివేస్తోంది. ఆహార సరుకులే గాక ఇతర అత్యవసర సరుకుల ధరలను సైతం మోడీ ప్రభుత్వపు స్వంత నిర్ణయాలు పైపైకి ఎగదోస్తున్నాయి. ఉదాహరణకు : ఔషధాల ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వ సంస్థే అనేక మందుల ధరలను పెంచడానికి అనుమతిచ్చింది. ప్రభుత్వమే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను మితిమీరిన రీతిలో పెంచివేయడం మరో ఉదాహరణ. ఇటీవల కొద్ది నెలల కాలంలో ముడి చమురు ధరలు అంతర్జాతీయంగా 18 శాతం వరకూ పడిపోయినప్పటికీ, మోడీ ప్రభుత్వం విధించిన అధిక ఎక్సైజ్ సుంకం కారణంగా పెట్రోలు, డీజిల్ రిటైల్ ధరలు చాలా ఎక్కువస్థాయిలో కొనసాగుతున్నాయి. ఇంధన ధరలలో పెరుగుదల రవాణా ఖర్చుల పెరుగుదలకు దారి తీస్తుంది. దానివలన పెరిగే ఆహార వస్తువుల, ఇతర వస్తువుల ధరల రూపంలో భారం ప్రజలపైనే పడుతోంది. సబ్సిడీని ఎత్తివేయడంతో వంటగ్యాస్ ధర కూడా బాగా ఎక్కువగా పెరిగింది. క్లుప్తంగా చెప్పాలంటే, తన స్వంత ఖజానాను నింపుకోడానికో, లేక బడా వ్యాపారులకు, హోల్‌సేల్ డీలర్లకు కట్టబెట్టడానికో, ప్రభుత్వం సామాన్య ప్రజలను పీల్చి పిప్పి చేసేలా ధరలను అక్రమంగా పెంచుతోంది.

2.19. **నిరుద్యోగం :** కరోనా మహమ్మారి అనంతరం ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందంటూ గొప్పగా ప్రకటించినప్పటికీ, అది వాస్తవరూపం దాల్చక పోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో ఉద్యోగాల పరిస్థితి అనేక విధాలుగా దిగజారిపోయింది. నిరుద్యోగం గురించి ప్రభుత్వ గణాంక సమాచారం (పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే) 2023–24 లో మొత్తం మీద నిరుద్యోగం కేవలం 3 శాతం మాత్రమే ఉన్నట్టు చూపుతోంది. కాని తక్కిన సంస్థల అంచనాలు (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ వంటివి) సెప్టెంబర్ 2024 నాటికి నిరుద్యోగం

8 శాతం చేరిందని, అంతకు ముందు కొన్ని నెలల పాటు 6 నుండి 9 శాతం మధ్యలో కొనసాగిందని తెలియజేస్తున్నాయి. యువజనులలో (15–29 సం. మధ్య) నిరుద్యోగం మరింత ఎక్కువగా, 10 శాతం కన్నా మించి ఉందని, పట్టణ ప్రాంతాల్లోనైతే దాదాపు 15 శాతం వరకూ ఉందని ప్రభుత్వమే నమోదు చేయవలసివచ్చింది. పరిస్థితి తీవ్రతను ఈ అంకెలు వ్యక్తం చేయవు. ఎందుకంటే కష్టించి పని చేయగల వయస్సులో ఉన్నవారు తమ మనుగడ కోసం అతి తక్కువ వేతనాలకు, దుర్భర పరిస్థితులకు సైతం సిద్ధపడి ఏ పనినైనా చేయడానికి తయారౌతున్నారు. అటువంటి వారందరూ 'ఉద్యోగులు' గానే లెక్కించబడతారు. ఇది ప్రచ్ఛన్నమైన, లేదా ముసుగు తొడిగిన నిరుద్యోగం తప్ప మరొకటి కాదు. ఇటీవల సంవత్సరాలలో, కరోనా మహమ్మారి అనంతర కాలంలో వస్తూత్పత్తి రంగం దిగజారి, వ్యవసాయంలో పని చేసే వ్యక్తుల శాతం పెరగడం ఆందోళనకరంగా వేగం పుంజుకున్న మరొక ధోరణి. అంటే స్థిరమైన, మంచి జీతాలు వచ్చే, భద్రత కలిగిన ఉద్యోగాలను కల్పించే బదులు, ప్రభుత్వ విధానం అంతకు మునుపు ఉండిన ట్రెండ్‌ను పూర్తి వ్యతిరేక దిశలోకి మళ్ళించి, ఇప్పటికే ఉపాధి అవకాశాలు హరించుకుపోయి, హీనమైన ఆదాయాలతో, సీజన్లలో మాత్రమే దొరికే పనులతో ఉన్న వ్యవసాయ రంగం వైపు ప్రజల్ని నెడుతోంది.

## ముందుకు తెస్తున్న హిందూత్వ ఎజండా

2.20. 'హిందూత్వ' ను ప్రభుత్వ అధికార సిద్ధాంతంగాచేస్తూ, ఈ లౌకిక–ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని 'హిందూ రాష్ట్ర' గా మార్చివేయాలన్న ఆరెస్సెస్ ఎజండాను ఒక పథకం ప్రకారం అమలు చేయడానికి పూనుకున్నారని గత మూడు సంవత్సరాలలో జరిగిన సంఘటనలు ధృవీకరిస్తున్నాయి. దేశమంతటా ఒకే ఒక హిందూత్వ అస్తిత్వాన్ని సృష్టించడం కోసం ముస్లింలను 'పరాయివారు' గా పరిగణించి వారిని లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తున్నారు. జనవరి 2024లో అయోధ్య లో రామాలయ ప్రారంభోత్సవం ఒక ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం అయిపోయింది.

2.21. రామనవమి, హనుమాన్ జయంతి, గణేశ్ పూజ వంటి పండుగల సందర్భంగా మతపరంగా ఊరేగింపులు తీయడం, మైనారిటీలు ఉండే ప్రాంతాలలోకి ప్రవేశించడం, ఘర్షణలు జరిగేలా రెచ్చగొట్టడం నిత్యమూ, ముఖ్యంగా బిజెపి–పాలిత రాష్ట్రాలలో జరుగుతున్నాయి. ఈ అన్ని సంఘటనలలోనూ మైనారిటీలకు చెందిన వారే పోలీసుల అణచివేతను ఎదుర్కొంటున్నారు. ముస్లిం ల ఇళ్ళను కూల్చివేయడానికి బుల్డోజర్లను ఉపయోగించడం ఉత్తరప్రదేశ్ లో మొదలై మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ

వంటి చోట్లకు వ్యాపించింది. ఈ విధంగా హిందూ పండుగల సందర్భంగా ముస్లిం మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం యదాలాపంగా జరిగే సంఘటనలుగా కాక, నిత్యమూ జరుగుతున్నాయని, ఆయా మతాల చుట్టూ ప్రజలు చేరిపోయి, వారి నడుమ మతపరమైన చీలిక శాశ్వతంగా నిలిచిపోడానికే జరుగుతున్నాయన్నది ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. హిందూత్వ ఉగ్రవాద శక్తులు మైనారిటీలకు వ్యతిరేకంగా, తమకెటువంటి శిక్షలూ పడవన్న ధీమాతో హింసకు పాల్పడుతున్నారు. వారికి ప్రభుత్వం మద్దత్తునిస్తోంది. మరోవైపు బాధితులే శిక్షలను అనుభవిస్తున్నారు.

2.22. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని బిజెపి–పాలిత రాష్ట్రాలు ఈ కాలంలో మరిన్ని చట్టాలను చేశాయి. ప్రస్తుతం ఉన్న చట్టాలను కూడా మరింత కఠినతరంగా మార్చాయి. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్ లో మతాంతరవివాహాన్ని 'లవ్ జీహాద్' గా పేర్కొంటూ అందుకు యావజ్జీవ కారాగార శిక్షను విధించేలా చట్టాన్ని మార్చారు. ముస్లింలను వేధించడానికి 'భూ జీహాద్', ఆహార జీహాద్' వంటి కొత్త పదాలను కూడా సృష్టిస్తున్నారు. ఈ విషయంలో అస్సాం ప్రభుత్వం తక్కిన రాష్ట్రాల కన్నా రెండాకులు ఎక్కువ చదివింది. చాలా తక్కువ ముస్లిం జనాభా ఉన్న ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో కూడా ముస్లిం దుకాణదారులు తమ దుకాణాలను మూసేయాలని, ముస్లిం వ్యాపారులను వెలి వేయాలని పిలుపులిచ్చారు.

2.23. తమ మైనారిటీ వ్యతిరేక ప్రచారంలో హిందూత్వ శక్తులు క్రైస్తవులను సైతం లక్ష్యంగా చేసుకున్నారు. 2023లో క్రైస్తవులపై 734 దాడులు జరిగితే, 2024 లో ఆ సంఖ్య 834 కు పెరిగింది. చర్చిల మీద, ప్రార్థనా సమావేశాలమీద దాడులు చేయడం, వెలి వేయడం, మత మార్పిడి నిరోధ చట్టంలోకి కఠినమైన నిబంధనలను ఉపయోగించడం వంటి చర్యలద్వారా క్రైస్తవులను వేధిస్తున్నారు. క్రైస్తవులుగా మారిన ఆదివాసీలనందరినీ షెడ్యూల్డ్ తెగల జాబితా నుండి తొలగించాలని, వారికి ఎస్‌టి హోదా ఉండరాదని క్రైస్తవ ఆదివాసీలకు వ్యతిరేకంగా ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి.

## మరింత బలపడిన నియంతృత్వం

2.24. వివిధ ప్రజాస్వామ్య–వ్యతిరేక చర్యల ద్వారా నియంతృత్వం గట్టిపడిందని 23వ మహాసభ తీర్మానం పేర్కొంది. గడిచిన మూడేళ్ళ కాలంలో ఈ ధోరణులు

మరింత తీవ్రతరమయాయి. వాటితోబాటు, పార్లమెంటును కట్టడి చేయడానికి, ఉన్నత న్యాయ వ్యవస్థను బలహీనపరచడానికి, ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని కృంగదీయడానికి చర్యలు చేపట్టారు.

2.25. మొత్తం ప్రతిపక్షం అంతా దాదాపుగా సస్పెండ్ అయిన పరిస్థితి పార్లమెంటులో ఏర్పడింది. మణిపూర్‌లో జాతుల మధ్య చెలరేగిన హింసాకాండ తదితర ముఖ్యమైన ప్రజా సమస్యలపై చర్చకు అనుమతించలేదు. ఇది మున్నెన్నడూ ఎరగని చర్య. 2023 పార్లమెంటు శీతాకాలపు సమావేశాల్లో ప్రతిపక్షాలకు చెందిన 146 మంది పార్లమెంటు సభ్యులను ఉభయ సభలనుంచీ సస్పెండ్ చేశారు. ముఖ్యమైన బిల్లులను లోతుగా అధ్యయనం చేయడానికి సంబంధిత పార్లమెంటరీ కమిటీలకు పంపకుండానే నేరుగా అమోదింపజేసుకున్నారు. నూతన పార్లమెంటు భవనాన్ని హిందూమత ఆచారాలతో ప్రధాని ప్రారంభించారు. స్పీకర్ ఆసనం వెనుక రాజదండాన్ని ఉంచారు.

2.26. అత్యంత క్రూరమైన ఉపా (అన్ లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) పిఎంఎల్ఎ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్) వంటి చట్టాలను ప్రతిపక్షనేతలపై ప్రయోగించి తద్వారా వారిని బిజెపిలోకి ఫిరాయించేటట్లు చేయడమో లేక జైళ్ళకు పంపడమో జరిగింది. లోక్‌సభ ఎన్నికలు కొద్ది వ్యవధిలో జరుగుతాయనగా, మన దేశ రాజకీయ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా జార్ఖండ్, డిల్లీ రాష్ట్రాల ముఖ్యమంత్రులను జైళ్ళలో పెట్టారు. స్వతంత్రంగా వ్యవహరించే మీడియాను తమ దాడులకు లక్ష్యంగా చేసుకోవడం, జర్నలిస్టులను అరెస్టు చేసి నిర్బంధించడం కొనసాగింది. పార్లమెంటులో ఎటువంటి చర్చా లేకుండానే ఆమోదం పొందిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలను పాత క్రిమినల్ కోడ్ల స్థానంలో తీసుకువచ్చారు. విచారణ కోసం అదుపులోకి తీసుకున్న సందర్భంలో పోలీసులకు గల అధికారాలను మరింత పెంచడం, దేశద్రోహం వంటి నేరాలకింద, ఆ పదాన్ని ప్రస్తావించకుండానే కేసులు బనాయించడానికి అవకాశాలను విస్తృతం చేయడం వంటివి కొత్త చట్టాలలో ఉన్నాయి. పౌరుల వ్యక్తిగత గోప్యతకు గల హక్కును హరించే విధంగా నిఘా వ్యవస్థను మరింత బలపరిచే టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ అమలులోకి వచ్చింది.

2.27. హైకోర్టు న్యాయమూర్తులను, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను నియమించే విషయంలో సుప్రీం కోర్టు కొలిజియం సిఫార్సులను అమలు చేయకుండా పలు సందర్భాలలో తిరస్కరించడం ద్వారా ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని

లొంగదీసుకునేందుకు పూనుకుంది. నియంతృత్వ నిర్మాణానికి మరింత బలాన్ని చేకూర్చే క్రమంలో ఇదొక భాగం. అంతకంతకూ ఉన్నతస్థాయి న్యాయ వ్యవస్థ "ప్రభుత్వ అధికార న్యాయ వ్యవస్థ" గా వ్యవహరిస్తోంది.

## ఎన్నికల కమిషన్ ను బలహీనపరచడం

2.28. ఎన్నికల కమిషన్ తన స్వయంప్రతిపత్తి హెూదా ప్రభావాన్ని కోల్పోతూ వస్తోంది. పార్లమెంటులో ఆమోదించిన చట్టం ప్రధాన ఎన్నికల కమిషనర్ ను, ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో అధికార వ్యవస్థకు మెజారిటీ కట్టబెట్టింది. ఇది సుప్రీం కోర్టు ఆదేశాలకు భిన్నంగా ఉంది. బిజెపి నాయకత్వం మత విద్వేష ప్రచారాన్ని చేపట్టే సందర్భాలలో ఎన్నికల కమిషన్ జోక్యం కల్పించుకోవడం మానివేసింది. ఎన్నికల తేదీలను నిర్ణయించే విషయంలో అధికార వ్యవస్థ ఆదేశాలకు లొంగిపోతోంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లేకుండా పోతోంది. పోలైన వోట్లకు, లెక్కించిన వోట్లకు మధ్య కనిపించే భారీ వ్యత్యాసాలు, ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, ఇవిఎం ల పని తీరు వంటి అంశాలమీద మీద తలెత్తిన ప్రశ్నలకు వివరణ లేదు.

2.29. కార్పొరేట్ అవినీతి కి దోహదం చేసే విధంగా నిధులను అందించే పద్ధతిని వ్యవస్థీకృతం చేసిన ఎలొక్టరల్ బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా పరిగణిస్తూ సుప్రీం కోర్టు 2024లో కొట్టివేసింది. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులను స్వీకరించేది లేదని మొదటే ప్రకటించడమే గాక ఆ స్కీమును సుప్రీం కోర్టులో సవాలు చేసిన సిపిఐ(ఎం) వైఖరి సరైనదని ఈ తీర్పు స్పష్టం చేసింది. ఎలొక్టరల్ బాండ్ల పథకం రద్దైనప్పటికీ, వివిధ స్థాయిలలోని ఎన్నికలలో వోటర్లను ప్రభావితంచేసి ఎన్నికల ప్రక్రియను చెడగొట్టేలా భారీ మొత్తాలలో డబ్బు రంగంలోకి దిగుతోంది. ఈ చట్ట విరుద్ధమైన ధనానికి వనరుగా రాజకీయవేత్త – వ్యాపారవర్గం కూటమి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికల సంస్కరణలు చేపట్టి ఎన్నికల వ్యవస్థలో డబ్బు పాత్రను అదుపు చేయడం అత్యవసరంగా ముందుకొచ్చిన సవాలు.

## సమాఖ్య వ్యవస్థను కూలదోయడం

2.30. సమాఖ్య వ్యవస్థ చట్రాన్ని కూలదోస్తూ, సమాఖ్య సూత్రపు చట్టబద్ధతను సైతం హరిస్తూ మోడీ ప్రభుత్వం అన్ని అధికారాలనూ కేంద్రీకృతం చేసే దిశగా పోతోంది. రాజకీయ, ఆర్థిక, ద్రవ్య సంబంధిత చర్యల మేళవింపు ద్వారా, కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు నడుమ నడిచే అధికారపు గమన సూత్రాలనే మోడీ ప్రభుత్వం పునర్ నిర్వచించింది. వసూలైన పన్నులలో రాష్ట్రాలతో పంచుకోవలసిన భాగాన్ని

తగ్గించివేయడం, రాష్ట్రాలకు వనరులను నిరాకరించడం, జిఎస్‌టి పరిహారాన్ని రాష్ట్రాలకు చెల్లించకుండా నిలిపివేయడం వంటి చర్యల ద్వారా అనేక ప్రతిపక్ష–పాలిత రాష్ట్రాలలో ద్రవ్య సంక్షోభాన్ని సృష్టించింది. కేంద్ర పన్నులలో రాష్ట్రాలకు ఇచ్చే భాగం తగ్గిపోయింది. కొన్ని సంవత్సరాలుగా కేంద్ర బడ్జెట్ లలో రాష్ట్రాలకు చెల్లించవలసిన పన్నుల వాటాను తగ్గిస్తూ వస్తున్నారు. 2016లో 41.1 శాతం వాటా రాష్ట్రాలకు ఉండగా 2023 నాటికి అది 35.1 కి తగ్గిపోయింది. రాష్ట్రాలకు వాటా పంచి ఇవ్వనవసరం లేని సెస్‌లు, సర్‌చార్జిలు పెంచుకుంటూ కేంద్రం రాష్ట్రాలతో పంచుకోవలసిన పన్నుల భాగాన్ని తగ్గించివేస్తోంది. ఒకవైపు రాష్ట్రాల వనరులు ఎండిపోతూవుండగా మరోవైపు అవి అప్పులు చేయడానికి ఆటంకాలు పెరిగి పోతున్నాయి. అభివృద్ధి కార్యకలాపాలు గాని సంక్షేమ చర్యలు గాని చేపట్టడానికి కావలసిన వనరులను రాష్ట్రాలు సమీకరించుకోడానికి ఇది అవరోధంగా ఉంది.

2.31. మోడీ రెండవసారి అధికారంలోకి వచ్చాక, ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల జోక్యం పెరిగిపోతూ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, చట్ట సభల అధికారాలను గవర్నర్లు అతిక్రమించడం పెరిగింది. వైస్ చాన్సలర్లను ఏకపక్షంగా నియమించడం, అసెంబ్లీ ఆమోదించిన చట్టాలకు ఆమోదముద్ర నిరాకరించడం, రాష్ట్ర ప్రభుత్వాన్ని పక్కన బెట్టి నేరుగా రాష్ట్ర ఉన్నతాధికారులను పిలిపించుకోవడం వంటివి పరిపాటి అయిపోయాయి. మౌలికమైన కేంద్ర–రాష్ట్ర సంబంధాలను బలహీనపరచడానికి గవర్నర్లను వాడుకుంటున్నారు. రాష్ట్రాలు చేపట్టే అభివృద్ధి పథకాలలో కేంద్రం వంతుగా ఇచ్చేది నామ మాత్రమే అయినా, ఆ పథకాలకు కేంద్ర ప్రభుత్వం పేరు పెట్టకపోతే వాటితోబాటు తక్కిన పథకాలకు కూడా కేంద్ర వాటాలను చెల్లించబోమని పట్టుపడుతూ, రాష్ట్రాల అభివృద్ధి పథకాలను కూడా తన ఖాతాలోనే వేసుకోడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది.

2.32. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానాన్ని అమలు చేయడం కోసం బిజెపి చేస్తున్న ప్రయత్నం కేంద్రీకరణ దిశగా ఆ పార్టీ నెడుతోందని స్పష్టం చేస్తోంది. ఒక రాజ్యాంగ సవరణ బిల్లును, లోక్‌సభకు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకే సారి ఎన్నికలు జరపాలంటూ మరొక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అటువంటి విధానం రాష్ట్రాల హక్కులను, రాజ్యాంగం గ్యారంటీ చేసిన 5 సంవత్సరాల పదవీ కాలాన్ని కూడా తీవ్రంగా దెబ్బ తీస్తుంది. ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానం నియంతృత్వ కేంద్రీకరణకు దారి తీస్తుంది.

2.33. హిందూత్వ శక్తులు, బడా కార్పొరేట్లు జంటగా ఈ అధికార కేంద్రీకరణ దిశగా నెడుతున్నారు. అందుచేత నియంతృత్వానికి వ్యతిరేకంగా, హిందూత్వకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సమాఖ్య స్వభావాన్ని, రాష్ట్రాల హక్కులను పరిరక్షించే అంశాన్ని ఒక ముఖ్యమైన భాగంగా చేయాలి. రాష్ట్రాల హక్కుల పరిరక్షణ కోసం ఒక ఐక్య కూటమిగా నిలిచేలా బిజెపి-యేతర రాష్ట్రాలన్నింటినీ సమీకరించాలి.

## జమ్ము, కాశ్మీర్ - ప్రజాస్వామ్యం మీద, సమాఖ్య తత్వం మీద దాడికి సంకేతం

2.34. బిజెపి ప్రభుత్వపు అప్రజాస్వామిక, సమాఖ్య-వ్యతిరేక వైఖరి తీవ్ర స్థాయిలో వ్యక్తం అయినదానికి జమ్ము, కాశ్మీర్ లలో జరిగినది సంకేతం. 2019లో 370 అధికరణాన్ని రద్దు చేసి జమ్ము-కాశ్మీర్ రాష్ట్రాన్ని ముక్కలు చేసిన తర్వాత ఆ కేంద్ర పాలిత ప్రాంతాల్లో రాజ్య నిర్బంధం, పౌర హక్కుల నిరాకరణ అనేవి సర్వ సాధారణం అయిపోయాయి. అక్కడ శాశ్వతంగా నివసిస్తున్నవారి స్వస్థల హోదాను తొలగించి వారి భూ హక్కులను రద్దు చేయడానికి చర్యలు చేపట్టారు. కొత్త అసెంబ్లీలో లోయ ప్రాంతానికి ప్రాతినిధ్యం తగ్గిపోయే విధంగా నియోజకవర్గాల పరిధుల పునర్విభజన చేశారు. 370 అధికరణ రద్దును, జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని ముక్కలు చేయడాన్ని సవాలు చేసిన పిటిషన్ ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ తీర్పు సమాఖ్య తత్వాన్ని, ఎన్నికైన రాష్ట్ర అసెంబ్లీల హక్కులను తీవ్రంగా దెబ్బ తీసింది.

2.35. చివరికి సెప్టెంబర్ 2024లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో, బిజెపి ఎన్ని కుట్రలు పన్నినా, తట్టుకుని నేషనల్ కాన్ఫరెన్స్ నేతృత్వంలోని కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం చాలా పరిమితమైన అధికారాలతో ప్రభుత్వాన్ని ఏర్పరచింది, ఐతే, రాష్ట్ర హోదా కల్పిస్తామంటూ కేంద్రం సుప్రీం కోర్టుకు ఇచ్చిన హామీని ఇంకా నెరవేర్చలేదు. ఈలోపు లడఖ్‌లో ఆరవ షెడ్యూలు హోదా తోబాటు స్వయం ప్రతిపత్తిని కోరుతూ ఒక ప్రజా ఉద్యమం తలెత్తింది. ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్ పై పోరాటాన్ని కొనసాగిస్తూనే తక్షణమే రాష్ట్ర హోదాను కల్పించాలన్నది లౌకిక-ప్రజాస్వామిక శక్తుల లక్ష్యం.

## మణిపూర్ : మరింత లోతుగా చీలిక

2.36. 2023 మే 3 న తెగల మధ్య హింసాకాండ చెలరేగి నేటికి 20 మాసాలు గడిచిపోయినప్పటికీ, అక్కడి పరిస్థితి విపత్కరంగానే ఉంది. గృహ దహనాలు, మాన భంగాలు, కిడ్నాప్‌లు, అమాయకుల ప్రాణాలను బలి తీసుకోవడం వంటి

అత్యంత హేయమైన కార్యాలు అక్కడ జరిగాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకూ 250 మంది ప్రాణాలు పోయాయి. 60,000 మందికి పైగా ప్రజలు శరణార్థులుగా శిబిరాలలో ఉంటున్నారు. పరిస్థితిని సాధారణ స్థాయికి తెచ్చి రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంలో కేంద్రంలోను, రాష్ట్రంలోను ఉన్న బిజెపి ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఇప్పటిదాకా ఒక్కసారి కూడా ప్రధాని మోడీ ఆ రాష్ట్రానికి పోలేదు. అక్కడ జరిగిన ఘర్షణల్లో పక్షపాత ధోరణితో వ్యవహరించాడని సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైనప్పటికీ, ముఖ్యమంత్రి హిరేన్ సింగ్‌ను తొలగించలేదు. భద్రతా దళాలను, అది కూడా చాలా ఆలస్యంగా పంపడం మినహా, అక్కడ ప్రజా ప్రతినిధులతో, రాజకీయ పార్టీలతో, ఘర్షణలలో ఉన్న వివిధ తెగలకు చెందిన గ్రూపులతో చర్చలు జరపడానికి ఎటువంటి చెప్పుకోదగ్గ చర్యా చేపట్టలేదు. ఇలా కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయకుండా ఉండిపోవడం అనేది అక్కడ ప్రజల్లో విశ్వాసాన్ని మళ్ళీ నెలకొల్పడానికి, శాంతి, సామరస్య పూరిత వాతావరణాన్ని నెలకొల్పడానికి ఆటంకంగా మారింది.

2.37. ఇలా మెదలకుండా ఉండిపోవడంవలన ఏర్పడే ప్రమాదకర పర్యవసానాలు వేటినీ కేంద్రం పట్టించుకోవడం లేదు. మణిపూర్ లోని ఘర్షణలు ముదిరి మొత్తం ఈశాన్య ప్రాంతం అంతటిలోనూ శాంతికి భంగకరంగా మారవచ్చు. బిరేన్ సింగ్‌ను తక్షణమే ముఖ్యమంత్రిగా తొలగించి ఘర్షణలలో ఉన్న భాగస్వాములందరితోనూ చర్చలు ప్రారంభించి అన్ని తెగల హక్కులనూ కాపాడేలా, శాంతి, సాధారణ పరిస్థితి తిరిగి నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం వంటనే జోక్యం చేసుకోవాలి.

## విదేశాంగ విధానం, అమెరికాతో వ్యూహాత్మక బంధం

2.38. మోడీ ప్రభుత్వం రెండవ సారి పదవీ కాలంలో ప్రభుత్వ విదేశాంగ విధానంలో అమెరికాతో సన్నిహిత సమన్వయం కలిగివుండడం అనేది ప్రధాన అంశం. ట్రంప్ అధ్యక్షుడిగా మళ్ళీ రావడంతో ఈ సమన్వయం తప్పకుండా కొనసాగుతుంది. ఒక్క ఉక్రెయిన్ – రష్యా యుద్ధం విషయంలో మాత్రం భారతదేశం తటస్థ వైఖరి తీసుకుంది తప్ప తక్కిన విదేశాంగ విధానం అంతా స్థూలంగా అమెరికా భౌగోళిక రాజకీయ వ్యూహాన్ని అనుసరించే నడిచింది. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనా–వ్యతిరేక కూటమిలో భారతదేశం పోషించవలసిన పాత్రకు అమెరికా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నందువలన అది అయిష్టంగానైనా, ఉక్రెయిన్ విషయంలో ఇండియా తీసుకున్న వైఖరిని అంగీకరించవలసి వచ్చింది. దేశాల నాయకత్వపు శిఖరాగ్ర

సమావేశాల స్థాయికి క్వాడ్ (క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్ – చతుర్ముఖ భద్రతా చర్చలు) ను తీసుకువెళ్ళారు. ఈ క్వాడ్ ను ఒక భద్రతాపరమైన, వ్యూహాత్మక కూటమిగా మార్చడంలో మోడీ ప్రభుత్వం అమెరికా ప్రయత్నాలకు వంత పాడింది. కీలకమైన, ముందుకు వచ్చే సాంకేతికత ఒప్పందం, 2022 (క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పాక్ట్) మీద, సరఫరా ఏర్పాట్ల భద్రత మరియు పరస్పర రక్షణావసరాల సేకరణ ఏర్పాటు ఒప్పందం, 2023 (సెక్యూరిటీ ఆఫ్ సప్లై ఎరేంజ్‌మెంట్స్ అండ్ రెసిప్రోకల్ డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ ఎరేంజ్‌మెంట్ పాక్ట్) మీద సంతకాలు చేయడంతో భారతదేశం అమెరికా యొక్క రక్షణ, భద్రతా వలయంలో ఒక కీలక భాగం అయింది. గత ఏడేళ్ళ కాలంలో భారతదేశం అమెరికా నుండి 1500 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను కొనుగోలు చేసింది.

2.39. అమెరికా–ఇండియా–ఇజ్రాయిల్ ఒక అక్షరాజ్య కూటమిగా ఏర్పడడంతో గాజా మీద ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హనన యుద్ధంలో ఇజ్రాయిల్ ను బలపరచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది సిగ్గుచేటు. ఐరాస జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాకు మద్దతుగా ప్రతిపాదించిన తీర్మానం మీద ఓటింగ్‌కు భారతదేశం గైరు హాజరైంది. అంతే గాక, ఇజ్రాయిల్‌కు భారతదేశం ఆయుధాలను, పేలుడుపదార్థాలను ఎగుమతి చేస్తోంది. వాటిని గాజా మీద యుద్ధంలో ఇజ్రాయిల్ ఉపయోగిస్తోంది. ఐ2యు2 (ఇండియా, ఇజ్రాయిల్, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), ఐఎంఇసి (ఇండియా, మిడిల్ ఈస్ట్, యూరప్ ఎకనామిక్ కారిడార్) అనే రెండు సమూహాలూ అమెరికా–అనుకూల స్వభావం కలవి. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో భారతదేశ విదేశాంగ విధానాన్ని అమెరికా విధానంతో జతపరచడానికి ఆ రెండింటినీ ఏర్పాటు చేశారు. బ్రిక్స్‌లో, ఎస్‌సిఓ లో భారతదేశం సభ్యదేశంగా ఉండడం ప్రపంచంలో పెరుగుతున్న బహుళ ధృవత్వానికి సంకేతం. కాని అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలను నెలకొల్పుకోవడం ఈ బహుళ ధృవత్వం ముందుకు తెచ్చే అవకాశాలను వినియోగించుకోడానికి ఆటంకంగా మన దేశానికి పరిణమిస్తుంది.

## కుదించుకుపోతున్న విద్యావకాశాలు

2.40. విద్యారంగం గత మూడేళ్ళ కాలంలో అతి తీవ్ర దాడికి గురైంది. ఈ దాడి ప్రధానంగా విద్యావకాశాలు తరిగిపోవడం అనే రూపంలో వ్యక్తం అవుతోంది. 'కొనసాగించడం సాధ్యం కాదు' అనే సాకుతో (వయబులిటీ) వేలాదిగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు. ఇది విద్యాహక్కు చట్టాన్ని పూర్తిగా ధిక్కరించడమే. నివాస

ప్రాంతాల్లో పాఠశాలలు నడపడం తప్పనిసరి అని ఆ చట్టం ఆదేశిస్తున్నది. ప్రైవేటీకరణ దిశగా సాగుతున్న ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వలస పోతున్నారు. కేరళ వంటి రాష్ట్రాలు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరించడం చెప్పుకోదగ్గ విషయం. డిగ్రీ చదువులకు కూడా ఇదే విధానాన్ని వర్తింపజేయడంతో కళాశాలల చదువులను మధ్యలోనే మానేస్తున్నవారి సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. సామాజిక రంగానికి చేసే కేటాయింపులను, ఖర్చులను తగ్గించడమే మొత్తం మీద ప్రభుత్వ ప్రయత్నంగా ఉంది. నిధులను నిలిపివేయడం, లేదా తక్కువ నిధులను కేటాయించడం, అనేది ఈ ప్రతికూల పరిణామంలో ఒక కీలకాంశం. కోవిడ్-19 మహమ్మారి అనంతర కాలంలో చాలా పెద్ద ఎత్తున, దీర్ఘకాలం పాటు చాలా విద్యా సంస్థలను మూసేయడం ఈ కొత్త విధానాన్ని వేగంగా అమలు చేయడానికి దోహదం చేసింది.

2.41. శాస్త్ర విజ్ఞానాన్ని, శాస్త్రీయ ప్రవృత్తిని, హేతువాద ఆలోచనలను స్థూలంగా దెబ్బ కొట్టడం అనేది ఈ దాడిలో మరొక అంశం. నియంతృత్వ, ఫాసిస్టు సూత్రాలను ఎక్కించడానికి గీటురాయిగా ఉండే అంశాలను, విశ్వాసం ప్రాతిపదిక మీద రూపొందిన భావజాలాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ విధమైన దిశగా పోవడం మతతత్వ, అస్తిత్వ ఆధారిత విద్వేష భావజాలాన్ని పెంచి పోషించడానికే గాక, మన గణతంత్రపు ప్రజాస్వామ్య, లౌకిక అస్థిత్వాన్ని తిరగరాని దానిని హిందూత్వ-భావజాలానికి అనుగుణంగా మార్చివేయడానికే దారి తీస్తుంది. ప్రత్యేకాంశాలలో విధాన రూపకల్పన చేసే సంస్థలలో నియామకాలను చేసి వాటిని తమ చేజిక్కించుకోవడంలో ఈ కొత్త మార్పు కనిపిస్తోంది. ఇది యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల వరకూ విస్తరించింది.

2.42. ప్రభుత్వ నిధులను ఉపసంహరించుకోవడంతో ఏర్పడిన భారీ స్థాయి నిధుల కొరతను లాభాపేక్ష గల కార్పొరేట్ల పెట్టుబడులతో భర్తీ చేస్తున్నారు. ఉపాధ్యాయుడు-విద్యార్థి నడుమ భౌతికంగా కొనసాగే బోధనాప్రక్రియ స్థానంలో డిజిటల్ శిక్షణ ను చేపట్టడానికి ఇది దారి తీస్తోంది. విద్యారంగ కార్పొరేట్లు ముందుకు తెస్తున్న డిజిటల్ వేదికల దయాదాక్షిణ్యాలకు విద్యాబోధన ప్రక్రియను విడిచి పెడుతున్నారు.

2.43. విద్యారంగ నిర్వహణ అతిగా కేంద్రీకరించబడడం అనేది నూతన విద్యా విధానం 2020 తో బాటు అమలు అవుతోంది. ఇది సమాఖ్యతత్వ సూత్రాన్ని నిర్ణయాత్మకంగా దెబ్బ తీస్తోంది. రాజ్యాంగం రూపొందించిన విధానానికి విరుద్ధంగా,

గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఎజండాను ముందుకు నెట్టే పనిముట్లుగా వ్యవహరిస్తూ చాన్సలర్ పదవిని దుర్వినియోగం చేయడం ఈ కేంద్రీకరణలోని ఒక కీలకాంశం. యుజిసి ముసాయిదా మార్గదర్శకాలు చాన్సలర్లకు వైస్ చాన్సలర్ల ఎంపిక అధికారాన్ని కట్టబెట్టడానికి చూస్తున్నాయి. అంతే గాక, చాలా రాష్ట్రాల్లో కాలేజీల్లో, యూనివర్సిటీల్లో, విద్యార్థి సంఘాల ఏర్పాటును అనుమతించడం లేదు.

## ఆరోగ్య సంరక్షణ ప్రైవేటీకరణ

2.44. ఇటీవలి కాలంలో ప్రజారోగ్యానికి సంబంధించిన అనేక ప్రతికూలతలను భారతదేశం ఎదుర్కుంటున్నది. ప్రపంచంలోని తక్కిన అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థల కన్నా ఇప్పటికే ఆరోగ్యం మీద చేసే ఖర్చులో ప్రభుత్వ వాటా అతి తక్కువగా ఉంది. ఈ కాలంలో అది మరింత తగ్గిపోయింది. ప్రజల జేబులనుంచి పెట్టుకోవలసిన ఖర్చు పెరిగింది. ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య నమ్మశక్యం కాని స్థాయిలో కార్పొరేటీకరించబడి వారికి లాభాలు కట్టబెడుతున్నాయి. పిఎం జె ఎ వై వంటి ఇన్సూరెన్స్ స్కీములలో ప్రజలను భాగస్వాముల్ని చేసి వారిని ప్రైవేటు వైద్య సేవలవైపు నడిపించడం, అవినీతిని వ్యవస్థీకృతం చేయడం సర్వ సాధారణ విషయం అయిపోయింది. మరోవైపు ప్రజారోగ్య వ్యవస్థ సేవలు, మౌలికవసతుల కల్పన మరింత బలహీనపడ్డాయి. ప్రభుత్వ రంగ ఔషధ సంస్థలను, ఆరోగ్య సాంకేతిక రంగాన్ని ఒక పథకం ప్రకారం బలహీనపరుస్తున్నారు. అదే సమయంలో ఏమాత్రమూ నియంత్రణ లేని ప్రైవేటు కార్పొరేట్ చైన్ లు గుత్తాధిపత్యాన్ని చేజిక్కించుకుంటున్నాయి. ప్రైవేటు క్రోనీలకు వ్యాక్సిన్‌ల తయారీతో సహా పరిశోధనలన్నింటినీ అప్పజెప్తున్నారు. వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలు గిగ్ ఆర్థిక వ్యవస్థతో సహా, ఎల్లెడలా పెరిగి పోతున్నాయి. డిజిటలైజేషన్ తదితర సాంకేతిక-ప్రధాన సంస్కరణలన్నీ ఇప్పటికే సేవలు అందకుండా పోతున్న ప్రజానీకాన్ని మరింత దూరంగా నెడుతున్నాయి. ప్రజారోగ్య వ్యవస్థ వేగంగా దిగజారిపోతూ వుండడంతో ప్రజల ఆరోగ్య పరిస్థితులు, ముఖ్యంగా పేదల విషయంలో అథోగతికి చేరుతున్నాయి. ప్రజారోగ్య వ్యవస్థ దివాళాకోరుతనాన్ని బహిర్గతం చేసిన కోవిడ్ మహమ్మారి కాలపు వినాశకర అనుభవాలు మన దేశం ముందు ఉన్నప్పటికీ, పరిణామాలు ఈ దిశగా కొనసాగుతున్నాయి.

2.45. ఆరోగ్యం అనేది రాష్ట్రాల పరిధిలోని అంశమే అయినప్పటికీ, ద్రవ్య ఫెడరలిజాన్ని దెబ్బ తీయడం ద్వారా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి

ప్రయత్నిస్తున్న రాష్ట్రాలకు ఆటంకాలను సృష్టిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం బూటకపు గొప్పలు చెప్పుకుంటూ, ఆరోగ్య స్థాయి గురించి, ఆరోగ్య సంరక్షణ గురించి తప్పుడు ప్రచారానికి పూనుకుంటోంది. అదే సమయంలో తన జవాబుదారీ తనాన్ని ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేకుండా దారులను మూపివేస్తోంది. ఎంతో అవశ్యమైన కాలానుగత ఆరోగ్య సర్వేలను అప్రదిష్టపాలు చేసి నీరు గారుస్తున్నారు. పేటెంట్లు లేని అత్యవసర ఔషధాల ధరలను విపరీతంగా పెంచడానికి అనుమతులిస్తూ, పేటెంట్లు ఉన్న ఔషధాల ధరలను తారాస్థాయికి తీసుకుపోతున్న బహుళజాతి సంస్థల చర్యలను సవాలు చేయకుండా ఊరుకుంటూ ప్రభుత్వం కార్పొరేట్లు సూపర్ లాభాలు కొల్లగొట్టడానికి వీలైన విధానాలను అమలు చేస్తోంది. ప్రత్యామ్నాయ విధానాలలో భాగంగా ప్రజల ఆరోగ్యహక్కు కోసం, ప్రభుత్వ నిధులతో అందరికీ ఆరోగ్య సంరక్షణ కల్పించడం కోసం పోరాటాన్ని పెంపొందించాలి.

## సంస్కృతి పై భీకర దాడి

2.46. సాంస్కృతిక, పరిశోధనా సంస్థలలో తన సంస్థకు చెందిన వ్యక్తులు చొరబడేలా చేసి ఆరెస్సెస్ వాటిపై తన పట్టును పెంచుకుంది. భారతదేశ చరిత్రను మతోన్మాద దృక్కోణం నుంచి తిరగరాస్తూ, పురాణాలే వాస్తవ చరిత్ర గా చిత్రించడానికి వారు ప్రయత్నిస్తున్నారు. భారతదేశ చరిత్రను, సంస్కృతిని పెంపొందించడంలో హైందవేతరుల పాత్రను తక్కువ చేసి చూపుతూ తుడిచిపెడుతున్నారు. జాతీయోద్యమం యొక్క, సామాజిక సంస్కరణోద్యమాల యొక్క లౌకిక, అభ్యుదయ వారసత్వాన్ని మసకబారుస్తున్నారు. అబద్ధపు కథనాలతో బూటకపు అతిశయాన్ని పెంచుతున్నారు. అత్యధిక ప్రజానీకపు సాధారణ చైతన్యంలో అంతర్భాగం కానిదే హిందుత్వ మతతత్వ ఎజండా విజయం సాధించలేదు. ఇది ప్రజాదరణ కల సాంస్కృతిక రూపాల ద్వారానే సాధ్యపడుతుంది. అందుచేత వాళ్ళు పట్టు వదలకుండా సినీ పరిశ్రమలోకి, టెలివిజన్ చానెళ్ళలోకి, ఒటిటి వేదికలలోకి, ప్రజాదరణ పొందే సంగీతంలోకి, ఇటీవల ఉన్నతస్థాయి కళలలోకి కూడా చొరబడడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. స్థానిక, ప్రాంతీయ మత ఉత్సవాలను జాతీయ స్థాయిలో విస్తృతంగా చూపడం ద్వారా 'ఏకరూప హిందూ అస్తిత్వాన్ని' సృష్టించడానికి వాళ్ళు ప్రయత్నిస్తున్నారు. హేతువు మీద, తార్కిక ఆలోచన మీద వారి దాడి వేగంగా కొనసాగుతోంది. గుడ్డి విశ్వాసాలు, మూఢాచారాలు, ఫ్యూడల్ విలువలు, పితృస్వామిక భావజాలం, పురుషాధిక్యత, కులాన్ని భ్రష్టు పట్టనివ్వకుండా పవిత్రంగా కాపాడుకోవడం వంటి భావాల పునాది మీద హిందుత్వ

మతోన్మాద భావజాలం పెరిగి నిలదొక్కుకుంటుంది. సాంస్కృతిక, మేధో సంస్థల ద్వారా హేతువిరుద్ధమైన, అశాస్త్రీయమైన సిద్ధాంతాలు, బోధనలు ప్రభుత్వ మద్దతుతో ప్రోత్సహించబడుతున్నాయి. అన్ని అభ్యుదయ. లౌకిక సాంస్కృతిక గ్రూపుల, సంస్థల మధ్య సమన్వయంతో నికరంగా కొనసాగేవిధంగా సాంస్కృతిక రంగంలో హిందూత్వ ఎజండాను ఎదుర్కోవాలి.

## మీడియా స్వాధీనం

2.47. ప్రధాన స్రవంతి మీడియా యావత్తూ, కొద్దిపాటి సంస్థలు మినహా, పాలకపార్టీ, కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురాబడ్డాయి. కార్పొరేట్ మీడియా యాజమాన్యాలు ప్రభుత్వం కొమ్ము కాస్తూ, వాటి టివి చానెళ్ళు మత విద్వేష ప్రచారాన్ని వెళ్ళగక్కుతున్నాయి. స్వతంత్రంగా వ్యవహరించే మీడియా, డిజిటల్ మీడియా వేదికలు బెదిరింపుల నెదుర్కొంటున్నాయి. పోలీసులు, కేంద్ర సంస్థలు న్యూస్ క్లిక్ ను లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం ద్వారా ఒక హెచ్చరికను జారీ చేశాయి. మీడియాను అదుపు చేయడానికి, సెన్సారు చేయడానికి నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2023 ఐటి నిబంధనల సవరణలు అందులో భాగమే. వాటిలో కొన్ని భాగాలను బాంబే హైకోర్టు అమలులోకి రాకుండా నిలుపు చేసింది. 2024 లో పత్రికా స్వేచ్ఛాసూచికలో 180 దేశాలకు గాను భారతదేశం 159వ స్థానంలో ఉంది.

## మహిళలు: బిజెపి పాలనలో దురవస్థల కష్టాలు

2.48. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించినప్పటికీ, దాని అమలును నిరవధికంగా ఆలస్యం చేయడం ద్వారా భారతదేశంలోని మహిళలకు మోడీ ప్రభుత్వం ద్రోహం చేసింది. జనాభా గణన ప్రక్రియను ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు. నియోజకవర్గాల పరిధుల పునర్నిర్ణయ ప్రక్రియ (డీ లిమిటేషన్) కూడా దీర్ఘకాలం పాటు సాగుతుంది. ఈ రెండింటితోనూ మహిళల రిజర్వేషన్ అమలును అనవసరంగా ముడిపెట్టడం తప్పు. దీని ఫలితంగా అసెంబ్లీలలో, పార్లమెంటులో అతి తక్కువ ప్రాతినిధ్యం భారతదేశంలో ఉంది. ఇది మన చుట్టుపక్కల ప్రాంతంలోకెల్లా అతి తక్కువ.

2.49. మహిళల బ్యాంక్ ఖాతాలలోకి రు.1000 లేదా 1500 చొప్పున నగదును బదలాయించే పథకాల ద్వారా మహిళలలో తమ మద్దతుదారులను పెంచుకోడానికి పలు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించాయి. మహిళల ఆర్థిక దుస్థితి

ఎంత దయనీయంగా ఉందంటే అటువంటి చిన్న మొత్తాలు సైతం వారి జీవితాలమీద గణనీయమైన ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. తద్వారా వారి వోటింగ్ సరళిని రాజకీయంగా ప్రభావితం చేస్తున్నాయి. మహిళలలో అత్యధికులలో ఈ తరహా పథకాలపట్ల కలుగుతున్న సానుకూల స్పందన పట్ల సున్నితంగా వ్యవహరించేలా మన జోక్యం ఉండాలి. రాజ్యాంగపరంగా సమాన స్థాయిలో పౌరసత్వ హక్కులు కలిగిన స్థాయినుండి మహిళలను కొన్ని స్కీములపై ఆధారపడే 'లబ్ధిదారుల' స్థాయికి దిగజార్చడమే బిజెపి వైఖరిగా ఉంది. అటువంటి పథకాల ప్రయోజనాలను పొందేందుకు మహిళలకు తోడ్పడుతూనే మహిళా హక్కుల కోసం జరిగే పోరాటాలను బలోపేతం చేయవలసిన అవసరం ఉంది. కుటుంబాల మనుగడ కోసం మహిళలు చేసే పనికి గుర్తింపు సాధించడం కూడా ఆ పోరాటాల్లో ఒక కర్తవ్యంగా ఉండాలి.

2.50. మహిళలు ఇంట్లో చేసే పని, కుటుంబం యొక్క వ్యవసాయ భూమిలో చేసే పని, కుటుంబం నిర్వహించే సంస్థలలో చేసే పని యావత్తూ వేతనం లేని శ్రమగానే ఉండడం ఈనాటి చేదు వాస్తవం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ మధ్య విడుదల చేసిన 'ఎకో రాప్' నివేదిక ప్రకారం మహిళలు ఇళ్ళలో చేసే వేతనాలు లేని శ్రమ విలువ రు.22.7 లక్షల కోట్లు. అది మన దేశ జిడిపిలో 7.5 శాతం. పెరుగుతున్న ధరలు, మహిళల్లో అధికంగా ఉన్న నిరుద్యోగం రేటు, ఉపాధి హామీ పథకానికి పెడుతున్న నిధుల కోతలు, పర్యవసానంగా తగ్గుతున్న పని దినాలు అన్నీ కలిసి మహిళలజీవితాలపై వినాశకర ప్రభావాన్ని చూపుతున్నాయి. వారు హెచ్చు వడ్డీలకు రుణాలు తీసుకునేలా నెట్టి, ఎక్కువ సందర్భాల్లో దురాశాపరులైన మైక్రో ఫైనాన్స్ సంస్థల అప్పుల వలలో చిక్కుకునేట్టు చేస్తున్నాయి.

2.51. మోడీ ప్రభుత్వపు దశాబ్దకాల పాలనలో మహిళలపై నేరాలు 28 శాతం పెరిగాయి. జాతీయ నేరాల నమోదు బ్యూరో నివేదికల ప్రకారం 2022లో సగటున ప్రతీ గంటకూ మహిళల మీద 50 నేరాలు జరుగుతున్నాయి. ప్రతీ రోజూ 88 మంది మానభంగానికి గురౌతున్నారు. వారిలో 11 మంది దళిత మహిళలు, నేరస్థులకు శిక్షలు పడడం చాలా తక్కువ స్థాయిలో మాత్రమే జరుగుతోంది. మానభంగాల కేసుల్లో నిందితులుగా పేర్కొనబడ్డవారిలో ప్రతీ 100 మందిలో 75 మంది శిక్షలు పడకుండా తప్పించుకుంటున్నారు. మహిళా మల్ల యుద్ధ క్రీడాకారిణుల కేసు వంటి ప్రాచుర్యం పొందిన అనేక కేసుల్లో బిజెపి ప్రభుత్వాలు బాహాటంగానే నిందితులను సమర్థించాయి. బిజెపి పరిపాలనలో భారతదేశం మహిళలకు రక్షణ పూర్తిగా కరువైన దేశాల్లో ఒకటిగా తయారైంది.

2.52. జీవితభాగస్వామిగా ఎంచుకున్న వ్యక్తి గనుక వేరే మతానికి చెందినవారైతే, అలా ఎంచుకున్న మహిళకు తన జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు లేకుండా చేస్తూ 12 'డబుల్ ఇంజన్' రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను చేశాయి. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆమోదించిన ఏకరూప పౌరస్మృతి ఆదర్శవంతమైన నమూనా అని బిజెపి చెప్పుకుంటోంది. ఆ చట్టం ప్రకారం 'సహజీవనం' వంటి పరస్పర అంగీకార ప్రాతిపదికన ఏర్పడే లైంగిక సంబంధాలు నేరంగా పరిగణించబడతాయి. ఒక యుక్త వయస్సు చేరిన మహిళ తన జీవనాన్ని ఏ విధంగా సాగించాలో నిర్ణయించుకునే ప్రాథమిక హక్కును ఆ చట్టం నిరాకరిస్తోంది. గిరిజన తెగలకు ఈ ఏకరూప పౌరస్మృతి వర్తించదని బిజెపి పదే పదే నొక్కి చెప్తోంది. దీనిని బట్టి ఈ చట్టం లక్ష్యం మహిళలకు హక్కుల్ని కల్పించడం కాదని, ముస్లిం లను లక్ష్యంగా పెట్టుకుని దాడి చేయడమేనని నిర్ధారణ అయింది. తన సైద్ధాంతిక వైఖరిలో గాని, ఆచరణలోగాని బిజెపి పితృస్వామ్యాన్ని బలపరుస్తుంది. ఆ విధంగా బిజెపి మహిళల హక్కులకు తాను వ్యతిరేకినని రుజువు చేసుకుంది.

## యువజనులు : నెరవేరని ఆశలు

2.53. దేశ భవిష్యత్తు దిశానిర్దేశం జనాభాలో 65 శాతంగా ఉన్న యువజనుల అవసరాలు, ఆకాంక్షలు ఏ విధంగా నెరవేరుతాయన్న దానిమీద ఆధారపడి వుంటుంది. మెరుగైన జీవితాన్ని గడపాలనుకునే వారి ఆకాంక్షలు నెరవేరాలంటే ఉపాధి అవకాశాలు, నాణ్యత కల ఉద్యోగాలు అవసరం. కాని అత్యధికులు యువజనులు అతి తక్కువ స్థాయి విద్యార్హతలతో ఉంటూ ఉపాధి అవకాశాలు లేక మసకబారిన భవిష్యత్తును ఎదుర్కొంటున్నారు. విద్యావంతులైన యువత ఇటీవల కాలంలో సివిల్ సర్వీసు పరీక్షల అవకతవక నిర్వహణకు, ప్రశ్నాపత్రాలు ముందుగానే బైటకు పొక్కినందుకు నిరసనగా పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. సైనిక దళాల్లో రెగ్యులర్ ఉద్యోగాలను నిరాకరించినందుకు అగ్నివీర్ పథకానికి చెందిన పదుల వేల మంది నిరసనలకు దిగారు. తక్కిన రంగాలలో ఉపాధి అవకాశాలు ఎక్కడా కనిపించక పోవడంతో తక్కువ స్థాయికి చెందిన ప్రభుత్వ ఉద్యోగాల కోసం, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల కోసం ఎక్కువమంది ప్రయత్నిస్తున్నారు. ఎటువంటి భద్రత గాని, ఆదాయ గ్యారంటీ గాని లేని ఉద్యోగాలు ఎక్కువగా అసంఘటిత రంగంలో ఉన్నాయి. యువజనులకు అందుతున్న విద్యలో ఎక్కువ భాగం నాసిరకమైనది. అందుచేత దాని ద్వారా చెప్పుకోదగ్గ ఉద్యోగాలు కాని, వ్యాపకాలు కాని లభించవు.

2.54. యువతరం సామాజిక, సాంస్కృతిక జీవితంలో ఒక శూన్యం నెలకొంది. ఆరోగ్యకరమైన, అభ్యుదయ స్వభావం కల సామాజిక, సాంస్కృతిక విలువలను స్వీకరించడం బదులు, వారికి మోటుగా ఉండే వ్యాపార-వినిమయ విలువలను, అహంభావపూరిత విలువలను అందిస్తున్నారు. అంటువ్యాధి మాదిరిగా వ్యాపించే మత తత్వాన్ని చీలికలు తెచ్చే ధోరణులను యువజనులకు నిరంతరాయంగా ఈ హిందూత్వ శక్తుల పాలనలో ఎక్కిస్తున్నారు. ఆరోగ్యప్రదమైన విద్యను, నాణ్యత కలిగిన ఉద్యోగాలను, సంతృప్తికరమైన సామాజిక, సాంస్కృతిక జీవితాన్ని అందించగల ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని యువజనుల ముందుంచడం అవసరం. అటువంటి ఒక రాజకీయ వేదికను వారి ముందు ఉంచుతూనే, సమాజాన్ని సమూలంగా మార్చగల సోషలిస్టు ఆదర్శాన్ని లక్ష్యంగా వామపక్షాలు యువత ముందుంచాలి.

## దళితులు : దిగజారుతున్న పరిస్థితులు

2.55. సనాతన ధర్మం ముసుగులో మనువాద భావజాలాన్ని ఆరెస్సెస్-బిజెపి-హిందూత్వ శక్తులు ఒక పథకం ప్రకారం ముందుకు తెస్తున్నాయి. ఒకపక్క కుల వ్యవస్థలో పుట్టుకతోటే సంక్రమించే అసమానతలను కొనసాగిస్తూనే, మరోపక్క కుల అస్తిత్వ భావాలను కుటిలనీతితో ఉపయోగించుకుంటూ దళితులను, తక్కిన అణచివేయబడిన కులాల ప్రజలను హిందూత్వ చట్రం లోకి లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారు. ఉప కులాల అస్తిత్వాలను నీచంగా వాడుకుంటూ అణగారిన కులాలలో చీలికలు రేపి తమ ప్రభావంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అణగారిన కులాలవారిని మైనారిటీలకు వ్యతిరేకంగా ఎగదోయడం ఈ కుట్రలో ఒక భాగమే. కుల వ్యవస్థకు, కుల అణచివేతకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయసాధన కోసం, సాంఘిక సంస్కరణలు తిరోగమన దిశగా మళ్ళకుండా నిలవరించడం కోసం పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించడం ద్వారానే ఈ ఎత్తుగడలను తిప్పికొట్టగలం.

2.56. మనువాద భావజాల వాతావరణాన్ని బిజెపి, హిందూత్వ శక్తులు పెంచి పోషించడంతో కుల విద్వేషపూరిత అత్యాచారాలు పెరుగుతున్నాయి. 2021, 2022 మధ్య కాలంలో షెడ్యూల్డ్ కులాలపై సాగించిన నేరాలు 13 శాతం పెరిగాయని జాతీయ నేరాల నమోదు బ్యూరో వెల్లడిస్తోంది. ఇందులో 26 శాతం కేసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనివే. ఆ తర్వాత 15 శాతం కేసులతో రాజస్తాన్, 14 శాతం కేసులతో మధ్య ప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి.

2.57. మోడీ ప్రభుత్వ హయాంలో వేగం పుంజుకున్న ప్రైవేటీకరణ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం, రెగ్యులర్ ఉద్యోగాలు అంటూ లేకపోవడం వలన రాజ్యాంగం ఆదేశించిన రిజర్వేషన్లు బలహీనపడ్డాయి. 2022 నాటికి ఎస్‌సి లలో నిరుద్యోగ రేటు 8.4 శాతం ఉంది. ఎస్‌సిలలో 84 శాతం రెగ్యులర్ కాలేని ఉద్యోగాలలో పని చేస్తున్నారు. సామాజిక గ్రూపులలో కెల్లా వీరిదే అధిక శాతం. స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌ను మోడీ ప్రభుత్వం పూర్తిగా వదిలేసింది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో కేవలం 10.6 శాతం మేరకు మాత్రమే కేంద్ర పథకాల నిధులను ఎస్ సి లకు కేటాయించింది. వాస్తవానికి 15 శాతం కనీసం కేటాయించాలి. వ్యక్తులకు నేరుగా లబ్ధి చేకూర్చే పథకాలకు ఇందులో కేవలం 3.3 శాతం మాత్రమే ఇచ్చారు. అందులో 80 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేశారు. ఈ కాలంలో మొత్తంగా చూస్తే, దళితుల సామాజిక–ఆర్థిక స్థితిగతులు మరింతగా దిగజారాయి.

## ఆదివాసులపై దాడులు

2.58. ఆదివాసీలకు చట్టాలు కల్పిస్తున్న రక్షణ అంతంత మాత్రమే. ఆ రక్షణను, ముఖ్యంగా స్వయంపాలనా హక్కును తీవ్రంగా దెబ్బ తీసేలా బిజెపి ప్రభుత్వం అనేక చట్టాలకు, నిబంధనలకు సవరణలు తెచ్చి తనకున్న మెజారిటీతో పార్లమెంటులో వాటిని ఆమోదింపజేసుకుంది. అటవీ సంరక్షణ చట్టానికి. దాని నిబంధనలకు తెచ్చిన సవరణలు 'గ్రామసభ' అన్న పదాన్నే తొలగించాయి. అటవీ హక్కుల చట్టానికి, గనుల, ఖనిజాల అభివృద్ధి చట్టాలకు తెచ్చిన సవరణలు ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో చేపట్టే ప్రాజెక్టులపై వారికి పూర్తి సమాచారాన్ని అందించి వారు ఇష్టపూర్వకంగా ఆ ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలిపినప్పుడే వాటికి అనుమతులివ్వాలన్న నిబంధనలను తొలగించాయి. గ్రామ సభ అనుమతులు లేకుండానే మైనింగ్ కంపెనీలకు ఖనిజ నిక్షేపాల అన్వేషణ పేరుతో అనుమతులు ఇచ్చేందుకు వీలు కల్పిస్తూ సవరణలు తెచ్చారు. ఆదివాసీల అనుభవంలో ఉన్న భూములను సేకరించే సందర్భాలలో భూమికి బదులు భూమిని ఇవ్వాలనే విధానాన్ని నీరుగార్చి ఉల్లంఘిస్తున్నారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అంతే కాకుండా ఉనికిలో ఉన్న చట్టాలను, రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్ళలో, పీసా చట్టంలో ఆదివాసీల భూములకు రక్షణగా ఉన్న నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘిస్తున్నారు. ఆ విధంగా ఆదివాసీలకు మౌలికంగా నీటిపై, అడవిపై. భూమిపై ఉన్న హక్కులు (జల్, జంగల్, జమీన్) తీవ్ర దాడికి గురౌతున్నాయి. ఈ విధానాల ఫలితంగా పెద్ద సంఖ్యలో ఆదివాసీలు నిర్వాసితులౌతున్నారు.

ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో దేశపు సహజ సంపద ఎక్కువగా ఉంది. అందుచేత ఆదివాసీలకు ఆ ప్రాంతాలపై హక్కులను కల్పించే చట్టాలన్నీ కార్పొరేట్ల ప్రయోజనాలకు ప్రతికూలంగానే ఉంటాయి. ఈ అర్థంలో చూసినప్పుడు కార్పొరేట్లకు, ఆదివాసీలకు నడుమ జరుగుతున్న సంఘర్షణలో ప్రభుత్వం స్పష్టంగా కార్పొరేట్ల కొమ్ము కాస్తున్నది.

2.59. రక్షణ రంగం, గనుల తవ్వకం, విద్యుత్తు, నీటిపారుదల తదితర కీలక, వ్యూహాత్మక రంగాలన్నీ ప్రైవేటీకరించబడడంతో శక్తివంతులుగా ఉన్న ప్రైవేటు కంపెనీలు విచక్షణారహితంగా, ఎటువంటి నియంత్రణా లేకుండా ఆదివాసీ ప్రాంతాల్లోకి వివిధ ప్రాజెక్టుల ద్వారా చొరబడుతున్నాయి. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రైవేటు ప్రమోటర్లు చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకున్న భూముల్లో ప్రభుత్వాలు పర్యాటక వసతిగృహ సముదాయాల నిర్మాణానికి అనుమతులిచ్చి వారిని ప్రోత్సహిస్తున్నారు. 'ప్రజా ప్రయోజనాల కోసం భూసేకరణ ' అన్న విధానం కాస్తా ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా 'కార్పొరేట్ ప్రయోజనాల కోసం భూసేకరణ' గా మారిపోయింది. ప్రైవేటీకరణ విధానంతో బాటు నియంత్రణలను తొలగించడం కూడా జరుగుతోంది. దీని ప్రభావం ప్రత్యక్షంగా ఉద్యోగాల మీద పడుతోంది. గతంలో ప్రాజెక్టు-ప్రభావిత కుటుంబాలకు ఆ ప్రాజెక్టులో ఉద్యోగాలు ఇచ్చే విధానం ఉండేది. ఇప్పుడు ప్రైవేటు కంపెనీలు అటువంటి ఉద్యోగాల కల్పనపై ఎటువంటి గ్యారంటీ ఇవ్వడం లేదు. కొత్తగా గనుల తవ్వకం, ఇతర ప్రాజెక్టులు చేపడుతున్న చోట్ల గిరిజనులు కోల్పోతున్న భూములకు, అడవికి నష్టపరిహారంగా అమలు చేసే ప్యాకేజీలుగా చెప్పబడుతున్నవన్నీ ఆ కంపెనీలే నిర్ణయించి అమలు చేస్తున్నాయి. 2019 నుంచి మార్చి 2024 మధ్య కాలంలో కేవలం గనుల తవ్వకం కోసమే 18,922 హెక్టార్ల (47,305 ఎకరాలు) అటవీ భూమి మళ్ళించబడింది.

2.60. ప్రైవేటీకరణ విధానాల కారణంగా విద్యలో, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ తీవ్రంగా దెబ్బ తింది. ఇప్పటికే పెరుగుతున్న బ్యాక్‌లాగ్ ఖాళీలకు ఇది అదనం. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎస్‌టి ఉద్యోగుల సంఖ్య పడిపోయిందని తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఎస్‌టిలకు రిజర్వు చేయబడిన 25,000 ఉద్యోగాలు రద్దయ్యాయి. పాఠశాల విద్యా రంగంలో 2018తో పోల్చితే ఎస్‌టి ఉపాధ్యాయులు 35000 మంది తగ్గిపోయారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు రిజర్వేషన్లను వర్తింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది.

## విభిన్న ప్రతిభావంతుల బాధలు కొనసాగుతూనే వున్నాయి

2.61. ఇప్పటికే దయనీయంగా ఉన్న విభిన్న ప్రతిభావంతుల స్థితిగతులు నయా ఉదారవాద విధానాల ఫలితంగా వినాశకర రీతిలో దెబ్బ తినిపోతున్నాయి. ఈ విభాగపు నోడల్ డిపార్టుమెంట్‌కు గాని, మానసిక ఆరోగ్య విభాగానికి గాని బడ్జెట్లలో కేటాయించేనిధులు గత అనేక సంవత్సరాలుగా పెరుగుదల లేకుండా నిలిచిపోయాయి. అంతే కాక, కేటాయించిన నిధులు సైతం పూర్తిగా వినియోగం కావడం లేదు. విభిన్న ప్రతిభావంతుల కోసం హక్కుల ప్రాతిపదికన రూపొందించిన చట్టాలు, విధానాలు ఈ కారణంగా తీవ్రంగా దెబ్బ తిన్నాయి.

## పర్యావరణ వినాశనం దిశగా :

2.62. గతంలో ఎన్నడూ లేని విధంగా బిజెపి ప్రభుత్వాల హయాంలో భారతదేశ పర్యావరణం, దానితో ముడిపడిన ప్రజల హక్కులు, వారి బాగోగులు దాడులకు గురౌతున్నాయి. ఆశ్రిత పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలతో సహా పెద్ద పెద్ద కార్పొరేషన్లు గనుల తవ్వకం, ఖనిజాల అన్వేషణ, వెలికి తీయడం వంటి కార్యకలాపాలను చేపట్టే పరిశ్రమలను, నిర్మాణాలను, వాణిజ్యపరమైన కార్యకలాపాలను జీవ వైవిధ్య పరంగా సున్నితమైన ప్రాంతాల్లోకి విస్తరిస్తున్నారు. అడవుల లోపలికి, అభయారణ్యాలలోకి సైతం చొరబడుతూ అక్కడి జీవ వైవిధ్యానికి హాని కలిగిస్తున్నారు. అడవులలోని సహజ వనరులపై ఆధారపడి జీవించే గిరిజనుల, ఇతర అటవీ వాసుల, ఇతర ప్రజల జీవితాలను, ఆవాసాలను, వారి జీవనోపాధిని దెబ్బ తీస్తున్నారు. వన్యమృగాలు సంచరించే ప్రాంతాల విస్తీర్ణం తగ్గిపోవడంతో మానవులకు. వన్యమృగాలకు నడుమ సంఘర్షణలు పెరుగుతున్నాయి. ఇట్టి సంఘర్షణలను నివారించడానికి సమగ్ర దృష్టితో, ప్రణాళికాబద్ధ కృషి చేపట్టాలి. కాని అటువంటివేమీ జరగడం లేదు. పర్యావరణ నిబంధనలను తొలగించడం, ఇంతవరకూ రక్షిత ప్రాంతాలుగా ఉన్న భూభాగాల్లో ప్రాజెక్టులకు అనుమతులివ్వడం, నియంత్రించే సంస్థలను, యంత్రాంగాన్ని బలహీనపరచడం జరుగుతోంది. బిజెపి అమలు చేస్తున్న 'వ్యాపారాన్ని సరళతరం చేయడం' అంటే ఇదే. (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నాణ్యమైన అడవులను చాలా పెద్ద ఎత్తున కోల్పోతున్నాం. కాని ఈ విషయాన్ని ప్రభుత్వం అబద్ధాలతో, తప్పుడు అభిప్రాయం కల్పించే సమాచారంతో దాచిపెడుతోంది. చాలా సున్నితమైన పర్యావరణం ఉన్న పశ్చిమ, తూర్పు హిమాలయ ప్రాంతాల్లో

అభివృద్ధి పేరుతో, పర్యాటకం పేరుతో చేపడుతున్న భారీ నిర్మాణాలు, జల విద్యుత్ ప్రాజెక్టులు, రోడ్ల ప్రాజెక్టులు అక్కడ వాతావరణం మీద కలిగిస్తున్న ప్రభావాలు తీవ్రతరమౌతున్నాయి. అతిగా కురుస్తున్న వర్షాల వలన కొండచరియలు విరిగిపడడం, పట్టణాల భూములు కృంగిపోవడం, తరచూ వరదలు సంభవించడం వంటి విపరీతాలు పెరుగుతున్నాయి. వాటి ఫలితంగా ప్రతీ ఏడూ ప్రాణనష్టం, జీవనోపాధిని పోగొట్టుకోవడం పెరుగుతున్నాయి. ఎటువంటి ప్రణాళికా లేకుండా సాగుతున్న పట్టణీకరణ ఈ పర్యావరణ సమస్యలను మరింత పెంచుతోంది.

2.63. వాతావరణ మార్పులు కలిగించే ప్రభావాలు దేశవ్యాప్తంగా ప్రజలకు, మౌలిక నిర్మాణాలకు తీవ్ర హాని చేస్తున్నాయి. దాని ఫలితంగా ఆరోగ్య పరిస్థితి దెబ్బ తినడమే గాక, తరచూ ఆర్థిక నష్టాలు వాటిల్లుతున్నాయి. అంతకంతకూ తీవ్రమౌతూ, మరింత దీర్ఘకాలం పాటు కొనసాగుతున్న వడగాడ్పులను భారతదేశం చవిచూస్తున్నది. నిర్మాణ రంగంలో, బాహ్య ప్రదేశాల్లో పని చేసే కార్మికులు, వీధివ్యాపారులు, వ్యవసాయ కూలీలు, ఇంటిపనివారు, గిగ్ వర్కర్లు, ఎటువంటి వసతులూ లేని మురికివాడల్లో జీవించే వారు ఈ వడగాడ్పుల వలన అతి దారుణంగా బాధలు పడుతున్నారు. ఇట్టి ప్రజానీకానికి అవసరమైన సహాయాన్ని అందించే విధంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలు దేశంలో అత్యధిక ప్రాంతాల్లో సిద్ధంగా లేవు. దీర్ఘకాల చర్యల గురించిన ఆలోచనే లేదు. కాంక్రీటు భవన సముదాయాల కారణంగా పెరిగిన ఉష్ణోగ్రతలు తగ్గకుండా ఉండిపోయే ప్రాంతాలు పెరిగి పట్టణ ప్రాంతాలు ఎక్కువగా అవస్థల పాలౌతున్నాయి. అతిగా కురుస్తున్న వర్షాలతో, పొంతన లేని డ్రెయినేజి వ్యవస్థలతో, అడ్డదిడ్డంగా సాగుతున్న పట్టణీకరణతో పట్టణాలు దాదాపు ప్రతీ ఏడూ మునిగిపోతున్నాయి. ప్రధాన మెట్రో నగరాలు సైతం ఇందుకు మినహాయింపు కాదు. ఈ ముంపుల వలన పదుల వేల కోట్ల రూపాయల నష్టాలు భారీగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ద్రవ్య విధానపు అతి కేంద్రీకరణ ఫలితంగా ఇటువంటి సమస్యలను తట్టుకోడానికి కావలసిన నిధులు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద కాని, పట్టణ స్థానిక సంస్థల వద్ద కాని లేకుండా పోయాయి.

## పోరాటాలు, ప్రతిఘటన

2.64. కన్నూర్ మహాసభ అనంతర కాలంలో డిల్లీలో 2023 ఆగస్టు 24న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడిగా నిర్వహించిన జాతీయస్థాయి కార్మిక-కర్షక సదస్సు ఒక ముఖ్యమైన ముందడుగు. కార్మికులకు,

రైతాంగానికి సంబంధించిన ఉమ్మడి కోర్కెల పత్రాన్ని అక్కడ ఆమోదించారు. ఆ తర్వాత 2023 నవంబరు 26 నుండి 28 మధ్య దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ మహాపడావ్‌ల పేరుతో ఉద్యమాన్ని నిర్వహించాలన్న పిలుపుకు స్పందించి లక్షలాదిగా కార్మికులు, రైతులు కదిలి పాల్గొన్నారు. 2024 ఫిబ్రవరి 16న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె జరపాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును బలపరుస్తూ సంఘీభావంగా సంయుక్త కిసాన్ మోర్చా గ్రామీణ హర్తాళ్‌కు పిలుపునిచ్చింది. 2024 మార్చి 14న ఢిల్లీలో జాతీయ స్థాయి రైతుల ర్యాలీని సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహించింది. మళ్ళీ 2024 నవంబర్ 26న జిల్లాల స్థాయిలో సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు దేశమంతటా ఉమ్మడిగా కార్యక్రమాలు నిర్వహించాయి.

2.65. ఈ విశాలమైన, కార్మిక–కర్షక ఉమ్మడి చొరవతో బాటు, కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, అనేక ఉమ్మడి కార్యాచరణలను సమన్వయంతో నిర్వహిస్తున్నాయి. 2022 లోను, ఆ తర్వాత ఈ సంఘాలు వేలాది మందిని దేశవ్యాప్తంగా కదిలించే ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టాయి. 2022 సెప్టెంబర్ 5న డిల్లీలో ఉమ్మడిగా జాతీయ సదస్సును నిర్వహించాయి. 2023 ఏప్రిల్ 5న ఢిల్లీలో ర్యాలీ జరిగింది. 2023 ఆగస్టు 9 నుండి 14 మధ్య రాష్ట్ర స్థాయిలలో మహా పడావ్‌లు, తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ అన్ని ఉమ్మడి కార్యక్రమాలూ కార్మిక–కర్షక ఐక్యతను పెంపొందించాలన్న లక్ష్యానికి తోడ్పడ్డాయి.

2.66. ఈ కాలంలో కార్మికసంఘ పోరాటాలు అనేకం జరిగాయి. శామ్‌సంగ్ కార్మికులు తమిళనాడులో కార్మికసంఘం పెట్టుకునే హక్కు కోసం, ఆ సంఘానికి గుర్తింపు పొందే హక్కు కోసం 37 రోజులపాటు చేసిన సమ్మె విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, జమ్ము కాశ్మీర్, చండీఘర్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో విద్యుత్‌రంగ కార్మికులు, ఉద్యోగులు విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమ్మెలు నిర్వహించారు. ఈ సమ్మెలు పాక్షికంగా విజయవంతం అయాయి. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీముల్లో పని చేసే కార్మికులు అనేక రాష్ట్రాల్లో దీర్ఘకాలం కొనసాగిన సమ్మెలను, పెద్ద ఎత్తున సమీకరణలను నిర్వహించారు. ఆ పోరాటాల్లో చాలా మేరకు పాక్షిక విజయాలు సాధించాయి. బ్యాంకులలో, ఇన్సూరెన్స్‌లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో, పోస్టల్ టెలికాం రంగాల్లో, బొగ్గు రంగంలో

ఉద్యోగులు, కార్మికులు, మెడికల్ రిప్రెజెంటేటివ్ లు సమ్మెలను, పోరాటాలను చేశారు.

2.67. పంటలవారీగా సమస్యలపైన, పంటల కొనుగోలు కేంద్రాల కోసం, పంటల బీమా కోసం, భూమి హక్కుల కోసం, అటవీ హక్కుల కోసం, వన్య మృగాల బెడద నివారణ కోసం రైతు సంఘం పోరాటాలను చేపట్టింది. టైర్ల ఉత్పత్తిదారుల కూటమికి వ్యతిరేకంగా, రబ్బరు సాగుదారులకు మద్దతుగా రాజకీయంగాను, న్యాయపరంగాను పోరాటాన్ని నడిపింది. వ్యవసాయ కార్మిక రంగం ఉపాధిహామీ పథకం సమస్యలపైన, వేతనాల పైన, భూమి కోసం, ఇళ్ళ స్థలాల కోసం, ఇళ్ళ కోసం, కుల వివక్షతకు వ్యతిరేకంగా పలు పోరాటాలను చేపట్టింది. బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి వ్యతిరేకంగా విధానపరంగా సాగిస్తున్న దాడులకు నిరసనగా 2023 అక్టోబర్ 11న లక్షలాది మంది వ్యవసాయ కార్మికులు అఖిల భారత నిరసన దినాన్ని పాటించారు. ధరల పెరుగుదలను అరికట్టడం, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, మహిళలపై పెరుగుతున్న నేరాలను హింసను అరికట్టడం వంటి అంశాలమీద అనేక పోరాటాలను మహిళారంగం నడిపింది. 2023 అక్టోబర్ 5న వేలాది మంది మహిళలతో డిల్లీలో జాతీయ స్థాయి ర్యాలీ జరిపింది. జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా, విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకంగా, ఫీజుల పెంపుకు, పాఠశాలల మూసివేతలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో విద్యార్థిరంగం ముందుంది. భారతీయ ఐక్య విద్యార్థుల వేదిక పేరుతో ఒక ఉమ్మడి వేదిక ఏర్పడింది. డిల్లీ, చెన్నై, కొల్‌కతా నగరాల్లో భారీ ర్యాలీలను నిర్వహించింది. నిరుద్యోగం, అగ్నివీర్ పథకం తదితర సమస్యలపై యువజన రంగం చురుకుగా కదిలింది.

2.68. ఈ కాలంలో నికరంగా కొనసాగించిన పోరాటాల్లో వేలాదిమందిని కదిలించగలిగిన ప్రధానమైనవి ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఆర్.జి. కార్ ఆస్పత్రిలో ఒక వైద్యురాలిని మానభంగం చేసి హత్య గావించిన కేసుమీద జరిగిన పోరాటం వాటిలో ఒకటి. తెలంగాణాలో ఇళ్ళ స్థలాలకోసం స్థానికంగా జరిగిన పోరాటాలు, బీహార్‌లో జరిగిన భూ పోరాటం, విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే నిర్ణయానికి వ్యతిరేకంగా, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం కోసం ఆంధ్రప్రదేశ్‌లో, పంటల బీమా కోసం రాజస్తాన్‌లో, నిర్వాసితులుగా చేయడానికి వ్యతిరేకంగా జార్ఖండ్‌లో, అటవీ భూములపై హక్కులకోసం మహారాష్ట్రలో, ఇళ్ళ పట్టాలకోసం తమిళనాడులో ఇటువంటి రీతిలో పోరాటాలు జరిగాయి.

## రాజకీయ పార్టీల పరిస్థితి

2.69. **బిజెపి :** ఫాసిస్టు స్వభావం కల ఆరెస్సెస్‌కు రాజకీయ వేదికగా ఉన్న బిజెపి గత దశాబ్ద కాలంలో రాజకీయ పార్టీగా ఆధిపత్యం సాధించింది. బడా బూర్జువా–భూస్వామ్య వర్గాల ప్రధాన ప్రతినిధిగా అది ఇప్పుడు ఉంది. ఆ వర్గాల మద్దతును, ప్రధానంగా బడా కార్పొరేట్ల మద్దత్తును తన వెనుక బలంగా సమీకరించుకుంది. హిందూత్వ సిద్ధాంత ప్రభావాన్ని విస్తరించి , బడా పెట్టుబడిదారులతో కూటమి గట్టి, ముందెన్నడూ లేనంతగా ధన బలాన్ని, మీడియా బలాన్ని ఉపయోగించి మితవాద శక్తులు బలపడేలా చేయగలిగింది.

2.70. మొత్తంగా చూసినప్పుడు, ఎన్నికల్లో పోరాడడానికి బిజెపి ముక్కోణపు వ్యూహాన్ని చేపట్టింది. (అ) హిందూత్వ అంశాలను దూకుడుగా ముందుకు తెచ్చి దాని చుట్టూ రాజకీయాలు తిరిగేలా చేసి, దేశవ్యాప్త హిందూ అస్తిత్వాన్ని బలపరుచు కోవడం, (ఆ) కులాల, ఉపకులాల నడుమ వ్యూహాత్మకంగా ఎత్తుగడలు పన్ని రాజకీయ కూటములు కట్టి ఎన్నికలలో లబ్ధి పొందడం, (ఇ) ప్రభుత్వ నిధులనుండి ఇచ్చే నగదు బదిలీ పథకాల ద్వారా లబ్ధిదారులను తనకు అనుకూలంగా మార్చుకోవడం. గత మూడేళ్ళలో రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో రాజస్థాన్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాల లోని కాంగ్రెస్ ప్రభుత్వాలను ఓడించి వాటిని బిజెపి తిరిగి కైవసం చేసుకుంది. మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో నిర్ణయాత్మకంగా విజయం సాధించి ఆ రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టుకుంది. తన ప్రభుత్వాలు ఉండిన కర్నాటక, హిమాచల్ రాష్ట్రాలలో బిజెపి ఓడిపోయింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం జమ్ము కాశ్మీర్ , జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలైంది.

2.71. లోక్ సభ ఎన్నికల్లో 240 సీట్లు మాత్రమే సాధించి బిజెపి ఎదురుదెబ్బ తింది. ఐతే ఈ ఓటమిని దూరానుగత దృష్టితో చూడాలి. 2019 ఎన్నికలలో కన్నా కేవలం 1.1 శాతం ఓట్లు మాత్రమే ఈ సారి ఎన్నికల్లో బిజెపికి తగ్గాయి. ఒడిశా వంటి రాష్ట్రాల్లో బిజెపి కొత్తగా విజయాలను సాధించింది. అక్కడ 21 సీట్లకు గాను 20 సీట్లలో గెలిచి తక్కిన పార్టీలను తుడిచిపెట్టింది. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి గెలిచి అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో తన ఓటింగ్ శాతాన్ని పెంచుకోవడం ద్వారా ప్రధానంగా పురోగమించింది. లోక్‌సభ ఎన్నికల

అనంతరం హర్యానాలో బిజెపి, మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని కూటమి గెలవడం బట్టి బిజెపి ఆ రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికల్లో పొందిన నష్టాన్ని పూడ్చుకుని కూటమిని తిరిగి కూడగట్టి పుంజుకోగలిగిందని స్పష్టమౌతోంది.

2.72. బిజెపి ఒక రాజకీయపార్టీగా నిలదొక్కుకోడానికి కావలసిన బలమైన పునాదిని ఆరెస్సెస్ అందిస్తుంది. మాతృసంస్థగా ఆరెస్సెస్, దాని రాజకీయ వేదికగా బిజెపి రెండింటికీ మధ్య సమన్వయం, ఉమ్మడి పని ఈ కాలంలో బలపడ్డాయి. పార్టీ సంస్థ బలం యావత్తూ తమ చేతుల్లో కేంద్రీకరించుకున్న మోడీ–షా ద్వయం ఆధిపత్యం కొనసాగుతోంది.

2.73. **కాంగ్రెస్ :** ఇండియా బ్లాక్‌గా మిత్రులు సమకూరినందువలన లాభం పొంది కాంగ్రెస్ తన బలాన్ని లోక్‌సభలో 44 నుండి 100 కి పెంచుకోగలిగింది. దేశవ్యాప్తంగా ముస్లిం మైనారిటీల మద్దతును చెప్పుకోదగ్గ స్థాయిలో పొందగలిగింది. కాంగ్రెస్ పునాది అంతగా పెరగలేదు. ఉత్తరాన రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయింది. పంజాబ్, ఒడిశా, అస్సాం వంటి రాష్ట్రాలలో గణనీయంగా బలహీనపడింది. కర్నాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో విజయాలు సాధించి ప్రభుత్వాలను ఏర్పరచి కాంగ్రెస్ దక్షిణాదిన బలాన్ని పెంచుకుంది.

2.74. తన ఆర్థిక విధాన దిశను కాంగ్రెస్ మార్చుకోలేదు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శిస్తున్నా, అటువంటి పెట్టుబడిదారీ మిత్రులు ఉత్పన్నం అవడానికి కారణభూతమైన నయా ఉదారవాద విధానాలకే ఆ పార్టీ కట్టుబడివుంది. హిందూత్వ ఎజండాకు వ్యతిరేకంగా ఆ పార్టీ జాతీయ నాయకత్వం సూటిగా వైఖరిని అవలంబిస్తున్నా, బిజెపి, దాని హిందూత్వ మిత్రుల నుండి తీవ్రమైన దాడిని ఎదుర్కోవలసి వచ్చిన సందర్భాల్లో ఊగిసలాడడం, రాజీపడడం వంటి ధోరణులు ఇంకా ఉన్నాయి. బిజెపి ఏ వర్గ ప్రయోజనాలకు ప్రతినిధిగా ఉందో, అవే వర్గాల ప్రయోజనాలకు కాంగ్రెస్ కూడా ప్రతినిధి. అయినప్పటికీ, బిజెపికి వ్యతిరేకంగా పోరాటంలో ఒక లౌకిక పార్టీగా లౌకిక శక్తుల విశాల ఐక్యతను కూడగట్టడంలో అది తన పాత్రను పోషించాల్సి వుంది. లౌకిక శక్తుల విశాల ఐక్యత అవసరం బట్టి కాంగ్రెస్ పట్ల సిపిఐ(ఎం) వైఖరి నిర్ణయించబడుతుంది. ఐతే, పార్టీకి కాంగ్రెస్‌తో ఎటువంటి రాజకీయ పొత్తూ ఉండదు.

2.75. **ప్రాంతీయ పార్టీలు :** ప్రాంతీయ పార్టీలను స్థూలంగా మూడు తరహాలుగా విభజించవచ్చు. బిజెపిని నిలకడగా వ్యతిరేకించే పార్టీలు మొదటి కోవలోకి వస్తాయి. డిఎంకె, ఎస్‌పి, ఆర్‌జెడి, ఎన్‌సిపి, ఆప్, జెఎంఎం అటువంటి పార్టీలు. బిజెపికి మిత్రులుగా ఉంటూ ఎన్‌డిఎ కూటమిలో భాగస్వాములైన పార్టీలు రెండో కోవకు చెందుతాయి. జెడి(యు), టిడిపి, జెడి(ఎస్), ఎజిపి, జనసేన, ఇతర చిన్న చిన్న పార్టీలు అటువంటివి. తాము రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాలంలో బిజెపిని, కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించని పార్టీలు మూడో కోవలోకి వస్తాయి. బిజెడి, అన్నా డిఎంకె, వైఎస్సార్‌సిపి అటువంటి పార్టీలు. బిఆర్‌ఎస్ మొదట కేంద్రానికి మద్దతునందించినా, తనకు తెలంగాణాలో బిజెపి నుంచి ప్రమాదం ఉందని గ్రహించాక తన వైఖరిని మార్చుకుంది. ఐతే ఈ మూడో కోవకు చెందిన పార్టీలన్నీ ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో అధికారాన్ని కోల్పోయాయన్నది గమనార్హం.

2.76. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ఒక నేరస్థ–అవినీతి–రాజకీయ కూటమి మీద ఆధారపడిన ఒక నిరంకుశ పార్టీ. అది కమ్యూనిస్టు వ్యతిరేకత అనే విషంతో నిండిన పార్టీ. ఎన్నికలలో అది బిజెపిని వ్యతిరేకిస్తుంది. రాష్ట్రంలో ఇటు టిఎంసి, అటు బిజెపిల చుట్టూనే రాజకీయాలన్నీ నడిచే దిశగా వ్యవహరిస్తూ సిపిఐ(ఎం), వామ పక్షాలను ఒక మూలకు నెట్టివేయడానికి ప్రయత్నిస్తోంది.

2.77. ప్రతిపక్షాల విశాల ఐక్య వేదిక ఏర్పాటులో బిజెపిని వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలపాత్ర ముఖ్యమైనది. రానున్న కాలంలో కూడా ఆ పార్టీలు అదే పాత్రను పోషించాలి.

2.78. జమాత్–ఎ–ఇస్లామీ, ఎస్‌డిపిఐ (పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా యొక్క రాజకీయ వేదిక) వంటి ముస్లిం మత ఛాందసవాద పార్టీలు, ఉగ్రవాద సంస్థలు ముస్లింలలో తమ ప్రభావాన్ని విస్తరించుకోవడానికి పని చేస్తున్నారు. హిందూత్వ శక్తుల నిరంతర దాడులకు గురౌతున్న ముస్లిం ప్రజానీకంలోని పరాయాకరణను, భయాన్ని వారు ఉపయోగించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. కేరళలో మైనారిటీలలో సిపిఐ(ఎం) పలుకుబడిని అరికట్టడం లక్ష్యంగా చేసుకున్నారు. అధికారంలో ఉన్న హిందూత్వ మతోన్మాదంతో మైనారిటీ మతతత్వాన్ని సమానంగా పరిగణించలేం. కాని మైనారిటీ ఉగ్రవాద చర్యలే మెజారిటీ మతోన్మాదానికి బలం చేకూర్చుతాయని

గ్రహించాలి. మతోన్మాద శక్తులను ఎదుర్కొంటూనే, మైనారిటీల హక్కులను బలంగా రక్షించే కృషిని వామపక్ష ప్రజాతంత్ర శక్తులు చేపట్టాలి.

## హిందూత్వను ఎదుర్కోవాలి

2.79. హిందూత్వ, ఆరెస్సెస్‌కు చెందిన వివిధ అంగాల కార్యకలాపాలను, వాటి ప్రభావాన్ని ఎదుర్కోడానికి రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక రంగాలలో నిరంతరం కొనసాగే కార్యక్రమాలను చేపట్టేలా పార్టీ సన్నద్ధం కావాలి. కేవలం ఎన్నికల పోరాటాలద్వారా మాత్రమే బిజెపి–ఆరెస్సెస్‌ను ఒంటరిపాటు చేసి ఓడించడం సాధ్యం కాదని ఇక్కడ నొక్కి చెప్పాలి. తమ సైద్ధాంతిక ప్రభావంలో ఉండే గణనీయమైన ప్రజా మద్దత్తును హిందూత్వ శక్తులు గత దశాబ్ద కాలంలో సృష్టించుకోగలిగారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని హిందూత్వను తిప్పికొట్టడానికి ఒక సమగ్రమైన కార్యక్రమాన్ని రూపొందించాలి.

### 2.80. ఇందుకోసం పార్టీ, ప్రజా సంఘాలు

(అ) హిందూత్వ శక్తులు సాగిస్తున్న హానికరమైన ప్రచారాన్ని, కార్యకలాపాలను అన్ని రూపాల మీడియా ద్వారా (మల్టీ మీడియా ద్వారా) ఎండగట్టడానికి ఉపయోగపడే విధంగా సామగ్రిని తయారు చేయడానికి అన్ని మేథోపరమైన వనరులనూ సమీకరించాలి.

(ఆ) ఆర్థిక విధానాలపై, ప్రజా సమస్యలపై సాగుతున్న ప్రచారాలతో, పోరాటాలతో హిందూత్వ–వ్యతిరేక ప్రచారాన్ని, పోరాటాన్ని సమ్మిళితం చేయాలి.

(ఇ) కార్మిక వర్గంలోను, కార్మికవర్గం నివసించే ప్రాంతాలలోను పార్టీ, కార్మిక సంఘాలు సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలను ప్రత్యేక శ్రద్ధ పెట్టి చేపట్టాలి.

(ఈ) చరిత్రను తిరగరాయడానికి, విద్యా వ్యవస్థలో మతోన్మాద సారాంశాన్ని ప్రవేశపెట్టడానికి జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలి.

(ఉ) మత విశ్వాసానికి, రాజకీయ లక్ష్యాలకోసం మతాన్ని దుర్వినియోగ పరచడానికి ఉన్న తేడాను మత విశ్వాసులకు వివరించేలా వారి మధ్య పని చేయాలి. పండుగలలో, సామూహిక సామాజిక కార్యక్రమాలలో జోక్యం కల్పించుకుని ఆ సందర్భాలను మతవిద్వేష రాజకీయాల కోసం ఉపయోగించు కోనివ్వకుండా అడ్డుకోవాలి.

(ఊ) సామాజిక సేవా కార్యక్రమాలలో, ప్రాచుర్యం పొందే సైన్స్ ఉద్యమాలలో భాగస్వాములు కావాలి. మనువాద విలువలను, అంధ విశ్వాసాలను తిప్పికొట్టడానికి విశాల ప్రాతిపదికన సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టి లౌకిక, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించాలి.

## సిపిఐ(ఎం) బలాన్ని పెంచాలి

2,81. 18వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల ఫలితాలు చూస్తే పార్టీ ప్రజా పునాది, ప్రభావం పెరగలేదని తెలుస్తోంది. మన పార్టీ స్వతంత్ర బలాన్ని వెంటనే విస్తరించుకోవలసిన ఆవశ్యకతను ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. దీనిని సాధించడానికి దిగువ పేర్కొన్న చర్యలు చేపట్టాలి:

1. పునాదివర్గాల మధ్య మన పార్టీ కృషికి ప్రాధాన్యతనివ్వాలి. గ్రామీణ సంపన్నవర్గాల కూటమి సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా గ్రామీణ పేదలు జరిపే పోరాటాలలోని బలహీనతను అధిగమించాలి. ఏ యే సమస్యలపై ఆ పోరాటాలు జరపాలో వాటిని నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. సంఘటిత రంగానికి చెందిన సరుకుల ఉత్పత్తి రంగంలో, కీలక రంగాల్లో పనిచేసే కార్మికులలో పార్టీ ప్రభావాన్ని పెంచుకోవాలి. సంఘటిత రంగంలోని కాంట్రాక్టు కార్మికులను సంఘటితం చేయడానికి ప్రాముఖ్యతనివ్వాలి. కార్మిక-కర్షక ఐక్యతను, ఐక్య కార్యాచరణను పెంపొందించడానికి పార్టీ ప్రాధాన్యతనివ్వాలి. పునాదివర్గాలలో హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం పైన, పోరాటాలలో కదులుతున్నవారిని రాజకీయంగా చైతన్యవంతుల్ని చేయడం పైన కేంద్రీకరించాలి.

2. పార్టీ తన రాజకీయ వేదికపైనుండి స్వతంత్ర రాజకీయ ప్రచారాన్ని చేపట్టడం పైన, ప్రజాబాహుళ్యాన్ని సమీకరించడం పైన ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఎన్నికల అవగాహనల, పొత్తుల పేరుతో మన స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని మసకబరచడం కాని స్వతంత్ర కార్యకలాపాలను తగ్గించడం కాని చేయరాదు. ఆరెస్సెస్-హిందూత్వ శక్తుల సిద్ధాంతాన్ని, కార్యకలాపాలను ఎదుర్కొనే విధంగా సైద్ధాంతిక కృషిని ప్రత్యేక శ్రద్ధతో చేపట్టాలి.

3. ప్రజానీకపు సమస్యలపై, వర్గ సమస్యలపై నిలకడగా కొనసాగించే విధంగా స్థానిక పోరాటాలను చేపట్టడానికి గల ప్రాధాన్యతను గుర్తించాలి. ఈ విషయంలో

ఉన్న వెనుకబాటుతనాన్ని అధిగమించాలి. స్థానిక కమిటీలు, శాఖలు ఈ విషయంలో సరైన ఒరవడితో పని చేసేలా పై కమిటీలు చూడాలి. మూసలో పోసినట్టు ఉండే నిరసన కార్యకలాపాలకు బదులుగా కొత్త దనంతో, సృజనాత్మకంగా ఉండే పోరాటరూపాలను, ఉద్యమ రూపాలను రూపొందించాలి.

4. సామాజిక, కుల అణచివేతకు, లైంగిక వివక్షతకు వ్యతిరేకంగా సంబంధిత సమస్యలపై పార్టీ నేరుగా ప్రచారోద్యమాన్ని, పోరాటాలను చేపట్టాలి. సామాజిక అణచివేత సమస్యలను వర్గదోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో అనుసంధానం చేయాలి.

5. యువతకు వర్తించే సమస్యలను, వారి కోర్కెలను పార్టీ రాజకీయ వేదిక చేపట్టాలి. 'సోషలిజమే ప్రత్యామ్నాయం' అన్న ప్రచారాన్ని ప్రత్యేకించి యువతను లక్ష్యంగా పెట్టుకుని చేపట్టాలి.

6. పార్టీ బలం గణనీయంగా పెరగడానికి పశ్చిమ బెంగాల్‌లో, త్రిపురలో పార్టీని, వామపక్షాన్ని పునర్నిర్మించి విస్తరించడం అవసరం. ఇందుకోసం గ్రామీణ పేదలను సంఘటితం చేసేవిధంగా కృషి చేయడంపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. టిఎంసి, బిజెపి రెంటినీ వ్యతిరేకిస్తూనే బిజెపికి వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక పోరాటం చేయడంపైన పార్టీ ఎక్కువ కేంద్రీకరించాలి. త్రిపురలో శ్రామిక ప్రజానీకాన్ని ఐక్యపరిచేలా పార్టీ పునాదిస్థాయి నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలి. అదే సమయంలో గిరిజన ప్రజల ప్రత్యేక సమస్యలను వారి అవసరాలను నెరవేర్చేందుకు కృషి చేయాలి.

7. **కేరళ :** బలమైన ప్రజాపునాది కలిగిన అతి పెద్ద పార్టీ విభాగం కేరళలో ఉంది. కేంద్రం అనుసరిస్తున్న శత్రుపూరిత వైఖరి, కమ్యూనిస్టు–వ్యతిరేక శక్తులు పట్టుబట్టి సాగిస్తున్న ప్రచారం కారణంగా ఎదురౌతున్న తీవ్ర ప్రతికూలతలను తట్టుకుంటూ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వరుసగా రెండవసారి ప్రభుత్వాన్ని నడుపుతోంది. బిజెపిని ఎదుర్కొనేందుకు కావలసిన రాజకీయ, సైద్ధాంతిక కృషిలో బలహీనతలు పొడచూపినట్టు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చూపుతున్నాయి. వీటిని అధిగమించాలి. నిష్టదరిద్రాన్ని నిర్మూలించడానికి, అందరికీ గృహవసతి కల్పించడానికి ఈ ప్రభుత్వం కట్టుబడివుంది. కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత వైఖరి కారణంగా రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని చవిచూస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం చేసే వ్యయంలో పేదలకు, శ్రామిక ప్రజానీకానికి వర్తించే సంక్షేమ పథకాల అమలును ప్రాధాన్యతనిస్తోంది.

## వామపక్ష ఐక్యత

2.82. లోక్‌సభ ఎన్నికలలో విశాల ఐక్యతను పెంపొందించే పనిలో నిమగ్నమైనందున ఈ కాలంలో వామపక్షాల ఐక్య కార్యాచరణ కొంత చల్లబడింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని నిరసిస్తూ ఐక్య కార్యక్రమాలు చేపట్టాలని ఈ కాలంలో వామపక్షాలు రెండుసార్లు పిలుపులనిచ్చాయి. వామపక్ష ప్రత్యామ్నాయ విధానాలను వెలుగులోకి తెచ్చేలా వామపక్ష ఐక్యత కోసం, ఐక్య కార్యాచరణల కోసం బలమైన ప్రయత్నాలను మళ్ళీ చేపట్టాలి. జాతీయ రాజకీయాలలో వామపక్షాల రాజకీయ జోక్యం పెరిగితే మోడీ ప్రభుత్వపు విచ్ఛిన్నకర, హానికర ధోరణులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను బలోపేతం చేయడానికి అది దోహదం చేస్తుంది.

## వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం

2.83. గత మూడు దశాబ్దాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు బడా బూర్జువా–భూస్వామ్యవర్గాలకు అనుకూలంగా అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలు, కార్పొరేట్–మతోన్మాద–నిరంకుశ స్వభావం కల మితవాద శక్తులవైపు గత దశాబ్దకాలంగా ప్రమాదకరంగా సాగుతున్న మొగ్గు అనంతరం, ప్రస్తుత బూర్జువా–భూస్వామ్యవర్గ పాలనకు నిజమైన ప్రత్యామ్నాయం కేవలం వామపక్ష–ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం మాత్రమేనని స్పష్టం చేస్తున్నాయి. కార్మికవర్గం, రైతాంగం, వృత్తిదారులు, చిన్న దుకాణదారులు, మధ్య తరగతి, మేధావివర్గం – ఈ తరగతుల ప్రజల ప్రయోజనాలను కాపాడేలా, వారి ఆకాంక్షలను నెరవేర్చేలా వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను నిర్మించడానికి సిపిఐ(ఎం) కృషి చేస్తుంది. ప్రత్యామ్నాయ విధానాల కోసం నికరంగా కొనసాగే ప్రజా, వర్గ పోరాటాలద్వారా బలమైన వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను ఏర్పరచేందుకు ప్రాధాన్యతనివ్వాలి.

2.84. వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమంలో దిగువ పేర్కొన్న అంశాలు ఉండాలి:

**1. ప్రస్తుత రాజ్యాంగ పరిధిలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సమాఖ్యతత్వాన్ని బలపరిచే చర్యలు ఉండాలి.** ఇందుకోసం

– రాజ్యాన్ని, మతాన్ని వేరు చేసే విధంగా రాజ్యాంగంలో ఇమడ్చాలి.

– ప్రజాస్వామ్యహక్కులను, పౌర హక్కులను నిరోధించే అన్ని చట్టాలను, అంశాలను తొలగించాలి.

– ప్రభావవంతంగా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ చేసి కేంద్ర-రాష్ట్ర సంబంధాలను పురన్నిర్మించాలి.

**2. స్వావలంబన దిశగా ప్రజానుకూలంగా ఉండే అభివృద్ధి పంథా అమలు కావాలి.**

– అంతర్జాతీయ పెట్టుబడుల రాకపోకలపై కఠినమైన నియంత్రణ, గనుల, చమురు సహజ నిల్వల జాతీయీకరణ, ప్రణాళికాబద్ధమైన, సమతుల్యమైన అభివృద్ధి

– ఆర్థిక, సామాజిక అసమానతల తగ్గింపు, గుత్త సంస్థల అదుపు, ప్రభుత్వ రంగానికి ప్రోత్సాహం, సంపద పునఃపంపిణీ జరిగేలా ద్రవ్య విధానం, పన్నుల విధానం

– సంపూర్ణస్థాయిలో భూసంస్కరణలు, వ్యవసాయ సంబంధాలను ప్రజాస్వామికీకరించడం, అన్ని రకాల పంటలకూ కనీస మద్దతు ధర చెల్లింపును చట్టబద్ధం కావించడం, రైతాంగానికి ఋణవిముక్తి, వేతనాలు, సామాజిక భద్రత ఉండేలా వ్యవసాయ కార్మికులకు కేంద్ర చట్టం, సహకార వ్యవసాయం, సమిష్టి జోక్యంతో ఉత్పత్తి, అమ్మకం నిర్వహణ జరిగేలా పెంపొందించడం

**3. శ్రామిక ప్రజల హక్కులు :**

– జీవనోపాధి హక్కు, ప్రయోజనకరంగా ఉద్యోగాలు, న్యాయమైన వేతనాలు, గృహ వసతి, సామాజిక భద్రత, రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా కార్మిక సంఘాల గుర్తింపు, యాజమాన్యంలో కార్మికుల ప్రాతినిధ్యం, నాలుగు లేబర్ కోడ్ల రద్దు

– ఆహారం, ఇతర నిత్యావసర సరుకులు అందరికీ అందేలా ప్రజాపంపిణీ వ్యవస్థను సార్వత్రికంగా విస్తరించడం

– సార్వత్రిక వృద్ధాప్య పెన్షన్

**4. విద్య, సంస్కృతి**

– విద్యాహక్కు అమలు గ్యారంటీ చేయడం, జిడిపిలో 6 శాతాన్ని విద్యకు కేటాయించడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను విస్తరించి బలోపేతం చేయడం, సార్వత్రిక ఐసిడిఎస్ వ్యవస్థ

– ప్రభుత్వ నిధులతో సార్వత్రిక ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ, అత్యవసర ఔషధాల ధరల తగ్గింపు

– లౌకిక, ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించడం, రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో పేర్కొన్న భాషలన్నింటికీ సమాన హోదా

**5. సామాజిక న్యాయం:**

– కుల వ్యవస్థ, అన్ని రూపాలలోని కుల అణచివేత రద్దు. దళితుల, ఆదివాసీల, మైనారిటీల హక్కుల రక్షణ

– అన్ని రంగాలలోనూ మహిళలకు సమాన హక్కులు, సమాన పనికి సమానవేతనం, మహిళలపై నేరాల విషయంలో కఠిన చర్యలు

– అంగవైకల్యం కలవారి హక్కులకు హామీ, లైంగికంగా మైనారిటీలుగా ఉన్నవారి హక్కుల రక్షణ

**6. ఎన్నికల సంస్కరణలు, పర్యావరణం**

– ఉన్నతస్థాయిలోని అవినీతిని అరికట్టడానికి గట్టి చర్యలు, ఎన్నికల సంస్కరణలు, పాక్షిక జాబితా విధానం ద్వారా దామాషా పద్ధతిన ఎన్నికలు

– పర్యావరణ రక్షణ. విషపూరిత వాయువుల విడుదలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం, అందరికీ ఇంధనం సమానంగా అందుబాటులో ఉంచడం

**7. విదేశాంగ విధానం**

– సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ఎదిరించే ప్రాతిపదికమీద ఆధారపడిన స్వతంత్ర విదేశాంగ విధానం, అమెరికాతో కుదుర్చుకున్న అన్ని రక్షణ ఒప్పందాల నుండి వెనక్కి రావడం

## రాజకీయ విధానం

2.85. దాదాపు 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ పాలనలో నయా ఫాసిస్టు స్వభావం కల మితవాద, మతోన్మాద, నిరంకుశ శక్తులు బలపడ్డాయి. హిందూత్వ–బడా బూర్జువావర్గ కూటమికి మోడీ ప్రభుత్వం ప్రతినిధి. కనుక బిజెపి–ఆరెస్సెస్‌ను, దానికి పునాదిగా ఉన్న హిందూత్వ–కార్పొరేట్ కూటమిని పోరాడి ఓడించడం ప్రధాన కర్తవ్యం.

2.86. బిజెపిని, హిందూత్వ శక్తులను ఒంటరి చేసి ఓడించాలంటే హిందూత్వ సిద్ధాంతం మీద, మతోన్మాద శక్తులమీద నిరంతరాయంగా పోరాటం చేయడం అవసరం. హిందూత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా అత్యంత విశాల ప్రాతిపదికన అన్ని లౌకిక శక్తులనూ సమీకరించడానికి పార్టీ పాటుపడాలి.

2.87. హిందూత్వ–నయా ఉదారవాద పాలనపై పోరాటాలు విజయవంతం కావాలంటే అందుకు సిపిఐ(ఎం), వామపక్షాలు తమ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడం అవసరం. హిందూత్వ– మతోన్మాదం మీద, నయా ఉదారవాద విధానాలమీద జరిపే పోరాటాలను సమ్మిళితం చేయవలసిన అవసరం కూడా ఉంది.

2.88. శ్రామికప్రజానీకంపై దోపిడీని తీవ్రతరం చేస్తూ వారి మనుగడను, జీవన పరిస్థితులను దెబ్బ తీస్తున్న కార్పొరేట్–అనుకూల, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా వర్గ, ప్రజాబాహుళ్య పోరాటాలను నిర్వహించడం ద్వారా మోడీ ప్రభుత్వంపై, బిజెపిపై పోరాటాన్ని నడపాలి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని, జాతి సంపద లూటీని, భారీ స్థాయి ప్రైవేటీకరణను వ్యతిరేకించడంలో, పార్టీ ముందుపీఠీన ఉండాలి.

2.89. పార్లమెంటులోపల, అంగీకృత అంశాలపై పార్లమెంటు వెలుపల ఇండియా బ్లాక్ పార్టీలతో పార్టీ సహకరిస్తుంది. ప్రజాస్వామ్యంపై నియంతృత్వ దాడులను, ప్రతిపక్షాలను, నిరసన స్వరాలను అణచివేయడానికి ఉపయోగిస్తున్న క్రూరమైన చట్టాలను, రాజ్యాంగాన్ని రాజ్య వ్యవస్థలను బలహీనపరచడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించడానికి పార్టీ అన్ని లౌకిక ప్రజాస్వామిక శక్తులతో చేతులు కలుపుతుంది.

2.90. బిజెపిని గట్టిగా వ్యతిరేకిస్తున్న ప్రాంతీయపార్టీలతో పార్టీ సహకరిస్తుంది. అట్టి పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నచోట్ల ప్రజలకు అనుకూలంగా అమలు జరిగే ఏ విధానాన్నైనా పార్టీ బలపరుస్తుంది. శ్రామిక ప్రజానీకం మీద ప్రతికూల ప్రభావాన్ని కలిగించే విధానాలను వ్యతిరేకిస్తూ, వాటిపై ప్రజలను సమీకరిస్తుంది.

2.91. వర్గ, ప్రజా సంఘాల ఐక్య వేదికలను, ఐక్య కార్యాచరణలను పార్టీ బలపరుస్తుంది. బూర్జువా పార్టీలను అనుసరిస్తున్న ప్రజానీకాన్ని ఐక్య కార్యాచరణవైపు సమీకరించడానికి అన్ని ప్రయత్నాలనూ చేస్తుంది.

2.92. పార్టీ తన స్వతంత్ర బలాన్ని పెంచుకోడానికి ప్రాధాన్యతనిస్తూనే, వామపక్ష ఐక్యతను పునరుద్ధరించడానికి, బలోపేతం చేయడానికి ప్రయత్నించాలి. వామపక్షాల ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని వెలుగులోకి తెచ్చే విధంగా వామపక్ష ఐక్య ప్రచారోద్యమాలు, పోరాటాలు ఉండాలి. వామపక్ష ప్రజాతంత్ర వేదిక ఏర్పాటుకు,

కార్యక్రమానికి తోడ్పడే విధంగా ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమాలతో సహా అన్ని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులనూ సమీకరించడానికి పార్టీ కృషి చేయాలి.

2.93. పైన పేర్కొన్న రాజకీయ విధానానికి అనుగుణంగా ఉండే విధంగా బిజెపి–వ్యతిరేక ఓట్లు ఒకదగ్గర సమీకరించబడేలా తగిన ఎన్నికల ఎత్తుగడలను పార్టీ చేపడుతుంది.

## కర్తవ్యాలు

2.94

(1) నయా ఉదారవాద విధానాలకు, హిందూత్వ మతోన్మాదానికి, ప్రజాస్వామ్యంపై నిరంకుశ దాడులకు వ్యతిరేకంగా పార్టీ తన ప్రచారోద్యమాలను, పోరాటాలను ఇప్పటికన్నా పైస్థాయికి తీసుకుపోవాలి.

(2) మనుగడకు ఎదురయ్యే సమస్యలపై, భూమి, ఆహారం, వేతనాలు, ఇళ్ళ స్థలాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలపై గ్రామీణ పేదల, శ్రామికవర్గ, పట్టణ పేదల పోరాటాలను పెంపొందించి పార్టీ వాటిని ఉధృతం చేయాలి.

(3) హిందూత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా అన్ని లౌకిక, ప్రజాస్వామిక శక్తుల విశాల ఐక్యత కోసం పార్టీ పాటుపడుతుంది.

(4) ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక హక్కులు, పౌర హక్కుల రక్షణకు అనుకూలంగా పార్టీ వైఖరి తీసుకోవాలి. నియంతృత్వ దాడులకు, నిరసనల, ప్రతిపక్షాల అణచివేతకు, కేంద్ర వ్యవస్థల దురుపయోగానికి, రాజ్యాంగబద్ధ సంస్థలను దెబ్బ తీయడానికి వ్యతిరేకంగా విశాల ఐక్యతను నిర్మించడంలో పార్టీ సహకరించాలి.

(5) అన్ని రూపాల కుల అణచివేతకు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాన్ని పార్టీ చురుకుగా చేపట్టాలి. మహిళల, దళితుల, ఆదివాసీల, మైనారిటీ మతస్తుల హక్కుల రక్షణలో పార్టీ మొనగాడిలా నిలబడాలి. గిరిజన ప్రాంతాలలో పని పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

(6) మోడీ ప్రభుత్వపు అమెరికా–అనుకూల విదేశాంగ విధానాన్ని , అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ భారతదేశ ప్రజానీకంలో సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పెంచడానికి పార్టీ కృషి చేయాలి.

(7) రాష్ట్రాల హక్కులను, సమాఖ్యతత్వాన్ని రక్షించడం కోసం పార్టీ అన్ని శక్తులనూ సమీకరించాలి. కేరళ లోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ రక్షణకోసం పార్టీ

నిలబడి, ఆ ప్రభుత్వం చేపడుతున్న ప్రజానుకూల విధానాల అమలును బలపరచాలి.

(8) వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం కోసం పార్టీ కృషి చేయాలి. వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమాన్ని ప్రత్యామ్నాయంగా ముందుకు తేవాలి. సోషలిజమే ప్రత్యామ్నాయం అనే ప్రచారోద్యమానికి దీనిని తోడు చేయాలి. అది భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా ఉండే సోషలిజం.

## సవాళ్ళను ఎదుర్కోడానికి కదలండి

2.95. పై కర్తవ్యాలను నెరవేర్చడానికి పార్టీ స్వతంత్ర శక్తిని చాలా పెద్దస్థాయిలో పెంపొందించడం అత్యంత అవశ్యం.

– సైద్ధాంతికంగా, సాంస్కృతికంగా, నిర్మాణపరంగా బిజెపి–ఆరెస్సెస్‌తో పార్టీ తలపడాలి.

– నయా ఉదారవాద వ్యవస్థ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, గ్రామీణ పేదలు, తక్కిన అన్ని రకాల శ్రామిక ప్రజలు అందరి యొక్క పోరాటాన్ని పట్టుదలగా పార్టీ చేపట్టాలి.

– అన్ని వామపక్ష ప్రజాతంత్ర శక్తులనూ సమీకరించి ప్రజలముందు నిజమైన ప్రత్యామ్నాయాన్ని చూపించాలి.

2.96. **యావత్తు పార్టీ భారతదేశ ప్రజలందరికీ ఈ తీర్మానపు రాజకీయ, సైద్ధాంతిక సందేశాన్ని తీసుకుపోదాం! ప్రజల్లో లోతుగా వేళ్ళూనుకున్న నిర్మాణం కల బలమైన అఖిల భారత పార్టీని నిర్మించడానికి ముందుకు సాగుదాం!**

**కమ్యూనిస్టు ఉద్యమానికి గల ఘనమైన వారసత్వపు పునాదిపై నిర్మించిన పార్టీగా మన ముందున్న సవాళ్ళను ఎదుర్కోడానికి ఒక్కటై కదులుదాం!**

# ముసాయిదా రాజకీయ తీర్మానానికి సవరణలు పంపేందుకు అనుసరించాల్సిన పద్ధతి

**ముసాయిదా రాజకీయ తీర్మానానికి** సవరణలను పంపడానికి దిగువ పేర్కొన్న పద్ధతిని అనుసరించాలి :

1. ప్రతీ సవరణలోనూ పేరా సంఖ్య, లైను సంఖ్యలను పేర్కొనాలి.
2. సవరణను ప్రతిపాదిస్తున్న కామ్రేడ్ లేదా శాఖ పేరును, పేర్కొనాలి.
3. 2025 మార్చి 5వ తేదీలోగా అన్ని సవరణలూ చేరాలి.

4. ఇ మెయిల్ ద్వారా పంపే సవరణలన్నీ టెక్స్ట్ లేదా వర్డ్‌ఫైల్ గానే పంపాలి. ఇంగ్లీషులో గాక వేరే భాషలలో సవరణలను పంపేవారు పిడిఎఫ్ ఫైల్‌ను పంపాలి.
5. ఇమెయిల్‌కు పంపేటప్పుడు సబ్జెక్ట్ "ముసాయిదా రాజకీయ తీర్మానానికి సవరణలు" అని పేర్కొనాలి. pol-24@cpim.org కి పంపాలి.
6. పోస్టు ద్వారా లేదా కొరియర్ ద్వారా సవరణలు పంపగోరువారు దిగువ చిరునామాకు పంపాలి :

***Communist Party of India (Marxist)***
***Central Committee,***
***A.K. Gopalan Bhawan,***
***27-29, Bhai Vir Singh Marg,***
***New Delhi - 110 001***

7. కవరుపై "ముసాయిదా రాజకీయ తీర్మానానికి సవరణలు" అని రాయాలి.
8. దిగువ ఫార్మాట్‌లో సవరణలను పంపాలి:

| వరుస నెం | పేరా నెం. | లైను నెం | సవరణ | ప్రతిపాదకులు |
|---|---|---|---|---|
| **1** | | | | |
| **2** | | | | |
| **3** | | | | |
| **4** | | | | |
| **5** | | | | |
| **6** | | | | |
| **7** | | | | |
| **8** | | | | |

ప్రచురణ కాలం : జనవరి, 2025

ప్రతులు : 5000

వెల : రూ. 20/-

165064

ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు),** ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2

ఫోన్ నెం. 0866-2577202, 9490099057